ఆంధ్ర సచిత్ర వారపత్రిక



13-7-79
75 పైసలు



సర్వతోముఖ సౌందర్యపోషణ-

ఎప్పుడైనా-

ఎక్కడైనా-

క్రూక్స్ లాక్టో కేలమైన్.
ఇది కోల్డు క్రీమువలె శుభ్ర పరచుట యేగాక కావలసిన తేమనిచ్చుచు మీ శరీరమును మృదువుగా నుంచును కనుక మీరు లాక్టో కేలమైన్‌ను నిస్సంకోచముగ కోల్డు క్రీములా వాడవచ్చును.

ఇంతేకాదు క్రూక్స్ లాక్టోకేలమైన్ ఇంకా ఎక్కువగ వుపయోగపడుతుంది. ఇందులోని 'కేలమైన్' 'విచ్ హేజల్' మీ చర్మమును సొగసుగ కాపాడును. మరొక ప్రత్యేకత యేమంటే, లాక్టో కేలమైన్ యేవేళలనైనను. రాత్రిగాని, పగలుగాని ....ఉపయోగించదగిన 'మేకప్'. ఇందులో 'ఫౌండేషన్'కు కావలసిన పదార్థములున్నవి.

మీరు క్రూక్స్ లాక్టోకేలమైన్ వాడునపుడు మరేవిధమైన 'మేకప్' అవసరములేదు.

కళంకరహిత సౌందర్యానికి

క్రూక్స్ లాక్టో-కేలమైన్



క్రూక్స్ ఇంటర్‌ఫాన్ లిమిటెడ్
బొంబాయి — 26.

CIL.3 TEL

చిన్న సైజులో కూడా యిప్పుడు లభిస్తుంది

ఉత్తరాలు

ముఖచిత్రం

22—11—68 ఆంధ్రసచిత్ర వారపత్రికలో ఉమెన్ గారు తమ కార్ట్యూన్‌లో సుశీలా నయ్యర్ గారికి లో—కట్ బ్లవుజు తొడిగించారు. ఈ విధంగానే శ్రీమతి ఇందిరాగాంధి కూడ లో కట్ బ్లవుజు వేసుకున్నట్లు ఇంతకుముందు చిత్రించారు. ఇది చాల ఘోరం!

ధనంజయపాత్రో (బరంపురం)

* * *

ఆంధ్రసచిత్రవారపత్రిక ఆంధ్రుల పత్రికగా ఉన్నప్పుడు తెలుగు తారకాని నటి షీలా (మళయాలతార)ను తరుచుగా ముఖచిత్రముగా వేయుటకు గల కారణం తెలుపగలరా?

గుడి కన్నయ్య (నెల్లూరు).

* నటి షీలా తెలుగు సినిమాలలో కూడా వేస్తున్నారు. సం॥

కథలు

తాళ్ళూరి నాగేశ్వరరావుగారి 'మమత —భ్రమత' కథానిక చాలా చక్కగా వుంది. తెలుగు వాతావరణాన్ని పట్టి చూపించారు రచయిత నాగేశ్వరరావుగారు.

హోల్‌మొత్తం, ఆదికం మొదలైన నూత్న పదాల్ని వాడారు. సిథంగా నేటి రచయితలు యిలాంటి మాటల్ని వాడడంలేదు. (కొనకళ్ల వెంకటరత్నంగారు 'కులభ్రష్టుడు' అనే చిన్న నవలలో నలుగురివోళ్ళల్లో నలిగే చాలా క్రొత్త పదాల్ని వ్రాశారు.)

అలాగే నాగేశ్వరరావుగారు కూడా మనక్కొన్నింటిని చూపించారు. రచయితకు సాధన్యవాదాలు.

విశ్వేశ్వరరావు (చల్లపల్లి)

సీరియల్

పత్రిక అనెడు వందనవనంలో "సుజాత" అనే పారిజాతం ప్రతివారం తావిని విరజిల్లుతుంటే పత్రిక కోసం ఎదురు చూసేవాళ్ళం. ఇంత త్వరలో పారిజాతం వాడి రాలిపోతుందనుకోలేదు. ఏమైనా ముగింపు చాల బావుంది. మహిగారి "ఇదీ ప్రపంచం అనే కథ" అద్భుతంగా వుంది. వాస్తవిక ప్రపంచములో సీత లీల వంటి వనితలు అనేకులు. కాని వారిని అర్థం చేసుకొని సానుభూతి చూపేవారే కొరత. జీవిత వలయాలు సీరియల్ చాలా ఆసక్తికరంగా వుంది.

కన్నెల బృందం (యలమంచిలి)

* * *

సుజాత సీరియల్ ముగింపు బాగానే ఉంది. నేను ఉహించినట్లే సుజాత చనిపోవడం జరిగింది. చిన్న నవలే అయినా మంచి సినిమాలా నడిచింది. ప్రచురించిన మీకు నా ధన్యవాదాలు.

సియ్యస్. రావ్ (బరంపురం.)

* * *

"నీలాంటి ఒకరు" గొలుసు కథ బావుంది.

ఎస్. దేవి (వేళంగి)

* * *

ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించిన సీరియల్ 'సుజాత' పాటకుల నెంతో ఆకర్షించినది. చివరికి సుజాత జీవితం విషాదాంతము అయినందుకు నాకు చాల విచారము కలిగినది. ఇటువంటి మరియు సుఖాంతము గల సీరియల్స్ మంచివి ముమ్ముందు ప్రచురించ గలరని ఆశిస్తున్నాను.

ఎస్. సి. తాయారు (నెల్లిమర్ల)


CIBA
పట్టువంటి మృదుత్వము, కోమలము వంటి సున్నితమైనది
వసంతము వలెనూతనత్వం...
ప్రత్యేకమైన పరిమళము కల్గినది
Binaca
Talc
Binaca
Talc
Binaca
Talc
బినాకా
దుర్గంధమును మాపి
మృదుత్వము
కల్గుచేయు టాల్కు.

వ్యాసాలు

శ్రీ. 29—11—68 తేది పత్రికలో 'కాన్సూర్' మిత్రత్రయంవారి "స్పెరిఫిక్" చాలా 'ట్రాజెడీ'గా వుంది. కొన్నివందల వేల చేతులు అలంకరించే పత్రికకు ఆ "కాంప్లిమెంట్" మహాఘోరంగా వుంది. ఏది విజ్ఞానం? ఏదికాదు?! మనకి 'ఇంటరెస్టింగ్' అయితే ఇతరులపై బలవంతంగా రుద్దడం, రుద్దమనడం విజ్ఞానమా?

అసలు ఆ లేఖపై సం. వ్యాఖ్య లేకపోవడం అస్మదాదుల (పాఠకుల) దురదృష్టం.

"ఎన్నార్" (రాజమండ్రి)

* * *

1—11—68 తేది నాటి ఆంధ్రసచిత్రవార పత్రిక చదివాను. అయితే దురదృష్టవశాత్తు ఆ పత్రిక వచ్చిన 10 రోజుల తరువాత చదవడ మయినది. అందులో శ్రీకృష్ణగారు వ్రాసిన ఢిల్లీ లేఖ చదివి ఈ ఉత్తరము రాయలేకుండా యుండలేక పోయాను. ఎందుకంటే ప్రస్తుతము ఎన్నో పత్రికలు వెలువడుతున్నాయి. రాజకీయాలకు సంబంధించిన శీర్షికలు ప్రచురిస్తున్నాయి. కాని ఆంధ్రసచిత్ర వారపత్రికను మినహాయిస్తే ఇంకేవియు నిష్పక్షికమైనవియు నిర్దుష్టమయినట్టియు సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నాయి. అందువలన ఈ విషయంలో శ్రీకృష్ణగారు ఎంతో అభినందనీయులు. ప్రభుత్వ పాలనను, ప్రతిపక్ష నాయకులను కళ్ళకు కట్టినట్లు వ్రాస్తున్నారు. ఈ నాటి యువక ప్రపంచంలో చెప్పలేని సంచలనం ఉద్రేకం కలుగుతుంది "ఇత్తావులను పోషిస్తున్న భారత దేశం" అని పొడ్డింగు ఇవ్వడంలోనే నేటి దేశ పరిస్థితులను శ్రీకృష్ణగారు కళ్ల ఎదుట పెట్టారు.

డి. మోహనరావు (ఖిలాడ్)

* * *

ఉత్తరాలు

శ్రీ. 29—11—1968 ది సచిత్ర వార పత్రిక న్యూఢిల్లీ లేఖలో శ్రీకృష్ణగారు., రాజస్థాన్‌లో తిండిలేక ఎండిపోతున్న గోవుల సంరక్షణకు పూరీశంకరాచార్యుల వారు పూనుకున్నట్టు కనిపించలేదని వ్రాసేరు. కాని రాజస్థాన్ గోవుల సంరక్షణకు ఒక మొక కార్యక్రమము చేపట్టినట్టు శ్రీ శంకరాచార్యులవారు ప్రకటించినట్లు ఈ మధ్య మూడు లేక నాలుగు సార్లు పత్రికలలో నేను చూసేను. కొద్ది రోజుల క్రితము హైదరాబాద్ నగరంలో జరిగిన ఆర్యమహాసభలలో పాల్గొన్న సమయంలో కూడ వారట్టి ప్రకటనచేసినట్లూ వెంటనే అచట వున్న ఒక దాతకొన్నివేల రూపాయిలు విరాళమిచ్చినట్టుగా కూడ నేను పత్రికలలో చూసేను. వస్తువపరిస్థితులు ఈ విధంగావుండగా శ్రీ శంకరాచార్యులవారు గోసంరక్షణకు ఏమీ చేయుట లేదని శ్రీకృష్ణగారు వ్రాయటంచాల విచిత్రంగా వుంది. విమర్శ చేసే టప్పుడుకాస్త వాస్తవ పరిస్థితులను తెలుసుకోవటం, ప్రజలను పెడత్రోవ తొక్కించే అసత్య వర్తలను అందులోను శ్రీ శంకరాచార్యులు వంటిమహనీయుల విషయంలో ప్రచారం చేయకపోవటం వాంఛనీయం.

ఉలిమిరి సన్యాసమ్మ (వి. కోడూరు)

***ఉలిమిరి సన్యాసమ్మగారూ, తాము వయివార్తలను ఏ పత్రికలలో చూచారో చెప్పగోరుతాము. —సం.**

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 13—12—'68
కీలకనామ సం॥ మార్గశీర్ష మాసం బహుళ అష్టమి
సంపుటము : 61 సంచిక : 16

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటుడు అక్కినేని నాగేశ్వరరావు


ఎంత అద్భుతం!
భారత దేశం
భయం!

బ్రెజ్నేవ్ సిద్ధాంతం, భారత రాజ్యాంగం

పోలాండ్ కార్మికులపార్టీ అయిదవ సమావేశంలో, వార్సాలో, నవంబరు 11న మాట్లాడుతూ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ బ్రెజనేవ్ ఇలా అన్నారు—

'సోషలిజానికి విరోధంగా ఉండే శక్తులు లోపలనుంచి కాని, బయటి నుంచి కాని బయలుదేరి ఒక సోషలిస్టు దేశం అభివృద్ధిని తిరిగి పెట్టుబడిదారి పద్ధతికి మార్చటానికి చూస్తే, ఆదేశంలో సోషలిజానికి ప్రమాదం ఏర్పడితే, సోషలిస్టు సమాజం మొత్తం ప్రమాదానికి గురి అయితే— ఆ దేశం ప్రజలేకాక అన్ని సోషలిస్టు దేశాల ప్రజలూ ఆ సమస్యని పట్టించుకోవలసి వస్తుంది.'

గోముల్కా హెచ్చరిక

పోలిష్ నాయకుడు శ్రీ గోముల్కా పాశ్చాత్య దేశాల కమ్యూనిస్టులని హెచ్చరించారు; 'పార్లమెంటరీ పద్ధతుల మీద అధికారంలోకి రావాలనుకుంటున్న వారిని తూర్పు యూరోప్ దేశాల క్రామేడులు ప్రోత్సహించరు, అన్నారు.

ఇకపయిన ఏదయినా ఒక కమ్యూనిస్టు దేశం గాడి తప్పితే క్రెమ్లిన్‌కి దానిని శిక్షించే హక్కు, కర్తవ్యం ఉన్నాయనే కదా శ్రీ బ్రెజనేవ్ సిద్ధాంతం యొక్క సారాంశం.

రష్యావాసులు

భారత కమ్యూనిస్టుపార్టీ రష్యాకి దాస్యం స్వీకరించిన సంగతి రహస్యం కాదు. ఈ పార్టీ అధిపతి శ్రీ డాంగే ఇటీవలే 36పేజీల పత్రం ఒకటి తయారుచేశారు. ఈ పత్రంలో ఆగస్టు 21న జరిగిన చెకోస్లొవాకియా ఆక్రమణని సమర్థించారు. వార్సా ఒప్పందం దేశాలు, రష్యా సేనలతో కలిగించుకోనక పోయినట్లయితే చెకోస్లొవాకియా సోషలిస్టుదేశాల సమాజంలో నుంచి విడిపోయి ఉండవచ్చునన్నారు. రష్యన్లు, 'వారి భారతీయ మిత్రులూ, ఇతర విదేశ మిత్రులు మరి రెండు కల్పనలు చేశారు — ఒకటి, పరిమితమయిన స్వాతంత్ర్యం; రెండు, 'సోషలిస్టు దేశాల కామన్వెల్తు.'

ఇదే విధానాన్ని భారతదేశంలో అమలుపరిస్తే రష్యాగాని, శ్రీ డాంగే గాని ఊరుకుంటారా?

భారతదేశమే ఒక రకమయిన కామన్వెల్తు. ఒక్కొక్క రాష్ట్రానికీ పరిమితమయిన స్వాతంత్ర్యమే ఉంది. ఇది రాజ్యాంగమే చెప్తుంది.

బ్రెజ్నేవ్ సిద్ధాంతం వర్తిస్తే?

'ఇండియన్ నేషనల్ కాంగ్రెసు పార్టీకి విరోధమయిన శక్తులు దేశంలోగాని దేశం బయటగాని బయలుదేరితే, ఒక భారతీయ రాష్ట్రాన్ని కమ్యూనిస్టులకి అనువుగా ఉండే వయిపు తిప్పితే; అప్పుడు ఆ రాష్ట్ర ప్రజలేకాక భారత కేంద్రప్రభుత్వం కూడా పట్టించుకోవలసి వస్తుంది...' అని బ్రెజనేవ్—సిద్ధాంతం ప్రకారం వాదించవచ్చు.

అన్ని విషయాలలోనూ రష్యా ఏది చెపితే అది న్యాయం అని అంగీకరించాలి అంటారు శ్రీ బ్రెజనేవ్. అలాగే అన్ని విషయాలలోనూ భారతదేశంలోని కేంద్ర ప్రభుత్వం ఏది చెప్తే దాన్ని న్యాయంగా రాష్ట్రాలు ఎందుకు అంగీకరించరాదు?

కేరళ, పశ్చిమ బెంగాల్

పోయిన ఏడాది పశ్చిమ బెంగాలులోనూ, ఈనెల (నవంబరు)లో కేరళలోనూ ఇటువంటి పరిస్థితే ఏర్పడింది.

చెకోస్లొవాకియాలో పరిపాలన ఉదారంగా ఉండాలన్నారు. తెల్లిచ్చేరిలో నియంతృత్వాన్ని కోరే శక్తులు ఒక పోలీసు స్టేషనుని చేజిక్కించుకొనటానికి ప్రయత్నించాయి. టెలిఫోన్ తీగెలు కోశారు, ఎందరివద్దనో మందుగుండు సామాను, ఈటెలు, బాకులు లాటీలు దొరికాయి. ఇవి ఆటకోసం సేకరించినవా చంపటానికా?

మార్గదర్శి

శ్రీ బ్రెజనేవ్ కాంగ్రెసుకి పెద్ద ఉపకారం చేశారు. మార్గదర్శకులు అయ్యారు. వారి సూచనలని శ్రీమతి గాంధీ అనుసరిస్తారో లేదో చూడాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ధిక్కరిస్తే కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తుంది? శ్రీ బ్రెజనేవ్ చెకోస్లొవాకియాలో చేసిన పనే చేస్తుందా?

చెయ్యదు!

అని గట్టిగా చెప్పవచ్చు.

ఎలా చెప్పవచ్చు, అంటే— అంత పనే గనుక చేస్తే శ్రీ బ్రెజనేవ్‌కి కోపం రావచ్చు.

వారికోపం భరించగలిగే శక్తి మన ప్రభుత్వానికి ఉన్నదా?

ప్రావ్దాలో శ్రీ గోట్లో

ఇటీవలే 'ప్రావ్దా' పత్రికలో శ్రీ యూరీ గోట్లోబర్ అనే ఆయన ఇలా రాశారుట—

'భారతదేశం మొదలయిన అభివృద్ధి చెందుతున్న దేశాలయొక్క రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో కలుగచేసుకుని, కుతంత్రాలని పన్నుతున్నవి అమెరికా సంయుక్త రాష్ట్రాలు. ఈ కుతంత్రాలు ఆ దేశంయొక్క సామ్రాజ్యవాద విధానాలలో ఒక అంశమే...'

'...వారు (అమెరికన్లు) భారతదేశంలో వివిధ విద్యాసంస్థలు నెలకొల్పారు. ఇక్కడ సైద్ధాంతిక యుద్ధం తీవ్రంగా కొనసాగుతూ ఉంది. 'శాంతిసేన' మోరల్ రీ—ఆర్మమెంట్, ఏసియన్ ఫండ్ మొదలయిన న్యాయబద్ధమయిన సంస్థల సహాయంతో కళాశాలల, విశ్వవిద్యాలయాలలో

సైద్ధాంతిక విధ్వంసం కొనసాగిస్తూ ఉంటారు...' అన్నది ప్రావ్దా.

అంతేకాదు, ఏషియన్ ఫండ్‌ద్వారా అమెరికా సుమారు 3 కోట్ల డెబ్బయి అయిదు లక్షల రూపాయలు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో రానున్న అయిదు సంవత్సరాలలో ఖర్చు చేస్తుందని ప్రావ్దా వెల్లడించింది. ఈ విశ్వవిద్యాలయాన్ని అమెరికన్లు ప్రత్యేక శ్రద్ధతో చెడగొడుతున్నారుట.

'26 మంది ఢిల్లీ విశ్వవిద్యాలయం ఉపాధ్యాయులు ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటన 'న్యూ ఏజ్' పత్రికలో పడింది. అందులో అమెరికా భారతదేశాన్ని సైద్ధాంతికంగా ఎలా లొంగదీసుకుంటున్నదో వివరించబడి ఉంది.' అన్నది ప్రావ్దా.

ఉపాధ్యాయులు అమెరికా సామ్రాజ్య తంత్రాన్ని ఎదిరించే ఉద్యమం ప్రారంభించారని ప్రావ్దా రాసింది.

లాభంలేని ప్రశ్నలు

ఈ సందర్భంలో అడిగి లాభంలేని కొన్ని ప్రశ్నలని అడగవచ్చు. ఉదాహరణకి, రష్యాని గురించి ఏ అమెరికన్ పత్రికలోనో—న్యూయార్క్ టయిమ్స్ అనుకోండి—ఇలాగ రాస్తే శ్రీమతి గాంధీ, కొందరు పురోగమనవాదులూ ఏమనేవారు? పార్లమెంటులో హడావుడిచేసి ఉండేవారు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని అమెరికా వర్గాలు నాశనం చెయ్యటానికి ఉద్యుక్తులవుతున్నారని ఆరోపించేవారు. మన ఆంతరంగిక వ్యవహారాలలో కలుగచేసుకుంటున్నారనేవారు.

వ్యాసం ప్రభావం

ఇక ప్రావ్దా వ్యాసం ప్రభావం ఏమిటి? ఢిల్లీ విశ్వవిద్యాలయం వయిస్-ఛాన్సలర్‌ని అమెరికా ప్రభావాన్ని అరికట్టనందుకు కొందరుపెద్దలు మందలించి ఉండవచ్చు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఒక పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి మార్క్సిస్టు.

'అమెరికాకి సంబంధించిన విషయం ఒకటి. అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు తమ మాతృదేశం యొక్క భద్రతకి సంబంధించిన రహస్యాలు ఎన్నో రష్యాకి అందచేశారు. కొందరిని కారణం లేకుండా నేరస్థులుగా అమెరికన్ అధికారులు, కోర్టులు నిర్ణయించి ఉండవచ్చు. కాని, అమెరికన్ కమ్యూనిస్టులు మాత్రం రష్యాకే విశ్వాసపాత్రులుగా ఉంటారనటంలో అసత్యం ఏమీ లేదు. ఎందరో సభ్యులకి తమ పార్టీ నిర్మాణం, విధానాలు సవివరంగా తెలియవు. అంతా ఆదర్శాలే అనుకుంటారు.

పయిన చెప్పినది గూఢచార వృత్తికి సంబంధించినది. ఇదికాక అసత్య ప్రకటన ఉంది. ఇది కూడా ప్రమాదకరమయినదే.

అమెరికన్ కమ్యూనిస్టు పార్టీలో సుమారు 60,000మంది సభ్యులు తీవ్రవాదులనటానికి సాక్ష్యం ఉంది. నిర్ణీత దినంనాడు తమ దేశాన్ని విదేశ వర్గాలకి వొప్పచెప్పడం వారి లక్ష్యం. ఈసాక్ష్యం సాధారణమయిన ప్రజాస్వామ్య పద్ధతులని అనుసరించే దేశాలలో నమ్మదగ్గట్టుగా ఉండకపోవచ్చు. అటువంటి పరిస్థితులలో ముఖ్య లక్షణాన్ని పట్టి చర్య తీసుకోవచ్చునా? ప్రజాస్వామ్యాన్ని రక్షించటానికి ఇది అవసరమేమో.

రెండు పార్టీల లక్ష్యం

భారతదేశంలో రెండు కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి. ఒకటి రష్యా దాసు అది. రెండవది చెయినా దాసులది. అయినా రెండుపార్టీల ముఖ్య లక్ష్యమూ ఒకటే రకమయినది—భారతదేశాన్ని విదేశ వర్గాల లొంగుబాటులో ఉంచటమే. ఈ సంగతి అందరికీ తెలుసు. కాని, పాశ్చాత్యదేశాల మీది కోపంతో వీరిని పెరగనిచ్చి మన నాయకులు వారిని రెండు రాష్ట్రాలలో ఎన్నికలలో కూడా గెలవనిచ్చారు. ఎన్నికలలో గెలిచి పరిపాలించే కమ్యూనిస్టు పార్టీ(లు) ఒక్క భారతదేశంలోనే ఉన్నది (ఉన్నాయి). ●



కాత్యాయని కలలు

ఎస్. రంజానబి

ప్రపంచంలో ఆశ, కోరిక లేని మానవుడు లేడు. బహుశ ఆశ కోరికలేని మనిషి వున్నాడంటే అతనిలో ఓ దివ్య శక్తి వున్నట్లే! అతను దైవస్వరూపుడే! ఈ ఆశా కోర్కెలకు స్త్రీ పురుష వ్యత్యాసాలు, చిన్నా—పెద్దా తేడాలు, గొప్ప—బీదా తారతమ్యాలు అనేవి లేవు. పసికందు దగ్గరినుండి పండు ముదుసలివరకు 'కోరిక' అనేది వుండటం సహజం. ప్రతి వ్యక్తి భవిష్యత్తును గురించి బంగారు కలలు కనటం, ఆ కలలు ఫలించినా ఫలించక పోయినా రోజు రోజుకు వాటికొక విశిష్ట రూపకల్పన సృష్టించి సంతృప్తి చెందుతాడు. ఆనందిస్తాడు. ఆ ఆశతోనే జీవిస్తాడు. మనిషి ఆశాజీవి.

అనుకున్న కోరికలు, ఆశలు, ఆశయాలు నెరవేరితే మానవుని స్వైరవిహారానికి, ఘాతుక చర్యలకు ఓ హద్దూ—పద్దూ అంటూ వుండదు.—పైగా జీవితంలో అనుకున్నవన్నీ జరిగితే యింత లాయలాసం జంజాటనం బాధలు వ్యథలు కూడా వుండవు.

కన్న కలలన్నీ ఫలించితే మానవునికి పట్టపగ్గాలే వుండవు. అందుకనే మనిషి చుట్టూ ఓ అతీతమైన శక్తి పరిభ్రమిస్తూనే వుంది. దానినే 'విధి' అని రెండక్షరాలలో సతతం మననం చేసికొంటున్నాడు. విధికి నిర్వచనం 'యిదీ' అని ఖచ్చితంగా చెప్పటం కష్టం!

ఆశ ప్రక్కన నిరాశ—కోరిక ప్రక్కన వ్యథ, కల ప్రక్కనే చీకటి వెన్నాడుతూనే వుంటాయి అసలు జీవితమంటేనే ఆశా నిరాశల సమ్మేళనమని మన పెద్దలు ఏనాడో నిర్వచించారు. అది నాటికి నేటికి ఏనాటికైనా చెరిగిపోని సత్యం!

కాత్యాయనికూడ పై కోవకు చెందినదే! చిన్నప్పటినుండి కాత్యాయని కమ్మనికలలు

కన్నది. భవిష్యత్తుని గురించి బంగారు వూహాలను సృష్టించుకొని నీలాకాశంలో స్వేచ్ఛా విహంగంలా విహరించింది. ఆ విహారంలో మైమరచిపోయింది. మురిసిపోయింది. కాని—యీనాడు? ఆశలోనే నిరాశ నిస్పృహ. కోర్కెలోనే బాధా వ్యధా. కలలోనే కాఠిన్యం కటిక చీకటిని సృష్టించుకొని సంఘాన్ని దృష్టిలో పెట్టుకొని దాని విమర్శనలకు, హేళనలకు, అవమానాలకు లోను కాకుండా వుండాలని తన కోర్కెలకు ఆశలకు ఆశయాలకు స్వస్తిచెప్పి స్మశానంలాటి తన హృదయంలో వాటిని సమాధి చేసింది.

తన పదహారవ యేటనుండి డాక్టరు చదివి 'మానవసేవే మాధవసేవ' అనే సూత్రం తు. చ. తప్పకుండా ఆచరించి సంఘంలో సుస్థిరమైన స్థానాన్ని, కీర్తిని గడించాలనీ డబ్బుకన్న మనిషికి మంచి తనమే నిజమైన ధనమని నిరూపించి ప్రజలతో ఓ అద్భుతమైన చైతన్యాన్ని రేకెత్తింపజేయాలని, ఆనాడే తనకు నిజమైన పరిపూర్ణత సిద్ధించడమే కాక తన జీవితం ధన్యమౌతుందనే వూహించింది. సముద్రం అలలపై తేలిపోతున్నట్టు కలల అలలలో సోలిపోయింది, వూగిపోయింది.

కాని ఈనాడు? డాక్టరు బదులు హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి చేపట్టి మోయలేని భారంతో సుశీల, రమ, సురేష్‌లను పోషించుతుంది. అడుగడుగున ఆర్థిక బాధలే! అణువణువున దహించుకుపోయే అవమానాలే! తనకు వచ్చే నూటడెబ్బది రూపాయలలోనే సురేష్ ఫీజులు కట్టాలి! సుశీలకు మందులు వాడాలి! రమకు చక్కచక్కటి ఫ్రాకులు కుట్టించాలి. చాలీచాలని జీతం. ఘోషలేని, బ్రతకలేని జీవితం.

రానురాను కాత్యాయనికి జీవితమంటేనే విరక్తి చెందుతుంది. స్కూలులో తోటి వుపాధ్యాయునితో మాట్లాడితే తప్పు! బజారులో తెలిసినవారు కన్పించితే పలకరించటం తప్పు! నిత్యావసరాలకు ఒకటికి రెండుసార్లు బజారు వెళితే తప్పు! అంతా తప్పే! అంతా అపవిత్రతే! బహుశా కన్యాజీవితమే కత్తిమీద సాములాంటిది కాబోలు!

ఆరోజు ఆదివారం కావటంవలన రవీంద్రగారి గీతాంజలి తీసి చదవడం ప్రారంభించింది

మౌనం అభివ్యక్తమైతే భాష.
భాష అవ్యక్తమైతే మౌనం.
మౌనం భావానికి చెందింది.
భాష రూపానికి చెందింది.

భాషారూపం మౌనభావాన్ని ప్రస్ఫుటపరుస్తుంది. మౌనభావం భాషారూపాన్ని రూపొందిస్తుంది. భావాన్ని వ్యక్తపరిచేదే భాష. నిశ్శబ్దాన్ని సశబ్దం చేసేదే భాష'

కాత్యాయని ఎంతో మధురంగా నాల్గు ఐదు సార్లు చదువుకొని ఏదో తన్మయత్వంతో అవ్యాజమైన అనుభూతిని పొందినట్లే భావించి తన ప్రమేయం లేకుండానే పుస్తకంపై నీటి బిందువులను రాల్చేసింది.

అబ్బ! ఎంత తియ్యటి రచన! ఇటువంటి ఉత్కృష్టమైన రచన సాగించాలంటే అందరికి సాధ్యమేనా? రవీంద్రులు వారు ఎంతటి మహనీయులో! నిజంగా పూర్ణ పురుషులే!

మహత్తుకు ఆలవాలమైన భారత భూమిలో పుట్టిన తనేమి మహత్త్వాన్ని పొందలేకపోయింది. 'నాలో ఏ అద్భుతశక్తి మహత్తర రచనాసంపత్తి కూడా లేదు కదా!' అని కిటికీ చువ్వల గుండా ఆకాశాన్ని ఆవరించిన మేఘాల సంరంభాన్ని చూస్తూ 'మేఘములో మెరుపుంది నా జీవితంలో వెలుగేది? భగవంతుడు నన్ను మనిషిగ సృష్టించాడే కాని నొసటన సుఖమూ—శాంతీ వ్రాయుట మరిచాడా? పూర్ణిమానిశరత్తు నా జీవితానికే లేదా?' అని ఆలోచిస్తున్న కాత్యాయని దభీలుమని వంటింట్లో గిన్నె మ్రోగటంతో జడుసుకున్నట్లుగ వులిక్కిపడి వంటింట్లోకి వెళ్ళి 'సుశీ! ఏమిటే పడేశావు?' అన్నది లోపలకు తొంగిచూస్తూ...

'కళ్ళు పొగతో కమ్ముకుపోయినా, చేతులు వ్రేళ్ళు కాలినా, గిన్నెలు పగిలినా నాకేం బాధ? కురులు చెదరకుండ కుచ్చెళ్ళు నలగకుండ కూర్చుంటావు? వెట్టి చాకిరంతా చేయమని నానొసట వ్రాశాడు దేవుడు! ఎవర్ని అని ఏం ప్రయోజనం? అందరికీ సుఖపడే రాత వుండొద్దు! అదేమంటే సంపాయించి మీ మొఖాల్న వేస్తున్నానంటున్నావు?' అన్నది చకచక కోపంతోనే సుశీల.

అన్యం పుణ్యం ఎరుగని సుశీలలో యింతటి వాక్పటిమ, గాంభీర్యం వున్నదని ఎన్నడూ ఆలోచించని కాత్యాయని నిజంగా ఆ మాటల ప్రవాహానికి సంభ్రమరాలై పోయింది క్షణ కాలం.

'పాపం! సుశీల చిన్నది! బాధలు బరువులు భరించటం అస్సలు అనుభవించలేని అమాయకత్వం! పాపం నిద్ర లేచినది మొదలు యింట్లో పనులన్నీ తానే చూచుకోవటం వలన పైగా ఆదివారమైనా అక్క సహాయపడలేదన్న కోపంతో అన్నదే కాని బుద్ధిపూర్వకంగ సుశీల అన్న మాటలు కావవి.' అని సరిపెట్టుకొని మామూలుగ తన గదిలోకి వచ్చి డిక్షనరీలో భద్రంగ దాచిపెట్టుకొన్న ఓ లేఖ తీసి చదవనారంభించింది...

డియర్ కాంతి!

నాయీ సంబోధనకు ఆశ్చర్యపోతున్నావా? స్కూలు అడ్రసుతో నీకు జాబు వ్రాయటం ఓ పెద్ద సాహసమేననుకుంటాను. దయచేసి నన్ను చీదరించుకొనక సమాధానం ఇస్తావు కదూ!

కాంతి!

ప్రపంచంలోని కరుణంతా నీ కళ్ళల్లోనే నిక్షిప్తమైనదనుకొంటున్నాను కవ్వించే నీ కళ్ళన్నా పిరుదలను తాకుతూ వయ్యారంగా వూగిపోయే నీ వాలుజడన్నా, మధురిమ లొలికే దొండపండు వంటి నీ పెదిమల సోయగమన్నా, కెంపుతో క్రొత్త అందాలను పుంజుకొనే నీ చుబుకమన్నా, నీ గుండెలలో దోబూచులాడే నీ మంచితనానికే నేను నివాళులర్పించాలని, కాదు కాదు జోహార్లర్పించి నిన్ను నాదానిగా అంటే వివాహం చేసికోవాలని నిశ్చయించుకున్నాను. మరి! నీకు సమ్మతమేనా?

'ఇంతకూ యితగాడెవరబ్బా!' యని ఆలోచనలో పడ్డావుకదూ! నీవు స్కూలుకు వెళ్ళే దారిలో ప్రతాప్‌కుమార్ హాస్పిటల్ ఎదురు బట్టలకొట్లో స్కూలు వేసికొని కూర్చొని ప్రతిరోజూ నిన్ను చూస్తూ చిరునవ్వులు చిందిస్తానే! అదే! నేనే! అంటే! నన్ను నేను వర్ణించుకుంటుంటే నవ్వుకొంటున్నావా?

దృఢమైన కాయము కాదు గాని పాలుగారే ముఖారవిందమే! స్థిరత్వం గాంభీ

కాత్యాయని కలలు

ర్యం మూర్తీభవించిన ముఖారవిందమని స్నేహితులంటారు గాని నాకెందుకో అలా అన్పించదు. కోటేరులాంటి ముక్కు కాదు కాని చట్టిముక్కు మాత్రం కాదు. ఆలోచిస్తున్నట్లున్న నా కళ్ళంటే మా స్నేహితులందలూ యిష్టపడతారు మరి! నివేమంటావో! 'ఛీ సిగ్గులేదా నీకు నీవే యిలా వర్ణించుకుంటున్నావు?' అని ఛీత్కరించుకుంటున్నావా ? నేనెంతైనా మగవాడిని. మరి సమాధానం ఎప్పుడు?

ఇట్లు
రామారావు.

ఉత్తరమంతా చదివి మరోమారు దీర్ఘంగా నిట్టూర్పు విడిచి సన్నగా నవ్వుకుంది ! ప్రేమ ! ప్రేమ ! ఆడపిల్ల కొంచెం అందంగా కన్పించి కన్యగావుంటే చాలు ఈ యువకులుచేసే తతంగమే యింత ! ప్రేమకు నిర్వచనం తెలియని పిచ్చి నాగన్నలుకూడ ప్రేమిస్తున్నామంటారు !

ప్రతిరోజూ స్కూలుకు వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు అతనిని చూస్తుందేకాని తాను లక్ష్యపెట్టించుకోలేదు. నవ్వినా, కళ్లుతిప్పినా, వెక్కిరించినా తాను పట్టించుకొనేదే కాదు. పైగా ఎవరినో అతగాడు అంటున్నాడనుకునేది! అవన్నీ తనను చూసే చేసాడన్నమాట !' ఉత్తరం తీసికొని మంచంపై పడుకుంటూ ఆలోచించింది తన గత జీవిత పుటలు తిరగవేస్తూ కాత్యాయని !

* * *

కాత్యాయని యౌవన ప్రాంగణంలో అడుగుపెట్టిన రోజులవి. లొలకరి పులకలన్నా, వలపుల వయ్యారాలన్నా, ప్రేమ పాఠాలన్నా, శృంగార నైషధాలన్నా తనకు సుతారాం తెలియని రోజులవి ! తనదంతా ఒకటే ధ్యాస ! ఒకటే దీక్ష ! ఒకటే పట్టుదల! అదే తాను డాక్టరీ చదవాలని. మెడలో స్టెతస్కోపుతో వైట్ డ్రెస్‌తో హాస్పిటల్ ఆవరణలో రోగుల మంచి చెడులు తెలిసికుంటూ, వాళ్లబాధలే తన బాధలని భావించుకుంటూ, వారికి చేతనైనంత సాయంచేసి అందులోని తృప్తిని ఆనందాన్ని అనుభవించి తన జీవితాన్ని చరితార్థం చేసికుందామని ఎన్నెన్నో కలలు కన్నది! కాని విధి ఆ కలలను చెరిపి వేసింది. వాటికి జీవితంలో నామరూపాలు లేకుండ చేసి క్లిష్ట పరిస్థితులను, ఎన్నెన్నో బాధలను సృష్టించింది ఎవరు? విధి !

భగవంతుని లీలలు అనూహ్యమైనవి. కాత్యాయని కలవారింటిలో పుట్టినా కడగండ్లపాలు కాక తప్పలేదు. బాధలు, కష్టాలు, వ్యథలు తెలియకపోయినా, ఆర్థిక యిబ్బందులు అసలెరుగకపోయినా పసిపాప యవ్వనంలో అడుగుపెట్టి స్త్రీ సిసలైన గుట్టును ఎరిగినట్లుగ ఎదిగిన కాత్యాయని తండ్రి తాగుబోతని కాలేజీలో చదివేటప్పుడు తెలిసుకున్నది !

జగన్నాథంగారు స్వతహాగ ముక్కోపి. పైగా చండశాసనుడు. తాను పట్టిందే పట్టు భల్లూకపట్టు. తాను మాట్లాడిందే మాట, దానికిక తిరుగులేదు, సుప్రీంకోర్టు అప్పీలులాగ. తండ్రిదగ్గరకు వెళ్లాలంటే భయం. దాదాపు కుటుంబంలోని వారందరి దృష్టిలో జగన్నాథంగారు తండ్రి రూపంలో వున్న యముడే !

ఇంక తల్లి జానకమ్మ మంచితనానికి మారుపేరు. ఒక్కమాటతో చెప్పాలంటే ఇరవయ్యో శతాబ్దంలోని సీతాదేవి. ఓర్పులగని. సుగుణాల రాసి. భర్త తాగినా తందనాలు త్రొక్కినా తన ఓర్పును సడలనివ్వదు.

జగన్నాథంగారు ఒక్కొక్కసారి వుగ్ర రూపం దాల్చి తప్పు ఒప్పు ఆలోచింపక మంచి చెడుల విచక్షణ లేక రూళ్లకర్రతో గొడ్డును బాదినట్లు బాదినా ఆ యిల్లాలు పల్లెత్తుమాట అనేది కాదు. పైగా వయసొచ్చిన పిల్లలు ఎక్కడ వింటారోనని భయపడి లజ్జపడి గొంతులోనే బాధనంతా యిముడ్చుకొనేది కక్కలేక మింగలేక

రోజులు వారాలు నెలలు సంవత్సరాలు యిట్టే దొర్లిపోయాయి. కాలంతోపాటు జగన్నాథంగారి చేతిలో ఆస్తంతా అప్పడంలా చితికిపోయింది. రాను రాను కుటుంబంలో ఆర్థిక యిబ్బందులు తొంగిచూడటం ప్రారంభించాయి. ఆర్థిక యిబ్బందులు తిష్ఠవేసినా త్రాగటానికి అలవాటు పడిపోయిన జగన్నాథంగారు త్రాగి త్రాగి గుండె ఎండిపోయి పరలోకయాత్ర చేయటం కూడ జరిగిపోయింది. వాన రాకడా ప్రాణం పోకడా ఎవరు చెప్పగలరు ?

జగన్నాథంగారు [illegible] బాధలు, కటిక సత్యాలు బైట పడ్డాయి. అవే జగన్నాథంగారు చేసిన అప్పులు! వున్న ఆస్తి అప్పులకు సరిపోగా మిగిలినది 'కాత్యాయనివలనే యీ కుటుంబం గట్టెక్కాలి' అన్న సూచనమాత్రమే! ప్రప్రథమంగా విధి కాత్యాయని ముందు నిలిచి వివిధ భంగిమలలో నృత్యమాడినట్లనిపించింది. తాను వూహించుకున్న సౌధాలు ఒక్కసారిగ కూలిపోయాయి. తన కోర్కెలకు కలలకు కళ్లెలు పడిపోయాయి. అంతే! ఇక అప్పటినుండి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, ఇంటి అద్దెంతో కాలేజీ [illegible] గడుపుకుంటూ కాలం సాగదీసింది.

అంతంత మాత్రానికే కాత్యాయనిని విధి వదిలి వేయలేదు. కాలేజీలో కామేశ్వరరావు తనకు ఓ పెద్ద సమస్య అయి కూర్చున్నాడు. కాలేజీకి వెళ్లేటప్పుడు తనను తప్పనిసరిగా కలిసికోవటం, ఏదో వంకతో పలుకరించటం, రాయవరపు వారి వీధిలో ప్రక్క ప్రక్కనే నడువటం, వెకిలినవ్వులు నవ్వి క్రాపు సరిచేసికొంటూ కాలరెత్తుకోవటం, సినిమాలో హీరోలాగ పేరాల బస్సుస్టాపుదగ్గర ఫోజులేసి నిలబడటంలాటి పనులు రోజూ చేస్తూనే వుంటాడు.

కాలేజీ ఆవరణలో కన్పించినప్పుడు తోటి స్నేహితులతో కూడి 'వాట్ ఎ బ్యూటీ' అని కేరింతాలు కొట్టటంలాంటి చేష్టలు చేస్తూనే వుంటాడు.

ఓ సారి లైబ్రరీలో కన్పించి 'హలో! కాత్యాయనిగారూ! విూరీ పుస్తకం చదివారా? 'బ్రతుకంటే భయం' మంచి డిటెక్టివ్! చాల బాగుంది విూరు చదవండి' అన్నాడు సవినాపిస్తూ....

'భయపడేవాళ్లకు బ్రతుకు భయంకరమైనదండి. అటువంటి పుస్తకాలంటే నా వంటిపై తేళ్ళు ప్రాకుతాయి



కాత్యాయని కలలు

[illegible]
అలాగే నిర్ఘాంతపోయి కాత్యాయని వైపు చూస్తూ వుండిపోయాడు కామేశ్వరరావు.

ఆ తర్వాత ఓ సారి. లేబరేటరీలో కన్పించి 'పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని, ఫెయిలు అవుతారని భయపడి ఆరోగ్యం పాడు చేసుకోబోకండి! సాంబశివరావుగారు మా మామయ్యే! వారు పేపరు బాగా వ్రాయకపోయినా రికమెండ్ చేస్తాను డోన్ట్ వర్రీ!' అన్నాడు.

'థ్యాంక్స్! చదవలేనివారికి రికమెండ్ చేస్తున్నారు కాని... అయినా మార్కులు వేయించుకోని ఎన్నాళ్ళు ముందుకు పోగలుగుతారు మిస్టర్ కామేశ్వరరావుగారూ!' అన్నది చెంపపై చాచి కొట్టినట్లుగా....

ఇక అంతే! కామేశ్వరరావు కాత్యాయని జోలికి పోతే ఒట్టు. ఆ తర్వాత కాత్యాయనే బాధ పడింది ఎందుకంత కటువుగా ప్రవర్తించానా అని.

ఆనందంగా, హాయిగా కాలక్షేపం చేసి కాలేజీనుండి యింటికి వచ్చిన కాత్యాయనికి ఎదురయ్యే సమస్య ఏది! అమ్మకు దగ్గు ఎక్కువగా వుందని! అప్పుడే వాళ్ళు వచ్చి చాలా మాటలు మాట్లాడి వెళ్ళిపోయారనీ, సురేష్ ఆకలేసి యేడుస్తున్నాడని, తమ స్కూలుఫీజు రేపే కట్టాలని, సుశీల మెట్లు ఎక్కుతూ క్రింద పడిందనీను. కాత్యాయనికి అడుగడుగున బాధలే! అమ్మకు మందు కావాలంటే కనీసం ఇరవై రూపాయలైనా కావాలి! ఇరవైరూపాయలు ఎవరిస్తారు? పోనీ సుగుణకు చిటీ వ్రాసి పంపితే? సుగుణ తను బాగా స్నేహితురే! కాని డబ్బు అడిగితే ఆ స్నేహం అట్టే నిలవదని కాత్యాయని భయం బాధ.

దీర్ఘంగా ఆలోచించుకొని ఓ చిన్న చిటీ వ్రాసి సుగుణనుండి అప్పుతీసికొన్నది. మరేం చేస్తుంది పరిస్థితులు అలాటివి.

ఇంతవరకూ తాను కష్టాలను, కటిక చీకటినే చవిచూచింది. మరి తన జీవితంలో వెలుగు కిరణాలు ఏనాడు కన్పించుతాయో! ఆలోచిస్తూ ఆ నాటికి నిద్రపోయింది కాత్యాయని!

* * *

'కెవ్' మనే కేకతో నిద్ర మేల్కొన్న కాత్యాయనికి తల్లి శవం కంటపడింది. అంతే! ఒక కొయ్యబొమ్మలా బిగుసుకు పోయింది. మాటలేదు. మంతిలేదు. తనకు స్పృహ వచ్చేటప్పటికి హాస్పిటల్లో వుంది. ఊపిరాడని దగ్గుతెరలోనే అమ్మ వూపిరి పోయిందనీ, సుశీల రమ సురేష్ల బాధ్యత తానే వహించవలసిందనీ, తక్షణమే ఏ స్కూలులోనైనా టీచరుగా చేరవలసినదన్న సూచనలు పెద్దలు జారీ చేయటంవలన కషాయంలాగ ఒక్క సంవత్సరాన్ని మింగేసి హైస్కూలులో టీచరుగా చేరిపోయింది.

ఆప్యాయతను మమతను కురిపించిన అమ్మ పోవటంతో కాత్యాయని జీవితం మరింతగ అంధకారమే అయినదని చెప్పాలి!


సుశీల చిటికిమాటికి తన తల్రాత బాగోలేదనీ, అందరిలాగ చదివి ఉద్యోగాలు [illegible]
యంత్రంలా యింటికి చాకిరీచేసి బ్రతకవలసి వచ్చిందనీ, సినిమాలు షికార్లు లేవనీ, ప్రక్కింటి మంగతాయారు మహిళా మండలికి వెళ్తుందనీ, పైగా తన తోటి సిరివేణి చక్కగ పెళ్ళిచేసికొని కాపురానికి వెళ్ళిపోయి భర్తదగ్గర సర్వసుఖాలనుభవిస్తుందనీ, ఏవేవో యిలాగే అస్తమానం అనుకుంటూ అందరూ అనుభవించే ఆనందం, సరదా స్వేచ్ఛ తనకు లేదని మాటి పోటిమాటంతో దెప్పిపొడుస్తూనేవుంటుంది. విధి తనను వెక్కిరిస్తూనే వుంది. సుశీలకు వివాహం చేయాలన్న ఆలోచన లీలామాత్రంగా కాత్యాయని మనస్సులో మెదిలింది.

సుశీల చిన్నదికాదు. యౌవనంలో వున్నదే! వివాహం చేసికోవాలనీ, భర్త సాన్నిధ్యంలో సర్వ సుఖాలను పొందాలనీ, ఏ కన్య కోరుకోదు? మరి తనకు కలలు కనాలని వుండదా?

రోజూ కిటికీలోనుండి తనవైపే చూచే శేఖరంటే తనకు యిష్టం. ప్రాణం. అతనిని గురించి ఆలోచించని రోజు లేదు. అతనిని ప్రక్కన వూహించుకొని సుందర లోకాలలో విహరించింది. శేఖర్. అందగాడే బిగువైన అంగ సౌష్టవం, కోన దేలిన ముక్కు, నవరసాలు చిలికించే పెదవులు. సతతం జాలి దయ గొలిపే చూపులు! కందిన ఎరుపుదనంతో మిలమిల లాడుతూ నేత్రపర్వంగా వుండే శేఖరంటే తనకు యిష్టం! ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాణం!

దోసెడు విరులను తలలో నింపుకొని, కాళ్ళకు పారాణి పట్టుచీరతో, హైందవ స్త్రీ ఔన్నత్యానికి ప్రతీకలుగా పవిటలో నుండి దోబూచులాడే మంగళ సూత్రాలతో మధుర మంజుల గానం వినిపించేలా ఘల్లు ఘల్లు మనె మెట్టెలతో సతతం భర్త బాహువులలో పసిడి కలలు కంటూ అతనిని మురిపించి మరపించుతూ హాయిగా ఆనందంగా కాలం గడుపుతూ అతని హృదయ సామ్రాజ్యలక్ష్మియై అలరారుతూ తాను తల్లి కావాలనీ, తన సంసారం మూడుపువ్వులు ఆరుకాయలుగ శోభిల్లుతూ వుండాలని ఏ స్త్రీ కోరుకోదు?

మరి నా కలలు తీరుతాయా? మరి నా కెవరు వివాహం చేస్తారు? అసలు మని [illegible]



వలపెందుకు పొందాలి? అందరి స్త్రీల లాగ అగ్నిసాక్షిగ నాకు వివాహమౌతుందా?

ఆమధ్య సుభాషిణి విశాఖపట్నంనుండి ఉత్తరం వ్రాసింది. ఉత్తరమంతా తాను భర్తవద్ద పొందే ఆనందాన్ని తృప్తి వి అన్నీ వివరించింది. అత నెప్పుడూ చిలిపి కళ్లతో మురిపిస్తాడనీ, తుంటరి మాటలతో కవ్విస్తాడనీ, నిజంగా స్త్రీ ఏనాటికైనా వివాహం చేసికోవాలనీ, వివాహం చేసికొంటేనేగాని స్త్రీ పరిపూర్ణత నొందలేదనీ యింక ఏవేవో వ్రాస్తూ 'నీ పెళ్లెప్పుడు కాత్యాయని?' అని ప్రశ్నించింది. సుభాషిణికి ఏమని సమాధానం వ్రాయను? నా పెళ్ళెప్పుడని వ్రాయను.

నా కోరికలు, ఆశలు ఎన్నటికీ తీరవేమో; శేఖర్ నన్ను వివాహం చేసుకుంటాడా? ఎందుకు చేసికుంటాడు? తనకు— శేఖర్‌కు నక్కకు నాగలోకాని కున్నంత భేదం వుంది.

అదంతా భ్రమ! ఉబికే ఆశల ఉద్రేకాన్ని తీర్చలేని నా పేదరికం ప్రేమను ఫలింపజేస్తుందా? అతని హృదయం నామీద ప్రేమతో నిండినా, నేను నా సర్వస్వంతో అతనిని ఆరాధించినా మా యిద్దరి మధ్య యేర్పడిన మిథ్యా బాంధవ్యానికి వివాహమాడే అర్హత సమాజంద్వారా లేదు! అది కేవలం ఓ కల మాత్రమే! అతనిని నేను పొందలేను. పొందే అర్హత నాకున్నా—విధి ఆ అదృష్టాన్ని నా లాంటి దౌర్భాగ్యురాలికి చెందనివ్వదు! ఇలా ఆలోచిస్తూనే దిండులో తలదూర్చి వెక్కి వెక్కి కరువుదీరా యేడ్చింది కాత్యాయని. నిజమే! 'నేను నీకు ఏదీ దక్కనివ్వను.' అన్నట్లుగానే 'విధి' అనే వో వికార ఆకారం కాత్యాయని ముందు నిలిచి ఫక్కున నవ్వింది. అది విషపు నవ్వు!

కాత్యాయని కలలన్నీ కరగిపోయాయి. ఆశలు కలలు తామరాకుమీది నీటి బొట్లలా జారిపోయాయి. మంచులా కరగిపోయాయి. గాలిమేడలై కూలిపోయాయి. 'తన జీవితంలో ఎన్నడూ మార్పు రాదేమొ; తనకు ఉపాధ్యాయ వృత్తితోనే వృద్ధాప్యం సమీపిస్తుందేమొ;' అనుకొంటూ హాలులోకి అడుగు పెట్టిన కాత్యాయనికి ఎక్కడో దూరంగావుండె — రేడియోలో [illegible] ఫిల్ముసంగీతం కార్యక్రమంలో....

'జగము చీకటాయెనె
బతుకు భారమాయెనె
కనులనీరు నిండెనె
మనసు మోడు వోయెనె!'

అనే పాట తనకు కర్ణ కఠోరంగా వినిపించింది. ఓ దీర్ఘనిట్టూర్పు విడిచి వంటింటివైపు భారంగా అడుగులు వేసింది కాత్యాయని.

అదే రాత్రి చెల్లెలు పక్క ఖాళీగా వున్నందువల్ల తనుపడిన కలవరం తగ్గించడానికి పక్కమీద వుత్తరం దొరికింది. విప్పిచూశాక, నిరాశ పడాలో, నిస్పృహ పొందాలో ఆమెకు తెలియలేదు. తన చెల్లెలు సుశీల, 'ఈ నరకంలో వుండలేక—నచ్చినవానితో నా మార్గం వెతుక్కుంటున్నాను' అని వుంది. ఆమెకు నచ్చినవాడు తను వూహించుకుంటున్న శేఖరే—! ఆమె కన్నులు కన్నీరు రాల్చలేదు. ●



FOSAIH1012T6

1969లో మీ రాశిఫలం!

3. మిథునం

ప్రతి సంవత్సరం మే 22 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు సాయనసూర్యుడు మిథునరాశి యందు ఉంటాడు కాబట్టి యీ తేదీల మధ్యను జన్మించినవారు మిథునరాశి యందు జన్మించిన వారుగా పరిగణింపబడుతున్నారు.

మిథున రాశియందు జన్మించినవారికి యీ సంవత్సరం ప్రారంభంలో బాగానే ఉంటుంది కాని తరువాత యిబ్బందులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో సామాన్యమైన ఫలితంతో సంతృప్తి పొందడం మంచిది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

ఉద్యోగాన్వేషకుల ప్రయత్నాల్లో కొంతమంది మిత్రుల సహకారం లభిస్తుంది. అవివాహితుల వివాహ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యార్థులకు ఏప్రిల్ పరీక్షలు అనుకూలంగా ఉంటాయి.

జనవరి

ఏ వ్యవహారంలోను అనుకూలతను ఆశించడానికి అవకాశం లేని సమయం. వృత్తిలో సాటివారితో పోటీ పెరుగుతుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో చికాకులు యేర్పడతాయి. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. స్థిరాస్థి వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి ఆందోళన కలుగుతుంది.

ఫిబ్రవరి

ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. వృత్తి వ్యాపారాల్లో యెదురు చూడని ప్రోత్సాహం లభిస్తుంది. దూర ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో మీ కృషి అధికారుల చేత గుర్తింపబడుతుంది. ఇదివరకు కొన్ని వ్యవహారాల్లో మీకు యేర్పడిన సందేహాలు తొలగిపోతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మార్చి

భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషికి స్వల్పాటంకాలు వస్తాయి.

ఏప్రిల్

ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల వల్ల తాత్కాలికమైన లాభమే కాకుండా ముందు కూడా ఉపయోగం ఉంటుంది. నూతన వ్యవహారాలు లాభించగలవు. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. విలాసవస్తువులు కొంటారు.

మే

కొన్ని వ్యవహారాలు సులువుగా నెరవేరినా, మరి కొన్నింటిలో శ్రమ పొందవలసి వస్తుంది. వృత్తిలో సాటివారితో పోటీ పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాల్లో యితరుల నిమిత్తం మీరు శ్రమకు గురి కాగలరు. కోర్టు వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. స్వల్ప అనారోగ్యం చేయవచ్చును.

జూన్

వృత్తి వ్యాపారాల్లో అనుకూల వార్తలను వింటారు. నిమ్మల్ని పొగడుతూ మీ ద్వారా తమ పనుల్ని సాధించుకొనడానికి ప్రయత్నించే వ్యక్తులతో వ్యవహరించవలసి వస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు శ్రమ మీద నెరవేరుతాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

జూలై

మీ స్వంత పనుల మీద కంటే యితరుల వ్యవహారాల మీద శ్రద్ధ చూపించవలసి వస్తుంది. వృత్తిలో ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. కుటుంబ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. వ్యాపారంలో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి.

ఆగస్టు

వృత్తి వ్యాపారాల్లో సాటివారితో పోటీ పెరుగుతుంది. నమ్మిన వారివల్ల యిబ్బందులకు గురి కావలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. నూతన విషయాలను తెల్సుకొంటారు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

సెప్టెంబరు

గడచిన నెల కంటే యీనెల బాగా ఉంటుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. ఇతరుల మీద ఆధారపడి యేవ్యవహారమూ ప్రారంభించడం తగదు.

అక్టోబరు

వృత్తి వ్యాపారాల్లో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. భవిష్యత్తులో మీకు ఉపయోగించే వ్యవహారాల్లో చొరవ చూపించవలసిన సమయం. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

నవంబరు

ఈ నెలలో మీ కార్యక్రమాలు శ్రమ మీద నెరవేరుతాయి. వ్యాపారంలో కొన్ని అవకాశాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయి గాని అవి కార్యరూపాన్ని ధరించడం కష్టం. డబ్బు యిచ్చిపుచ్చుకోవడాల్లో చికాకులు రావచ్చును. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీకృషికి స్వల్పాటంకాలు వస్తాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

డిశంబరు

అన్ని వ్యవహారాల్లోను చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసిన సమయం. మీ స్వంత పనులు సులువుగా నెరవేరినా, యితరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. వృత్తి రీత్యా దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ముఖ్యమైన నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

4. కర్కాటకం

ప్రతి సంవత్సరం జూన్ 22 వ తేదీ నుంచి జూలై 22 వ తేదీ వరకు సాయనసూర్యుడు, కర్కాటక రాశియందు ఉంటాడు కాబట్టి యీ తేదీల మధ్యను జన్మించినవారు కర్కాటక రాశి యందు జన్మించినవారుగా పరిగణింపబడుతున్నారు.

కర్కాటక రాశియందు జన్మించిన వారికి యీ సంవత్సరం సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అప్పుడప్పుడు ప్రోత్సాహకరంగా ఉన్నా, మొత్తం మీద సంతృప్తికరంగా ఉండవు. ఏ వ్యవహారంలోను 'అతి'గా ప్రవర్తించడం మంచిదికాదు. ఈ సంవత్సరం ప్రారంభంలో కంటే ఆఖరున బాగా ఉంటుంది.

ఉద్యోగాన్వేషకులకు సంవత్సరంలో రెండవ భాగం బాగా ఉంటుంది. అవివాహితుల వివాహ ప్రయత్నాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కాగల అవకాశాలు ఉన్నాయి.

జనవరి

వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు సామాన్యంగా ఉంటాయి. భారీయెత్తున చేసే వ్యాపారాలు

ప్రారంభించడానికి యిది సమయంకాదు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. బంధువుల వ్యవహారాల్లో అనుకూల వార్తలను వింటారు వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు ప్రయాణాలోచనలు చేస్తారు.

ఫిబ్రవరి

కొన్ని వ్యవహారాల్లో మీరు యెంత మంచిగా ప్రవర్తించినా అది యితరులకు చెడుగానే కన్పిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలి వేయడం మంచిది. తాత్కాలిక ప్రోద్బలాలకు లొంగిపోవడం వలన చేజిక్కిన అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో వ్యతిరేక వాతావరణం యేర్పడుతుంది.

మార్చి

ఇదివరకు మీకు యేర్పడిన సందేహాలు తొలగిపోతాయి. వృత్తి వ్యాపారాల్లో మీకార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ఏప్రిల్

ప్రతి వ్యవహారంలోను మీకు యేదో ఒక సందేహం కలుగుతూనే ఉంటుంది. వ్యాపారం భారీ యెత్తున చేయడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వృత్తి రీత్యా దూరప్రయాణాలు చేసి కార్యసాధన చేయగలరు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

మే

వృత్తిలో సాటివారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో మిత్రుల సహకారం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో అభివృద్ధిని సాధించగలరు. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

జూన్

ఈ నెలలో మీ కార్యక్రమాలు శ్రమ మీద నెరవేరుతాయి. కొంతమంది వ్యక్తులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం వలన మీరు యిబ్బందికి గురి కాగలరు. భారీయెత్తున చేసే వ్యాపారాలు ప్రారంభించడానికి యిది సమయం కాదు. కుటుంబ వ్యవహారాల్లో యితరుల మూలంగా భేదాభిప్రాయాలు వస్తాయి. మీ తాలూకు వస్తువులు, పోవచ్చును.

జూలై

వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. మీకు యిష్టం లేకపోయినా, యితరుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు యిది వరకటి కంటే బాగా ఉంటాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

ఆగస్టు

ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనుపించిన అనుకూలత ఆఖరు వరకు నిలవదు. ఇదివరకు మీరు వ్యాపారంలో చేసిన ప్రయత్నాలు ఫలించగలవు. వృత్తి రీత్యా చేసే ప్రయాణాల్లో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. ఉద్యోగంలో అనుకూల వార్తలను వింటారు. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సెప్టెంబరు

వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. వ్యాపారంలో సాటివారి పోటీని యెదుర్కొని అభివృద్ధిని సాధించగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతిపక్షాల వాదం బలహీనపడే సంఘటనలు జరుగుతాయి. మిత్రుల వ్యవహారాల్లో మీకృషి ఫలిస్తుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.

అక్టోబరు

క్షణం కూడా తీరుబడి లేకుండా మీరు యెంతో కృషి చేస్తేనే గాని యేవ్యవహారమూ సానుకూల పడదు. కొన్ని వ్యవహారాల్లో మీరే వెనుకకు తగ్గవలసిన పరిస్థితి యేర్పడుతుంది. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడం వలన యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో వాద ప్రతివాదాలు తగవు. పుణ్యకార్యాలు చేస్తారు.

నవంబరు


మీ చాకచక్యమే అన్ని వ్యవహారాల్లోను అనుకూలతను సాధించగలదు. ఇదివరకు మీరు అసాధ్యం అనుకొన్న వ్యవహారాలు కూడా యిప్పుడు ఫలిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీకృషి రాణిస్తుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

డిశంబరు

సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. కొన్ని వ్యవహారాల్లో మీరు అపార్థం చేసికొనబడే ప్రమాదం ఉంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తిలో ప్రయోజనంలేని శ్రమకు గురి కాగలరు. స్థిరాస్తి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చును. అధికవ్యయం జరుగుతుంది.

(పైవారం సింహం, కన్య)

—మహేష్



అవీ - ఇవీ...

దుర్గ్ ఆంధ్రవిద్యార్థి సంఘం

ప్రవాసాంధ్రులైన తెలుగు విద్యార్థులలో సోదర భావం, ఐకమత్యము పెంపొందించుటకై దుర్గ్‌లో గల తెలుగు విద్యార్థులు ఆంధ్రవిద్యార్థి సంఘాన్ని స్థాపించు న్నారు. ఆంధ్రదేశము నందు ఆంధ్రదేశము వెలుపల గల ఆంధ్ర విద్యార్థి సమితులతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకొనుటకు దుర్గ్ ఆంధ్ర సంఘం వారు పువ్విళ్లూరుతున్నారు.

కార్యదర్శి,
ఆంధ్ర విద్యార్థి సంఘం,
క్వార్టర్ నెం. 13
మోహన్‌నగర్, దుర్గ్ (మ. ప్ర)

రేలంగికి సన్మానం

ఏలూరులోని సర్ సి. ఆర్. రెడ్డి కళాశాలలో ప్రముఖ తెలుగు హాస్య నటుడు శ్రీ రేలంగి వెంకట్రామయ్యకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి. వి. కృష్ణయ్య అధ్యక్షతన ఘన సన్మానం జరిగింది. అనంతరం సంగీత నాటక సమితి తేనీటి విందు, విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి.


శ్రీ చల్లా రాధాకృష్ణశర్మగారికి పి. హెచ్. డి. డిగ్రీ

తెలుగు తమిళములలో 'రామాయణము—తులనాత్మక పరిశీలన' అనే పరిశోధనా వ్యాసానికి మదరాసు విశ్వవిద్యాలయంవారు చల్లా రాధాకృష్ణశర్మగారికి పి. హెచ్.డి. డిగ్రీ ఇచ్చారు. ఇంతకు మునుపే వీరు 'తెలుగులో తమిళము' అనే పరిశోధన వ్యాసానికి మదరాసు విశ్వవిద్యాలయం నుంచి యం. లిట్. తీసుకున్నారు.

తూ. గో. జిల్లాలో వేసక్టమీలు

తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటికి 30వేల వేసెక్టమీలు (కుటుంబనియంత్రణ ఆపరేషన్లు) జరిగాయట. సంవత్సరం గిర్రున తిరిగివచ్చేసరికి కనీసం లేదంటే పోలక్ష పూర్తి చేయాలని తత్సంబంధమైన అధికారాలు వుత్సాహ పడుతున్నారు.

ఖాజూరహో



కాందరీయ మహాదేవాలయం.

ఖాజూరహో ఒక ఊరు. అది ఒకప్పుడు చండెల్లా రాజపుత్రవంశంరాజుల రాజధాని. ఈ రాజులు క్రీ. శ. 9 నుంచి 13 వ శతాబ్దందాకా ఏలారు.

ఖాజూరహో ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉత్తర భాగంలో ఉంది. ఇక్కడ 85 దేవాలయాలు ఉండేవిట; కాని, నేడు 20 మాత్రమే మిగిలాయి. మిగతా 65 కాలగర్భంలో కలిసిపోయాయి...

ఖాజూరహో దేవాలయాలు జగత్ప్రసిద్ధి పొందినవి. మొత్తం ఆకారంలోనేకాక శిల్ప సంపదలు కూడా అవర్ణనీయమయిన సౌందర్యం కలవి.

గోడల బయటివయిపు శిల్పాలలో మన దేవుళ్లు, అప్సరసలు, మిథునాలు, సర్పాలు, శరభమృగాలు — నీటిశిల్పాలు చూడవచ్చు. మిథునశిల్పాలు జగత్ప్రఖ్యాతి పొందాయి. ఈ బూతుబొమ్మల అర్థం ఏమిటి? ఎన్నోరకాల సిద్ధాంతాలు ఉన్నాయి. కాని, ఒక పండితుడు స్త్రీ పురుషుల సంయోగం ఆత్మ, పరమాత్మల అయికమత్యానికి చిహ్నంగా శిల్పులు వాడారని అంటారు. మరికొందరు తమతమ సిద్ధాంతాలని ప్రతిపాదించారు. ఏది ఎంత సబబుగా ఉనప్పటికీ (లేనప్పటికీ!) ఈ బూతుబొమ్మల సంఖ్య మామూలు శిల్పాల సంఖ్యతో పోలిస్తే చాలా తక్కువ. ఇది గమనించదగ్గ విషయం...



మిథున శిల్పము.

ఖాజూరహో ఆలయాలన్నిటిలోనూ కాందరీయ మహాదేవాలయం పెద్దది. ఇది 102 అడుగుల పొడుగు, 66 అడుగుల వెడల్పు, 101 అడుగుల ఎత్తుఅయిన పెద్దగుడి. ఈ శివాలయం చూడగానే



శివపార్వతి

మనలో సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. దాని నిర్మాణం అలాగ ఉంటుంది. ఈ గుడి గోడలమీద 872 శిల్పాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువభాగం 2.5 నుంచి 3 అడుగుల ఎత్తువి......

ఇంత అద్భుతమయిన శిల్ప నిర్మాణాలని సృష్టించిన మానవులు ఎటువంటివారు! వారి కృషి ఎటువంటిది! వారి భక్తి ఎంత ప్రగాఢమయినది!

—వ్యాసం, ఫొటోలు:

ఎస్. ఆర్. రాజగోపాల్.



గట్టిగా విజిల్ వూదెదు గార్డు. అంతా రైలు ఎక్కే హడావుడిలో మునిగారు. రైలు పెద్దగా కూత పెట్టింది. సిగ్నలు పైకి లేచింది వెళ్ళమ—న్నట్టు. గార్డు తన చేతిలోకి పచ్చజెండ తీసుకున్నడు.

"మల్లెపువ్వుల్"!అరుస్తున్నాడో వ్యాపారస్తుడు

రైలు ఇంజెను కూత ఆపినా ఏదో శబ్దం చేస్తూనేవుంది.

ఒక ముసలావిడ గబగబా నడుస్తూ గార్డు దగ్గరిగా వచ్చింది. అతను ఆవిడ వైపు చూశాడు.

"చూడండి బాబు, నా కూతురును ఇక్కడి దాకా తెచ్చారు. ఓ రెండు నిమిషాలు రైలునాపండి, దాన్ని వెంటనే బెజవాడ ఆసుపత్రికి తీసుకెళ్ళకుంటె చచ్చిపోతుంది. దాన్ని రక్షించండి బాబు." అన్నది కన్నీళ్ళు తుడుచు కుంటు. గార్డు ఆవిడవైపు చూశాడు.

దాదాపు యాభై సంవత్సరాలు వుంటాయి. ఆవిడ చూడటానికి సంస్కారయుతంగానే వుంది. కూతురి ప్రాణాల కోసం తాపత్రయపడుతున్నట్లు న్నాయి ఆవిడ మొహంలోని భావలు.

దూరంగా ఒక మంచాన్ని మోసుకొస్తున్న నలుగురు వ్యక్తులు కంటపడ్డారు గార్డుకు. వారు స్టేషనుకు జేరటానికి కనీసం అయిదు నిముషాలైనా పడుతుంది. అంతవరకు రైలు నాపాలి. అతను ఆలోచించడు.

రైలు పెద్దగా కూతపెట్టింది.

"బాబూ!" అందావిడ జాలిగా.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు.

ఐదు నిముషాలు గడిచిపోయాయి.

మంచంతో ఆ వ్యక్తులు స్టేషన్‌లోకి అడుగు పెట్టారు. ఆవిడ తన కూతురున్న మంచంతో రైలెక్కింది.

గార్డు విజిల్ వూది పచ్చజెండా వూపేడు.

ఇంజన్ పెద్దగా కూతపెట్టి ముందుకు కదిలింది.

గార్డు తన డబ్బా ఎక్కాడు.

స్టేషన్ దాటగానే పచ్చజెండా రెండవసారి ఊపి తన సీటుపై కూర్చున్నాడు. ప్రక్కన కిటికి పచ్చని వరిచేలను వెనక్కి తోస్తూంది. అతని ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

రైలు వేగాన్ని అందుకుంది.

సీతను అంతగా ప్రేమించాడు మరి!

అందుకే తను ఇంతవరకు బ్రహ్మచారిగానే వుండిపోయాడు.

సీతా తను ఎంతో ప్రేమగా వుండేవరు. ఒక్కరోజు సీతతో ఆడకపోతే ఏదో వెలితిగా అనిపించేది తనకు. సీత తనంటె ప్రాణం విడుచుకొనేది. తమ ఇంట్లో ఏది చేసుకున్నా తనకు ఇవ్వందే తినేది కాదు. ఇద్దరూ తమ ఇంట్లోని నులక మంచం వెనుక దాక్కొని తెచ్చుకున్నది పంచుకొని తినేవారు.

తనూ, సీతా, బొమ్మలాటలు ఆడితే నులక మంచం ఇల్లుగా చేసుకునేవారు. గోడకు దగ్గరిగా మంచాన్ని జరిపి దానిపై దుప్పటి గప్పి వెనుక దాక్కొని ఆడుకునే వరు.

వర్షం పడినప్పుడు ఇద్దరి ఆనందానికి అవధులు ఉండకపోయేవి. వర్షంలో తడుస్తూ గెంతుతూ ఆడేవరు. ఇంటి పెరట్లో కాల్వలు కట్టే నీటిలో కాగితపు పడవలు చేసుకొని పందాలు పెట్టుకొని ఆడుకునే వారు. పడవల పందాల్లో ఎప్పుడు తనే గెల్చేవాడు. సీతకు కోపం వచ్చేది. తను సర్ది చెబుతూండేవాడు.

అనందంగా గడచిపోయేవి రోజులు.

ఒక రోజు తనూ సీత ఊరవతలి గుడిలో కెళ్ళి మంటపంపై కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. మాటల సందర్భంలో తనన్నాడు. "సీతా నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని. ఆ వయసులో దాని అర్థం తెలియకున్నా ఎక్కడో విన్న మాటలు పట్టుకొని అన్నాడు.

"వూ", అంది సీత.

"నేను పెద్దయ్యాక రైలు గార్డునై దేశ దేశాలు తిప్పుతాను వస్తావా?" అంటూ అడిగాడు.

"ఓ, తప్పకుండా." అంది రెండు జడల సీత.

అప్పట్లో తనకు సీతకు గార్డు అంటె రైలు స్వంతదారని, అతను చెప్పినట్లు రైలు నడుస్తుంది

కాబట్టి. అయినా గొప్పవాడని మాత్రమే తెలుసు, కాని అది ఎంత శ్రమతో కూడుకున్న పనో తెలిసేది కాదు.

ఇద్దరూ రోజూ గుడికెళ్ళి ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. తనవారు గాని, సీత తల్లిగాని తమకున్న సన్నిహితాన్ని ఏనాడూ కాదనలేదు. ఇద్దరి హృదయాల్లో ఎన్నో సంఘటనలు, భావాలు పెనవేసుకొని మరింత దగ్గరికి చేర్చేవి.

రోజులు గడిచిన కొద్దీ ఇద్దరు మరింత దగ్గరైయ్యారు.

తను పల్లెలోని స్కూల్ ఫైనలు పాసుకాగానే పై చదువులకని పట్నం వెళ్ళాల్సిన రోజు సీత ఎంతో బాధ పడింది.

"నీవు వచ్చేదాకా నీకోసం ఎదురు చూస్తూంటాను." అంది, ఇంటి గుమ్మందాకా వచ్చి సాగనంపుతూ. తను సీతను వదల్లేక వెళ్ళిపోయాడు. కాని కొన్ని రోజులు ఏదో పోగొట్టుకున్న వాడిలా బాధపడేవాడు. ఎక్కడ చూసినా సీతే కనబడేది.

"నన్ను మరచిపోవుగా?" అని బాధగా అన్న సీత మాటలు మరిచిపోలేక పోయాడు. సీతను ఊహించుకుంటూ రెండు సంవత్సరాలు దూరంగా వున్న పట్నంలో గడిపేశాడు. సీతగూర్చి తల్లి అప్పుడప్పుడు వ్రాసేది. తల్లి వ్రాసిన అక్షరాలను పదేపదే చదివి సీత రూపం వూహించుకునేవాడు. తను లాగూలు వేసుకున్నప్పుడు పరికిణి జాకెట్టుతో ఉన్న సీత తను వచ్చేప్పుడు ఓణీలు వేసుకొనేది. కాని ఇప్పుడు?!!?

బహుశా చీరలు కట్టుకొని అందంగా వుండి వుంటుంది. కాలేజీలో ఎంత మంది అమ్మాయిల్ని చూసినా సీతకు సాటి ఎవరూలేరని అనుకునేవాడు. చదువు పూర్తికాగానే సీతకోసం వందరూపాయలు ఖర్చుపెట్టి చీరలు జాకెట్లు తీసుకొన్నాడు. గడచిన రెండు సంవత్సరాలు త్వరగా గడిచాయనిపించింది. అదంతా సీతను ఊహిస్తూనే గడిపేశాడు.

రైలు ఊరి దగ్గరవుతున్న కొద్దీ తన గుండె వేగంగా కొట్టుకోసాగింది. సీత ఇప్పుడు యవ్వనంలో ఉండి వుంటుంది. చిన్నప్పుడే ఎంతో అందంగా వుండే సీత ఇప్పుడింకెంత అందంగా వుండి ఉంటుందో? ఇదే తన వూహా అప్పట్లో!!

రైలు దిగగానే వూరంతా క్రొత్తగా మారిపోయింది. స్టేషన్ దగ్గర ఒకటి రెండు హోటళ్ళు ఉండేవి, కాని ఇప్పుడు? ఎనిమిది హోటళ్ళు వచ్చేశాయి.

సూట్‌కేసుతో ఇంటివైపు నడిచాడు తను. ఊరు కుగ్రామమే అయినా మూడు సంవత్సరాలలో ఎంతో మారిపోయింది. దారి కిరుప్రక్కలా క్రొత్త గుడిసెలు వెలిశాయి.

గతుకుల రోడ్డు వెడల్పుగా సాఫీగా ఉంది. దూరంగా సినిమా పాటలు పెద్దగా వినబడుతున్నాయి. బహుశా ఎవరిదైనా పెళ్ళి కాబోలు. కరెంటు వచ్చిన తరువాత ఊరి కళే మారి ఉంటుందని వూహించాడు తను.

ఇంటికి జేరి ఇంట్లోని అందర్నీ పరామర్శిస్తూ సీత కోసం చుట్టూ గాలించాడు., సీత ఎంతకీ కనబడక పోయేసరికి తల్లిని పిలిచి అడిగాడు, "అమ్మా సీత రావటం లేదా?" అని.

'నీవు వస్తున్నావని చెప్పాను, కాసేపాగి వస్తుంది' అంది తల్లి. "సీతకోసం తన కళ్ళు వెయ్యిదిక్కులు వెదికాయి. కాని సాయంత్రంవరకు ఓర్చుకున్నా సీత కనబడలేదు.

తన గదిలో కూర్చొని సీత గూర్చి తల్లి వ్రాసిన ఉత్తరాలు చదువుతూండగా తల్లి పిలుపు వినిపించింది.

"సీత వచ్చిందిరా." అంటూ.

గుండె వేగంగా కొట్టుకుంది.

మెల్లిగా వంటింటి వైపు నడిచింది.

సీత!!!!

తల్లి ప్రక్కగా కూర్చున్న సీత చిన్నగా నవ్వుతోంది.

తలుపు దగ్గరే నిలబడిపోయాడు తను. తనను చూడగానే తల వంచుకొని లేచి వెనక్కు తిరిగింది. ఆమెను పిలవాలనుకున్నాడు. కాని పిలువలేకపోయాడు.

ఆమె వెళ్ళిపోయింది.

తను బాధ పడ్డాడు. సీతతో ఏమేమొ మాట్లాడాలనుకున్నాడు. కాని, ఆమె తనను చూసి వెళ్ళిపోయింది. సిగ్గు పడ్డదేమొ తరువాత మాట్లాడవచ్చు అనుకొని ఊరుకున్నాడు.

* * *

సీత ఎంత అందంగా వుంది!

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోతే తనెంత బాధపడ్డాడు. అప్పటి సీతలో ఇప్పటి సీతలో ఎంత వైవిధ్యం ఉంది! ఓణీలు వేసుకొని "నన్ను మరిచిపోవుగా?" అన్న సీత, చీరలో నిండుగా అందంగా తల వంచుకొని వెళ్ళిపోయిన సీత, ఇద్దరిలో ఎంత తేడా? ఆమెతో మాట్లాడాలనే కుతూహలాన్ని అణుచుకొని పొలాలవైపుగా నడిచాడు.

బాల్యం, యవ్వనం, రెండు దాటితే మానవుడి జీవితం దుర్భరం అవుతుందని తన అభిప్రాయం అందుకే యవ్వనంలోనే అన్నీ అనుభవించాలి. అందుకే పచ్చని పొలాలవైపు నడిచాడు. బాధలను మరచి ఆనందంగా వుండాలని.

పచ్చని వరి పొలాలు, దూరంగా రైలు కట్ట, ఆ ప్రక్క తుమ్మలమ్మ చెరువు, ఉత్తరంగాదూరంగా మామిడి తోపులు చూడముచ్చటగా వుందా దృశ్యం.

తను సీతతో మామిడి తోపుల్లో ఆడుకున్న రోజులు తల్చుకుంటె ఇప్పటికీ ఎంతో ఆనందంగా వుంటుంది.

ఎత్తుగా ఎదిగిన జొన్న చేలలో దోసకాయల కోసం వెతుక్కుంటూ దోస తీగల వెంబడి నడుస్తూ పెద్ద పెద్ద దోసకాయలు తెంపి తింటూ రకరకాల కథలు చెప్పుకుండేవారు. ఒకసారి సీత చిన్న కథ చెప్పి పెద్దగా నవ్వింది, ఆ కథను జీవితంలో మరచి పోలేడు.

'అనగనగా ఒక ఊళ్లో ఒక చెట్టుందిట. ఆ చెట్టుపైన ఒక పచ్చటి ఎర్రముక్కు చిలకుందిట. ఆ చిలుకకు ఎన్నో కథలు తెలుసుట. ఒకసారి చిలుక ఎర్రటి మామిడి పండును కొరకబోయి ఒక ఎర్రటి రాతిని పొడిచిందిట. పాపం దాని ముక్కు విరిగిందట. పాపం దాని మొగుడు దాన్ని చూసి "ఛీ, మూతిలేనిదానా, పో!" అందిట. అది ఏడుస్తు ఎక్కడికో ఎగిరిపోయిందిట. మరి దాని ముక్కు పోతే దాని మొగుడుకు కోపం ఎందుకొచ్చింది?' అంది సీత అమాయకంగా.

తను నవ్వి ఏమొ నాకేం తెలుసు? అన్నాడు.

ఆ కథలో ఎంత అర్థం దాగుందో కాలేజీలోని కొన్ని సంఘటనలు ఋజువు చేశాయి. అంత చిన్న మెదడులో ఎన్ని ఆలోచనలో! ఆశ్చర్యపోయాడు తను.

అటువంటి సీత సిగ్గుతో వెళ్ళిపోయింది. ఎలాగైనా రేపు మాట్లాడాలి అనుకున్నాడు తను.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్దుర పట్టలేదు.

* * *

"సీతా" అన్నాడు మెల్లిగా.

సీత ఆగిపోయింది.

"అంత సిగ్గు పడ్తావేం?" అడిగాడు తను.

తలవంచుకొని నవ్విందామె.

"చూడగా, నేను నీకు క్రొత్త కాదుగా? అనగనగా ఒక చెట్టుండేదిట. ఆ చెట్టుమీద ఒక పచ్చటి ఎర్రముక్కు చిలకుండేదిట..." చిరునవ్వు నవ్వాడు తను.

సీత మెల్లిగా కళ్లెత్తి చిరునవ్వుతో తనవైపు చూసింది.

"ఏం సీతా అంత సిగ్గు పడితె ఎలా? నీవు మాట్లాడకుంటె, నాకేం తోచదు. అన్నట్టు సీతా నీ కోసం ఏం తెచ్చానో చూద్దువుగాని రా." అంటూ గబగబా ప్రక్కగదిలోకి నడిచి సూట్‌కేసుతో బైటికివచ్చాడు.

సీత ఎంత తలవంచినా తనని ఓరగా చూస్తూండటం తను గమనించాడు. సూట్‌కేసు మూత తెరిచి చూపాడు. అందులో చీరలు జాకెటు గుడ్డలు కనబడ్డాయి. అవన్ని ఆమె ముందుంచి "సీతా ఇవన్నీ నీకే తీసుకో", అన్నాడు వెనక్కు జరుగుతూ సీత నిశబ్దంగానే అతని వైపు చూసింది.

"ఏం సీతా వద్దా?"

మెల్లిగా తల వంచుకొని నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"నాతో మాట్లాడకూడదా?" అడిగాడు తను మూతి ముడ్చుకొని.

మెల్లిగా తలెత్తింది.

"ఐతే తీసుకో" అన్నాడు తనే.

'వద్ద'న్నట్టు తలూపింది.

"ఏం?" అడిగాడు తను.

"అమ్మ......" అంది మెల్లిగా.

"ఏమీ అనదు తీసుకో" అన్నాడు.

అతని కళ్ళలోకి చూసింది.

"తీసుకోకుంటె ఒట్టే" అన్నాడు ఆమె చేతిని పట్టుకుంటూ. సీత కళ్ళల్లో నీరు నిలచింది.

ఆమె పెదవులు వణికాయి.

"సీతా" అన్నాడు తను ఆశ్చర్యంగా.

"మీరెంత మంచివారండి, నేనెంత అదృష్టవంతురాలిని" అంటూ తన దగ్గరిగా జరిగింది.

సీతనోట అనుకోని విధంగా వెలువడ్డ మాట

తను ఆశ్చర్యపోయాడు. ఆమె భుజాల మీద చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు. సీత నిశబ్దంగా తన ఒడిలో ఒరిగిపోయింది.

అన్ని సంవత్సరాలు చలిలో వణికి వెచ్చటి దుప్పటి కప్పుకున్నవాడిలా హాయిగా తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు తను. ఆమె నిశ్శబ్దంగా అలాగే వుండిపోయింది.

ఏదో తెలియని ఆనందంలో మునిగిపోయి కళ్ళు మూసుకున్నాడు. గత జీవితంలో పోగొట్టుకున్న వస్తువేదో దొరికినట్లుగా తృప్తి చెందేడు.

'సీతా' అని పిలుపు వినపడగానే మెల్లగా వళ్ళుకు తప్పుకొని తనకిచ్చిన బహుమానాలతో వాకిట్లోకి నడిచింది సీత.

నెల రోజులు క్షణంలో గడచిపోయాయి. ఒకర్ని విడచి ఒకరు ఉండలేకుండా అయ్యారు. సీత తిరిగి భార్యపు తనువు ఏర్పర్చుకున్నది. ఇద్దరూ గత స్మృతులతో రాత్రుంబవళ్ళు గడిపేవారు.

తనకు సీతకు ఒక శుభ ముహూర్తాన వివాహం నిశ్చయించారు పెద్దలు. ఆ రోజు తను అనుభవించిన ఆనందం ఏ [illegible] ఏనాడూ అనుభవించి ఉండడు.

ఆ విషయం విన్నప్పటినుండి సిగ్గుతో తల వంచుకొని "పోండి", అనే సీతను ఇప్పటికీ ఎప్పటికీ మర్చిపోలేడు తను.

పెళ్లి విషయం విన్నప్పటి నుండి సీత దగ్గరికి రావటం మానేసింది. తను ఆమెకోసం తాపత్రయ పడేవాడు. ఒక రోజు సీత ఇంటికి రాగానే ఎవరూ చూడకుండా ఆమెను దగ్గరికి తీసుకున్నాడు.

"వదలండి" అంది గింజుకుంటూ.

"సీతా నీవు లేకుంటే మాట్లాడకుంటే ఎంతో బాధగా వుంటుంది. మాట్లాడవా?" అడిగాడు వంగిపోయి ఆమె మొహంలోకి చూస్తూ.

చిరునవ్వుతో కళ్ళు మూసుకొని "ఊఁ!" అంది

గార్డు

'మాట్లాడుతా', నవ్వుతూ.

"మాట్లాడకుంటే ఒట్టు!" అన్నాడు చిలిపిగా.

"పోండి", అంది, మొహాన చేతులు కప్పుకుంటూ.

"సీతా రేపు దీపావళి, మరి ఏమంటావ్? తిరిగి రేపు పెళ్లి చేసుకుందామా?" అడిగాడు నవ్వుతూ.

సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఇదిగో....." తన మాటలు పూర్తి కాకుండానే తప్పించుకొని పారిపోయింది సీత.

* * *

దీపావళి రానే వచ్చింది.

భయంకర కాళరాత్రిని పారద్రోలే రంగు వెల్గుల రాత్రి. దీపాల తోరణాలు చీకటనే ప్రకృతి కంఠాన్ని కౌగిలించుకొని దివ్యంగా వెలిగేరోజు.

నల్లటి చీకటిని ప్రమదల్లోని చిన్న దీపాలు వెళ్ళగొట్టే వృధా ప్రయత్నాలు చేస్తున్నాయి.

సీత! తనిచ్చిన ఆకాశం రంగు టెర్లిన్ చీర కట్టుకొని ప్రమిదల్లోని వత్తులకు జ్వాల నందిస్తోంది. తను ఆమె అందాన్ని ప్రమిదల కాంతుల్లో చూస్తున్నాడు.

చిరునవ్వుతో తలవంచుకొని వత్తుల్ని సవరిస్తోంది.

"సీతా", అన్నాడు తను.

"ఊఁ!" అంది చిరునవ్వుతో.

"నీ వెంత అందంగా ఉన్నావో తెలుసా?" అన్నాడు చిరునవ్వుతో.

"పొండి", అంది నవ్వుతూ.

"పోతున్నా, వెళ్ళి చిచ్చుబుడ్డి తెచ్చి కాలుస్తాను. ఆ వెలుగులో నిన్ను....." అంటూ గబగబా గది వైపు నడిచాడు తను.

టపాకాయలు బుట్టనిండా నిండి ఉన్నాయి.

అన్నిటికీ పెద్దదైన చిచ్చుబుడ్డి తీశాడు. ఇది కాల్చి నవ్వుల కాంతిలో సీత! "అబ్బ" అనుకున్నాడు తను.

'కీచు'న వినబడిందేదో శబ్దం [illegible].

ఉలిక్కి పడ్డాడు తను. అది సీత కంఠం.

"అమ్మో!" అంటూ వినిపించింది అదే కంఠం రెండవసారి.

చిచ్చుబుడ్డి అక్కడే పారవేసి గబగబా వాకిట్లోకి పరిగెత్తాడు తను.

కళ్ళకు కనబడ్డ దృశ్యాన్ని చూసి దిగ్భ్రాంతితో క్షణం నిలబడి గబగబా ముందుకు పరుగెత్తాడు.

సీత టెర్లిన్ చీరకు దీపం అంటుకొని కాలుతోంది. అప్పటికే సగం కాలింది. గబగబా ఆమె దగ్గరికి పరుగెత్తి చీరను బలంగా లాగేశాడు.

సీత స్పృహ తప్పింది.

అంతా పరుగెత్తుకొని వచ్చారు.

సీత బ్రతకాలంటే డాక్టర్ రావాలి. డాక్టర్ తమున్న వూళ్ళో లేడు. పక్క వూరికి వెళ్ళాలి. టైం చూసుకున్నాడు తను. రైలు వస్తోంది. సీతను మంచంపై పడుకోబెట్టించి నలుగురు వ్యక్తులతో స్టేషన్ వైపు నడిచాడు.

తను ముందుగా స్టేషన్ జేరాడు. తను స్టేషనుకి జేరేసరికి రైలు వచ్చి ఆగి ఉంది. గబగబా టికెట్లు కొన్నాడు. సీత దాదాపుగా స్టేషన్ దాకా తీసుకొని రాబడింది.

రైలు కూత పెట్టింది.

గార్డు పచ్చని దీపం చూపటానికి చేయి ఎత్తాడు. తను గార్డు దగ్గరిగా పరుగెత్తాడు.

"సార్ క్షణం రైలు నాపండి, నా సీతను దక్కించుకోవాలి" అన్నాడు పిచ్చిగా.

"ఇప్పటికే గంటలేటైంది, టైం లేదు." అంటూ విజిల్ వూది పచ్చదీపం చూపాడు.

రైలు కదిలి వెళ్ళిపోయింది. సీత స్టేషన్ జేరేసరికి రైలు సిగ్నలు దాటి వెళ్ళిపోయింది, చీకటి శూన్యంలోకి.

కుమిలి కుమిలి ఏడ్చాడు తను.

కాని, ఆ చీకటి ప్లాట్‌ఫారం మీద మంచంలో వికృతాకారం దాల్చి పడి ఉన్న సీత తన శరీరం చూసి అసహ్యించుకొని కాబోలు ఈ లోకాన్ని వదిలి శూన్యంలో కలిసిపోయింది.

తను ఒంటరిగాడైపోయాడు.

పొలాలు, మామిడి తోపులు, పచ్చని ప్రకృతి వికృతంగా, భయంకరంగా కనబడ్డాయి. ఊరంతా చిన్నబోయినట్లు అనిపించింది.

ఎక్కడ చూస్తున్నా సీతే నవ్వుతూ కనబడేది. అక్కడ ఉండలేక పోయాడు. సీతను కౌగిట్లో ఉంచుకున్న క్షణాలు తల్చుకొని పిచ్చిగా నవ్వుకునేవాడు. కొన్నాళ్ళకు పట్నం వెళ్ళి పరిస్థితుల మూలంగా గార్డు అయ్యాడు. తన ఊరు చేరినప్పుడు కళ్ళల్లో నీరు నిండేది. సీతకోసం కళ్ళు వలువూరాలలా వెదికేవి, కాని పిచ్చి కాకుంటే లోకాన్ని వదిలిన సీత ప్లాట్‌ఫారం మీద కనబడ్తుందా?

కాని, ఈ రోజు తన హృదయానికి ఘాతంలా




మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్ హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
ఈ టీలో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు. ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. అతిథులకుకూడా యివ్వండి. మీరు తప్పక సంతోషంతో వికసిస్తారు. అవును-మీ ఆనందభరితులైన అతిథులుకూడాను. లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది.
LIPTON
లిప్టన్స్ అంటే మంచి టీ
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA

[illegible]
అదే పరిస్థితులలో.

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ టీ. సీ. రామనాథం భుజం తట్టాడు.

"చూడండి, రైలు ఆగి పది నిమిషాలైంది. ఏమిటండీ పరధ్యానం, గంట లేటును డెబ్భై నిమిషాలు చేశారు. కమాన్ లెట్‌ది ట్రైన్ మూవ్!" అన్నాడు తడుస్తూ.

ఉలిక్కిపడి పరిసరాలు గమనించి నిట్టూర్చి విజిల్ ఊది పచ్చజెండా చూపాడు.

రైలు కదిలింది.

* * *

తన డ్యూటీ అయిపోయినట్లు సంతకం చేసి గబగబా ప్లాట్‌ఫారమ్ దాటి దగ్గర్లో ఉన్న పెద్దాసుపత్రి వైపు నడిచాడు.

ఆసుపత్రి చేరగానే ముసలావిడ గాభరాగా అటూ ఇటూ తిరుగుతోంది. ఆవిడ దగ్గరిగా నడిచాడు.

"ఏమండీ." అన్నాడు మెల్లిగా.

"ఎవరూ?" అందామె గార్డు వంక చూస్తూ.

"నేను" అన్నాడు తనను తిరిగి ఆవిడకు పరిచయం చేసుకుంటూ.

"బాబూ, నా బిడ్డ బ్రతికింది బాబు, అంతా నీ దయే, నీవు ఆ క్షణం రైలునాపకుంటె నా కూతురి జీవితం నాశనం అయ్యేది. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు నాయినా." అందావిడ.

"ఏమైందండీ అమ్మాయికి?" అంటూ ప్రశ్నించాడు అతను.

"అన్నం వండుతూండగా నిప్పంటుకొని ఒళ్ళు కాలింది నాయినా" అందామె బాధగా.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"బాబూ దాని ఖర్మం చిన్నప్పటి నుండీ ఇలాగే

గార్డు

కాలింది, దాని పన్నెండవ ఏటనే తండ్రిపోయారు. దిక్కులేని నా కూతురుకు దాని మేనమామ పెళ్ళి చేశాడు. భర్త మంచివాడే దొరికాడు. నా కూతురి కార్యం కాకుండానే ఆమె భర్త రైలు ప్రమాదంలో మరణించాడు. సాంసారిక సుఖాలకు నోచుకోని నా కూతురు నా దగ్గరే ఉండిపోయింది. దాని భర్త వైపు నుండి దానికి ఏమీ సంక్రమించ లేదు. 'సీతమ్మ' అని పేరు పెట్టుకున్నందుకు ఆ తల్లంత కష్టాలు పడ్తోంది నా కూతురు. పదహారు సంవత్సరాల్ని గడిచింది భర్తపోయి. అటువంటి అనాథను, నా కూతురుపై ఊరి జనం అనవసరంగా లేనిపోని అభాండాలు వేశారు నాయినా."

ముసలావిడ కథకు అతని కళ్ళల్లో నీరునిండింది.

"అది ఇంటి బైటికి రావటానికి కూడా భయపడేది. ఇంట్లోనే కూర్చొని కుమిలి పోయేది."

ఆవిడ కళ్ళల్లోని నీరు బుగ్గల మీదికి దొర్లాయి.

"బాబూ అది కావాలనే చేసిందో లేక ప్రమాదవశాన్నో తెలియదు కాని, దాని ఒళ్ళు కాలిపోయింది, వాడి దయ వల్ల నా కూతురు బ్రతికింది." అందావిడ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

గార్డు ఆవిడ వైపు చూస్తూండిపోయాడు.


"నీ వెవరు నాయినా? నాపై ఎందుకింత శ్రద్ధ చూపుతున్నావ్." అంటూ ప్రశ్నించింది?

అతనో నిట్టూర్పు విడిచాడు. "మీ అమ్మాయిని చూడటానికి వచ్చానంటె దానికో పెద్ద "కథుంది." అన్నాడు ఆవిడ వైపు చూస్తూ.

ఏమిటి బాబూ?" అందావిడ.

అతను చెప్పుకొని పోసాగాడు...

* * *



గార్డు!

కాను, తను గార్డు, నేను పెద్దయ్యాక రైలు గార్డునై నిన్ను దేశదేశాలు తిప్పుతాను, వస్తావా? అని తను సీతతో అన్నమాటలు తల్చుకొని బాధపడేవాడు, కాని ఇప్పుడు తన హృదయం తేలిగ్గా వుంది. పోయిన సీత తిరిగి వచ్చినట్లయింది. ఆవిడ తన కథ విని జాలిపడింది. తనకు లేనిది తిరిగి తనకు లభించింది. పాపం! సీత సాంసారిక సుఖాలకు నోచుకోకుండా భర్తను కోల్పోయింది. అటువంటి సీత తన సీతా ఒకే పోలికలో ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు తను. అందుకే తల్లికి అభ్యంతరం లేకుంటె ఆమెను వివాహం చేసుకుంటానన్నాడు.

ఆ సీత అగ్నిప్రమాదంలో మరణించింది. ఈ సీత అగ్నిలో ప్రవేశించినా తన కోసం బ్రతికింది. ఆమెను చూసి తను పెళ్ళి చేసుకుంటున్నప్పుడు ఆ ముసలి తల్లి ఆనందానికి అవధులు లేకపోయాయి. డిశ్చార్జి రోజువరకు వస్తానని కావలసిన వస్తువుల కోసం బైల్దేరాడతను.

నాలుగువందల ఖర్చుతో బ్రహ్మాండమైన ఇల్లు అద్దెకు తీసుకొని మరో నాలుగు వేలు పెట్టి ఇంటికి కావలసిన వస్తువులు సమకూర్చుకున్నాడు.

లోకం తిరిగి పచ్చని వరిచేలు, అందమైన మావిడి తోపులా గానే కనుపించ సాగింది. సీత తిరిగి వస్తుంది. అదే అతని ఉత్సాహం.

పనులు పూర్తికానిచ్చే సరికి సీతను డిశ్చార్జ్ చేసే రోజు వచ్చింది, పువ్వులు తీసుకొని సూట్ వేసుకొని ఆసుపత్రి జేరాడతను.

"సార్." నర్సు పిలుపుతో ఆగిపోయాడు. "మీకి ఉత్తరం ఇవ్వమని ఆవిడ ఇచ్చారు" అంటూ, ఓ ఉత్తరం అందించింది నర్సు.

అతను ఉత్తరం మడత విప్పి చదవసాగాడు.

"బాబూ,

నీ వంటి ఉత్తముడు నా కంటబడటం నా అదృష్టం. నీవు నా సీతను పెళ్ళి చేసుకుంటానన్న విషయం దానికి చెప్పిన రోజు ఆనందంతో మూర్ఛపోయింది. అది తేరుకున్నాక నీతో స్వర్గ సుఖాలను ఊహించుకొని వెయ్యి దేవుళ్ళకు నమస్కారాలు పెట్టింది.

బాబూ విధి విచిత్రమైంది. మొన్న తన రూపాన్ని అద్దంలో చూసుకున్న సీత కుమిలి, కుమిలి ఏడ్చింది. నేను నీ గూర్చి, నీ కథను గూర్చి దానికి చెప్పాను. దిగులుతో రెండు రోజులు నిశ్శబ్దంగా వుండిపోయింది.

కానీ బాబూ, నిన్న రాత్రి అది ఏ ఉద్దేశ్యంతో చేసిందో గాని, అది విషం తీసుకొని ఆత్మహత్య చేసుకుంది..."

అతను నిశ్చేష్టుగా నిలబడిపోయాడు. అతని కళ్ళల్లో నీరు నిలచింది.

"సీతా గార్డుగా నిన్ను లోకాలు తిప్పాలని ఊహించాను..."

పిచ్చిగా నవ్వాడు గార్డు.

దూరంగా వినపడ్డ రైలు కూతలో అపహాస్యం ధ్వనించింది.

గంగ విష్ణువు పాదాలనుంచి పుట్టిందనీ, దాన్ని శివుడు తలపైని ధరించాడనీ చెప్పుకుంటున్నాం. విష్ణుభక్తులు కొందరు వినోదంకోసమే కానీయండి—శైవులతో—'మా దేవుడు కాళ్ళు కడిగిన నీళ్ళు మీ దేవుడు నెత్తిమీద చల్లుకుంటున్నాడు' అని ఆక్షేపించడమూ కద్దు.

గంగావతరణాన్ని గురించిన కథ రామాయణంలోనే ప్రసిద్ధంగా వున్నది. దాని సారాంశ మేమిటంటే—

పూర్వం సగర చక్రవర్తి అశ్వమేధ యాగం తలపెట్టి గుర్రాన్ని విడవగా, దాన్ని యింద్రుడు అపహరించి పాతాళ లోకంలో తపస్సు చేసుకుంటున్న కపిల మహామునికి సమీపంగా బంధించి ఉంచాడు. ఆ గుర్రాన్ని వెతుకుతూ వెళ్ళిన సగర పుత్రులు అరవైవేలమందీ, కపిలమహర్షే అశ్వాన్ని అపహరించాడని తలచి, ఆయనను అవమానపరచి, అతని శాపంవల్ల భస్మమైపోయారు.

ఆ తర్వాత వారిని వెతుక్కుంటూ సగరుని మనుమడు అంశుమంతుడు పాతాళానికిపోయి, సంగతిని గ్రహించి అశ్వాన్ని తీసుకున్నాడు. కపిల మహర్షిని అనుగ్రహింపజేసి, సగరపుత్రుల ఉత్తమగతికి, ఆకాశగంగాజలాన్ని వారి భస్మంపై ప్రవహింపజెయ్యాలని తెలుసుకున్నాడు, పుత్ర శోకంవల్ల క్రుంగిపోయిన సగరుడు ఎలాగో యాగం పూర్తిచేసి, ఆ విచారంతోనే మరణించాడు. అంశుమంతుడు ఆకాశగంగకోసం విశ్వప్రయత్నం చేశాడు. ఆతని జీవితంలో ఆ కోరిక నెరవేరలేదు. తర్వాత కూడా కొన్ని తరాలు గడిచిపోయాయి. చివరికి భగీరథుడు చాలా పట్టుదలతో తపస్సు చేసి, గంగను నేలకు తెప్పించి, అది తన వెంట వచ్చునట్లుచేసి, తన వంశీయుల భస్మముపై ప్రవహింపజేసి, వారికి ఉత్తమ గతిని కల్గించాడు. అసాధారణమైన ఆ ప్రయత్నం అందరిచేతను స్తుతించబడింది. నాటినుంచీ పట్టుదలతో చేసిన గొప్ప ప్రయత్నం భగీరథ ప్రయత్నంగా పేరు పడింది.

ఇందులో ఒక రహస్యం ఇమిడి ఉన్నది.

వర్షాలవల్ల హిమవత్పర్వతాలపైని పడిన నీరు చిందరవందరగా ప్రవహించి నలు



ధర్మపథం
భగీరథ ప్రయత్నం

బులుసు వేంకటరమణయ్య


దిక్కులా పోయేది. దేశంలోవున్న ప్రజలు నీరులేక — పంటలులేక మలమల మాడి మృత్యువు పాలయేవారు. పాలకులైన రాజులు ఈ సంగతి గ్రహించి పెద్దకాలువ త్రవ్వించి గంగాజలాన్ని దేశంలో ప్రవహింపజేసి, దేశం సుభిక్షంగా వుండి, ప్రజల కష్టాలు పోయేటట్లు చెయ్యాలని సంకల్పించారు. అంశుమంతుడి కాలంలో ప్రారంభమైన ఈ త్రవ్వకంపని కొన్నితరాలకుగాని పూర్తి కాలేదు. ఆ గౌరవం భగీరథుడికే దక్కింది.

భగీరథుడు గంగానదీమార్గాన్నిమాత్రం త్రవ్వించాడు. ఆకాశంనుండి ఎడతెగకుండా కుంభవృష్టిగా కురిసిన వర్షంవల్ల హిమవంతంపైని ఏడు పాయ లేర్పడ్డాయి. అందులో ఒక్కపాయమాత్రం గంగానది అయింది. ఈ స్కీమువల్ల జహ్నుమహర్షి ఆశ్రమం మునిగిపోవడం కూడా సంభవించింది.


కైలాస శిఖరం హిమవత్పర్వతాలలో ఎత్తయినది. అది పరమేశ్వరుడి నివాసం! విష్ణుపదం అంటే ఆకాశం. ఆ విష్ణుపదం నుంచిపడిన గంగాప్రవాహం శివుని తలపైని పడినదంటే—కైలాస శిఖరంమీద పడిందన్నమాట! ఇందువల్లనే విష్ణుపదం నుండి—విష్ణువు పాదాలనుండి వెలువడిన ఆకాశగంగను శివుడు తలపైని ధరించాడనీ, ప్రేమకొద్దీ గంగాదేవిని తలపైని ఎక్కించుకున్నాడనీ ఇతిహాసాలు తయారైనాయి.

విష్ణుపదానికి—విష్ణువు పాదమని అర్థం చెప్పడంవల్ల ఆయన కాళ్ళు కడుగుకున్న నీరు శివుడు నెత్తిపైని చల్లుకున్నాడని చెప్పడం సంభవించింది. ●

ఏమోయ్! డ్రైవర్! రేపట్నుంచి పనికి రానక్కర్లే ఏటుగా..??



సీరియల్



ప్రేమించు ప్రేమకై

కె. రామలక్ష్మి

జరిగిన కథ

లలితకి మోహన్‌తో పరిచయమవుతుంది అది ప్రేమగా పరిణమిస్తుంది. పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటారు. ఆస్తికోసమే మోహన్ తనని పెళ్ళిచేసుకోదలిచాడని తెలుసుకున్న లలిత అతనితో తెగతెంపులు చేసుకుంటుంది. లలిత పెద్ద దిక్కయిన అత్తయ్య కూడా చనిపోతుంది. లాయరు సలహాపైన ఆమె శాస్త్రిగారనే మరొక గార్డియన్ ఇంటికి వెళ్తుంది.

3

లలిత ఆ సువిశాలమైన వరండాలో ఒంటరిగా మిగిలిపోయింది. వరండాలో అక్కడా అక్కడా కుర్చీలూ సోఫాలూ అమర్చి ఉన్నాయి. వరండా ఇంటిచుట్టూ ఉన్నట్టుంది — అందంగా ఒంపులు తిరిగి — చుట్టూ అందంగా పిట్టగోడ ఉంది — పిట్టగోడమీదకి తొంగిచూస్తూ తోటలోని పూలచెట్లు ఉన్నాయి. ఎంతో అందంగా పూసిన ఓ చెట్టుకొమ్మ మరీ కిందకివంగి వరండాలోకే చూస్తున్నట్టుంది. లలిత వెళ్ళి అక్కడనించుని కొమ్మ అందుకుంది. అలాగే నిలబడి పరిసరాలని పరిశీలిస్తుంది... 'ఇంత అందాన్ని ఇక్కడ ఎలా కట్టిపడేశారు ? ఇదంతా నన్ను కట్టేసుకుంది. ఇంత అందం మనసులోని విషాదాన్ని పారదోలుతోంది. ప్రాణం విసు గనిపించడం లేదిక్కడ' అనుకుంటూ — విప్పారిన కళ్ళతో అన్నివైపులా చూస్తూ సర్వం మంచి నిలబడి పోయింది లలిత.

అప్పుడే ఎవరిదో అడుగుల చప్పుడు విన్పడింది. ఒక్క ఉదుటున వెనక్కి తిరిగి చూసింది — అవతలి వైపునుండి ఇటు వచ్చిన ఆ వ్యక్తిని చూసి క్షణం స్తంభించింది లలిత. ఆకులచాటునుండి సూర్యకాంతి వింతనీడలు పరుస్తూ చిలిపిగా ఆడుకుంటుంది. కొంచెంసేపు ఎండ వెల్గు వారిద్దరి మధ్యా నిలచి కదలింది. ఆ వింత జిగేలు మనడంతో పొడవైన ఆ కృతి మాత్రం చూడకల్గింది లలిత. అతను కూడా రెండడుగులు ముందుకి వేసి పిట్టగోడ దగ్గరకి వచ్చి నిల్చాడు. శిల్పి చెక్కినట్టున్న ఆ వ్యక్తిని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయింది లలిత. అతని చూపుకూడా తీక్షణంగా ఉంది. 'ఎంత అందగాడు!' అనుకుంది లలిత. కాని మరుక్షణమే — 'ఒక్క అందగాడే కాదు— చాలా హుందా అయిన వ్యక్తిలా ఉన్నాడు. కఠినుడు కూడా కావచ్చు—ఆ దవడ చూడు' అనుకుంది.

అప్పుడే ఆ చామంచాయిగా ఉన్న పోత విగ్రహం మాట్లాడింది. కనుబొమలు ఆశ్చర్యంతో కొంచెం పైకి లేచాయి.

'ఎవరి కోసమైనా చూస్తున్నారా ?'

'అవును...' తొట్రుపడింది లలిత. హఠాత్తుగా ఎక్కడలేని సిగ్గు భయం ముంచుకు వచ్చాయి. 'శాస్త్రిగారి ప్రాంతాలలో ఉంటారా ?' అంది ఎలా చెప్పాలో తెలియక.

'ఉంటారే' అన్నాడతను. సన్నని చిరునవ్వు అతని పెదవులపై వెల్గింది. ఆ నవ్వుతో అతని ముఖానికి కొత్త అందం వచ్చింది, అనుకుంది లలిత.

'నా పేరు శాస్త్రి' అన్నాడు.

వింతపడి చూసిందతనికేసి ... 'కాదు నేచూసే శాస్త్రిగారు మీరై ఉండక పోవచ్చును..నా కోసం ఎదురుచూసే శాస్త్రిగారిల్లు ఇదేనని స్టేషనులో చెప్పారు, ఇది బలరామ శాస్త్రిగారిల్లు కాదా ?' అడిగింది.

అతని ముఖ కవళికలు పూర్తిగా మారిపోయాయి.

అది ఆశ్చర్యమా ? అయిష్టతా ? ఏదైనదీ ఆ మార్పును పట్టి చెప్పలేక పోయింది...మళ్ళీ అతనే ... ఆ చక్కని కంఠంతో అన్నాడు.

'నేనే బలరామ శాస్త్రిని'

స్తబ్ధురాలై నిలబడి పోయింది లలిత... అతని కేసే అలా చూసి చూసి...నాది పొరపాటు అయివుంటుంది— ఇది సంభవమా ? లాయరుగారు పొరపడ్డారా ? ఈయన నాకు గార్డియను అయి ఉండడు ! అనుకుంది.

ఆమె ఆశ్చర్యానికి కారణాలు చెప్పడం సులభంకాదు. ఆమె గుండెలు త్వరితగతిని కొట్టుకోడానికీ కారణాలు చెప్పడం సులభం కాదు. ఆమె ఎదురుచూసిన గార్డియన్ ఓ ముసలాయిన అయివుండాలి. అది కాకపోడమే ఆమె బిత్తర పోడానికి కారణం. ఎంత ఊహించుకుందామన్నా తన సంరక్షకుడీయన అన్న నమ్మకం కల్గలేదు లలితకి. అత్తయ్య కట్టుడిలోంచి ఓరకంగా ఇంకోరకపు మామయ్య కట్టుడికి ట్రాన్స్‌ఫరవుతున్నానన్న ఊహా బలంగా నాటుకు పోయిన లలితకీ వ్యక్తి ఎదురవడం— వింతే. పట్టుమని ముప్ఫయి అయిదేళ్ళేనా ఉండని ఈ వ్యక్తి సంరక్షకుడేమిటి.' అనుకుంది.

'అది కాదూ...' అని ఏదో అనబోయి. ఆ నిముఖంలో కనబడిన సన్నని నవ్వా కళ్లలో చిలిపితనం చూసి సిగ్గుతో ఎర్ర బడిన ముఖం కిందికి దించేసుకుంది లలిత. కాని తనని తాను పరిచయం చేసుకోక తప్పదు అన్నది జ్ఞాపకం వచ్చి నెమ్మదిగా తలెత్తింది.

'నేను లలితని, సుబ్బమ్మగారి మేన కోడల్ని' అంది.

'ఏమిటీ?' అని అదిరిపడ్డట్టు అన్నాడు అతను. కళ్లలో చిలిపితనం మాయమై ఫాలభాగం ముడుతలు పడింది. 'నేనండీ సుబ్బమ్మగారి లలితని. లాయరు వెంకట్రామయ్యర్ గారు మీకు రాసి ఉండాలి' అంది ధైర్యంగా. కాని ఇలా చెప్పుకోవలసి వచ్చినందుకు ముఖం కందగడ్డలాగ అయిపోయింది.

'మై గాడ్! ఈ రోజెలా వచ్చిపడ్డా రిక్కడ? ఎనిమిదోతేదీని వస్తావన్నారే?' అన్నాడు ఆశ్చర్యాన్ని కొద్దిపాటి విసుగుతో మిళాయిస్తూ.

లలిత కిది నిజంగా బాధనిపించింది. ఎవరూ స్టేషనుకి వచ్చి తీసుకురాలేదు సరికదా—నిలబెట్టి ఇప్పుడెందు కొచ్చావు? అంటే బాధగానే ఉంటుంది మరి. అసలే ఇష్టం లేకుండా రావలసి వచ్చిన స్థితి.

'ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుంది. గేటు తెరిచిన మీ రత్తి ధోరణిపట్టి అదే అనుకున్నాను నేను' అంది కొంచెం కోపంగా.

'నా కసలు తెలియదు మీరొస్తారని... ఇక్కడికెలా చేరకల్గారు? స్టేషనునుంచి చాలాదూరమే...'

'టాక్సీలో వచ్చాను.'

'క్షమించండి. లాయరుగారు మీరు ఎనిమిదికి వస్తారని రాశారు. అందుచేత ఇలా జరిగింది. మిమ్మల్ని స్టేషనులో కలిసి ఇంటికి పిలుచుకుని రాలేకపోయినందు కెంత బాధపడుతున్నానో చెప్తే తెలియదు అన్యధా భావించకండి' అన్నాడు.

అతని కంఠస్వరంలో ఏ గుణం లేకపోయినా అతని ధోరణిలో ఎప్పుడూ విజాయితీ మటుకు లోపించదనిపించింది లలితకి.

'మీ కొత్త యింటికి సుస్వాగతం' అంటూ చేయి జాపాడు. ఆ కళ్లలో చిలిపితనం తిరిగి వెల్గింది.

చేతులు జోడించి నమస్కరిస్తూ 'థాంక్యూ...' అంది లలిత.

'రండి కూర్చుని మీ ప్రయాణం విశేషాలు చెప్పండి—మిమ్మల్ని చూసి సరళ కోసం ఎవరో స్నేహితులు వచ్చారను కున్నాను...' అంటూ సోఫా కేసి దారి తీశాడు బలరామశాస్త్రి.


'అసలా లాయిరుకి వృద్ధాప్యం వచ్చేసి ఉండాలి—లేకుంటె ఏమిటీ పొరపాట్లు!' అంటూ సంభాషణ ప్రారంభించాడు.

వళ్లో చేతులు పెట్టుకుని ఒకటికి పదిసార్లు తన వేళ్లను లెక్కపెడుతూ కూర్చుంది లలిత.

'గుమస్తా పొరపాటై ఉంటుంది' అంది నెమ్మదిగా.

'నిజమే అయివుండొచ్చు. అయితె మాత్రం ఆయినోసారి చూసుకోవద్దా' నేనీ సంగతి ఘాటుగా రాసి తీరాలి, మీరు సేఫ్‌గా వచ్చిచేరారు కనుక సరిపోయింది. లేకుంటే?'

'లేదండీ వెంకట్రామయ్యర్ చాలా



సొమ్మదస్తులూ మంచివారు. నేనంటే వారికి చాలా అభిమానం' ఎందుకో తెలియదుగాని ఈయన చిన్నాట్లనుంచి ఆయన గార్ని రక్షించాలనిపించింది లలితకి.

'ఓ వయస్సు వచ్చాక రిటైరైపోవాలి అంటారు ఇందుకనే కాబోలు.' తనలో తనుగా అనుకున్నాడు బలరామశాస్త్రి. 'గట్టివాడు! ఓ పట్టాన వాదించి గెలవడం కష్టం' అనుకుంది లలిత.

'మీ రనుకునేటంత ముసలి వగ్గేంకాదు లాయరుగారు. అయినా నేను క్షేమంగా చేరానుగా, ఆసంగతి రాస్తే చాలదా?' ధైర్యంగానే అడిగింది.

'నిజం నిజం. నేను ఎదురు చూసిన వ్యక్తి మీరంటివైతే అది సాధ్యం అయి ఉండేది కాదు.' సన్నగా నవ్వుతూ అన్నాడు. 'పోనీలెండి ఎలాగో వచ్చి చేరారుకదా? నేను స్టేషనుకి ఎవరినీ పంపించక పోయినందుకు క్షమిస్తారుకదూ!' మాట మార్చేశాడు.

'మీ రెవర్ని ఎదురు చూశారు!' కుతూహలంగా అడిగింది లలిత.

'ఓ పదేళ్ల రెండుజడల పిల్లని. అందుకే స్టేషనులో దింపుకొందుకు అంత బందోబస్తు ఏర్పాటు చేశాను' గట్టిగా నవ్వేశాడు.

'అయితే నాలాగే మీకూ అయిందన్న మాట' అనేసి నాలిక్కొరుచుకుంది లలిత.

'అంటే ?' ఆత్రంగానూ తీవ్రంగానూ అడిగాడు.

'మీ రెవరో పెద్దవారై ఉంటారు. లేకుంటే నాకు సంరక్షకునిగా ఎలా నియ

ప్రేమించు ప్రేమకై

మించారు ? అనుకున్నాను తీరా చేసి చూస్తే...' నసిగింది లలిత.

అతగాడు గట్టిగా నవ్వేశాడు.

లలితకూడా నవ్వకుండా ఉండలేక పోయింది.

'మీ ఎడ్రసు చెప్పగానే స్టేషను లోపలా బయటాకూడా అంతా సహాయం చేశారు.' అంది లలిత.

'మంది 'కీర్తిపతాక' కదూ' ఒక్క చేతి కదలికతో ఇంటిని కలయచూపాడు. ఈ ప్రాంతాల కిది కొంచెం ప్రసిద్ధమే ... మీ రిక్కడ సుఖంగా వుంటారని ఆశిస్తాను' అన్నాడు.

'చాలా బాగుందండీ, పట్నవాసపు అగ్గిపెట్టెళ్లు చూసిన నా కళ్లకి ది వేరే లోకంలాగా ఉంది...'

'మీ మామయ్య బాగా జ్ఞాపకం ఉన్నాడా మీకు ?'

కుతూహలంగా అడిగాడు.

'నాకు బాగా జ్ఞాపకం. వో ఏడేళ్ల నుంచీ అసలు రానేలేదు. అంతకి ముందు వచ్చినప్పుడే ఇక్కడ అత్తయ్యతో ఘర్షణ పడ్డాడు...నా గురించి...'

'అవునవును. నాకు రాసేవాడు. మేం ఇద్దరం చాలా సన్నిహితులంగా బ్రతికాం. అకాలమరణం పాలైపోయాడు... మీ అత్తయ్యకి నేను ఉత్తరం రాస్తేనే వచ్చింది— నన్ను మీ సంరక్షకునిగా నియమించి తను కూడబెట్టిన దంతా భద్రం చేసి మీకు అందించమని వాడి కోరిక. మీ ఫోటోకూడా చూపెట్టాడొకసారి. దాన్నిపట్టే మీరింకా ఏ హైస్కూల్లో విడిచి ఉంటారని ఊహించాను' నవ్వాడు.

'అంత చిన్నప్పటి ఫోటో చూపాడా' ఆశ్చర్యంగా అడిగింది లలిత.

సమాధానంగా కుతూహలంగా లలిత ముఖంలోకి చూస్తూ ఊరుకున్నాడు బలరామశాస్త్రి. కళ్లు దించుకుంది లలిత.

'వీరా మేనత్త తత్వం నాకోపట్టాన అర్థంకాదు...పోనీలెండి అవన్నీ తరవాత మాట్లాడుకుందాం. ఇదిగో రత్తి వస్తుంది. కూడా వెనక వస్తున్నది మా వంటావిడ. మీ రావిడని చూసి భయపడకూడదు. శరీరం ఎంత పెద్దదో మనస్సు అంత సున్నితం. నేనేమేనా చెప్తే నిన్ను ఎత్తి పెంచానని నా నోరు నొక్కుతుంది...' నవ్వాడు.

'బాబూ ఎంత తప్పయి పోయిందో చూశావా? మీ అత్తయ్యగారేనా ఉండకూడదూ. ఈరోజే వెళ్లాలా ఎక్కడికో' అంటూనే సమీపించింది వంటావిడ—

'పోనీలే, వచ్చేస్తారుగా. అమ్మాయిగారికి గదులు చూపించు. కాస్సేపు విశ్రాంతిగా పడుకుంటారు. అంతా కలిసి టిఫిను చేస్తాంలే.' అంటూ 'మీరు మీ రూంకి వెళ్లండి నేమళ్లా కలుస్తా' నంటూ లేచి వెళ్లాడు. వెడుతున్న అతన్నే క్షణం రెప్పవాల్చక చూసింది లలిత. నే ఊహించిన సంరక్షకునికి ఈయనకీ పోలికేలేదు, అనుకుంది.

'రండమ్మాయిగారూ,' అంది రత్తి.

'వెళ్లమ్మా ఓ గంట నడుం వాల్చు.' అని చెప్పి శరీరాన్ని ఈడ్చుకుంటూ మళ్లింది వంటావిడ. రత్తి వెనకాతలే మేడ ఎక్కింది లలిత

అదొక విడి భాగం లాగా ఉంది. ముందో హాలు. అందంగా అన్నీ సర్ది ఉన్నాయి. దాన్ని ఆనుకునే పడకగది. ఓ పక్కన బాల్కనీ. గది వెనకవైపు బాత్‌రూము కూడా ఉంది. అంతా పరిశుభ్రంగా పొందాగా ఉంది.

'రెండురోజుల క్రితమే — యిదంతా తమరికోసం అమర్చాం అమ్మాయి గారూ, బాబుగారన్నారు—మేష్టరొచ్చినా ముందు గదిలో కూర్చుని చదువుకుంటుందని' అంటూ పడగ్గదిలో లలిత పెట్టెలు సరిగా పెట్టడం ప్రారంభించింది రత్తి.

హైస్కూల్లో చదువుకునే ఏ అల్లరి



పిల్లో వస్తుందని — ఎదురుచూసినట్టు న్నారు! అనుకుంది లలిత.

'నే తోటలో ఉంటాను కావలిస్తే అలా అక్కణ్ణుంచి తొంగిచూస్తే చాలు' అంటూ రత్న క్రిందికి దిగింది.

బాల్కనీలోకి వెళ్ళి తొంగిచూసింది లలిత.

ఓ పక్కగా తోటవాడి పాక. అటు వైపుగా గేటూ కనీ కనిపించనట్టు చెట్ల గుబురులలోంచి కన్పిస్తున్నాయి.

'అమ్మయ్య!' అనుకుంటూ మెత్తని పరుపుమీద నడుం వాల్చింది లలిత ...ఇదొక కొత్త బ్రతుకు...ఎన్నాళ్ళో? అనుకుంది ... కళ్ళుమూసుకు పడుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందో మీదికి వంగి రత్న లేపు తోంది.

'రండమ్మా టిఫినుచేసి కాఫీ తాగి పడు కుందురుగాని. సరళమ్మగారూ సరస్వతమ్మ గారూ వచ్చినారు' అంది. లలిత లేస్తుం టనే పరుపుమీద దుప్పటి సాపుచేస్తూ "మీరెలా ఉన్నారంటూ ఏం ప్రశ్నలు కురి పించారనీ, సరళమ్మది ఏం అందంలే. అయినా నీలంత నాజూకుగా ఉండదు.' అంది ముసిముసిగా నవ్వుతూ.

'నా వయస్సుంటుందా!' కుతూహలంగా అడిగింది లలిత. ఏంలేదు. కంపెనీకి ముఖంవాచిన తనకిక్కడో జత దొరికితే హాయిగా ఉంటుందని తలపోసింది.

'ఇంకా పెద్దాదేనమ్మా' ఆ వేషం అలాంటిది అంటూ దారితీసింది రత్న.

లలిత ముందు ముఖం కడుక్కొని తల దువ్వుకుంది. విడుపాటి కురులు బాగాగా పొలుజడలో అం దం గా ఉన్నాయి. లేత గులాబిరంగు వెంకటగిరి చీర కట్టుకుంది. పాతకాలం జాకెట్టు తొడిగింది. వెనక బొత్తాలతో అవస్త పడుతూంటే రత్న తిరిగినమ్మా యింకా ఇక్కడే ఉన్నారా? అంటూనే కళ్ళప్పగించి చూస్తూ ఊరు కుంది. 'అలా చూస్తావేం కొంచెం మధ్య బొత్తాం పెట్టు' అని వెనక్కి తిరిగింది లలిత.

బొత్తాం పెట్టి ముఖానికి చేతులురాసి మెటికలు విరుచుకుంది రత్న. 'అబ్బ అప రంజి బొమ్మవేనమ్మా' ఇప్పుడు చూడాలి సరళమ్మ ముఖం.' అంది తృప్తిగా.

'నాలుగు రోజులైతే ఒకటే గొణ గొణ మీ గురించి. ఇక్కడి కెందుకు ఏదో మ్మాల్లో పెట్టమంటారు; ఉత్త్ చూతు ళ్ళు.

అయ్యో పాపం అత్తయ్యా పోయి బెంగ వడి ఉంటుంది—నాలుగునెల్లు నా దగ్గర ఉండి చనువేర్పడ్డాక బోర్డింగు పెడతా నంటారు. గోడవలె. చూస్తారు గా—' అంటూ గబగబ వెళ్ళింది రత్త—వంటా విడతో ఏదో చెప్పాలని దాని ఆత్రం. ఆఖరుసారి ఓసారి అద్దంలో చూసుకుని ముఖానికి కుంకుమ పెట్టుకుని క్రిందికి దిగింది లలిత,

కిందహాల్లో ఎవరూ లేరు. పక్క వరండా లోంచి మాటలు వినిపిస్తున్నాయి. వింటు న్న స్తంభించినట్లు ఉండి పోయింది.

'సుబ్బమ్మ ఉత్తరం వచ్చిందన్నమాట ...పాపం, మనం లేకుండా బలరాం ఎంతవస్తా ననుకున్నాడో చెప్పాపెట్టకుండా అలా దిగబడిం దేమిటె?'

'పూర్తి బలరాం!' కొంచెం చిన్నపిల్ల కంఠంలాగా ఉంది.

మాటలతో పాటు గలగల నవ్వింది. 'ఇది భావం అంటే పేచీకలిగా ! బాధపడి పోతు న్నాడు' అంది.

ప్రేమించు ప్రేమకై

'నిజం అంతే కదే. సాఫీగా సాగిపోతున్న జీవితానికిదో సెడద వచ్చిపడింది కదా!... పోనీలే త్వరలోనే వదుల్చుకుంటా నన్నాడుగా.

'ఇల్లి నడిగి చూశావా ఎలా ఉందో!'

'ఎలా అడుగుతావే — అమ్మాయిగా రొచ్చారు—ఎవరూ స్టేషనుకేనా వెళ్ళ లేదని అయ్య కోపం చేసుకున్నా రంటూం టేనూ—చూస్తూంగా. తినపోతూ దుమ లెందుకు?'

'అలాంటి అత్త పెంచితే ఎలా ఉంటుందో ఊహించకలవే అమ్మా...పాతకాలపు పతి వ్రతలాగా...'

కోపంతో ఒణికి పోయింది మెట్ల ముందు నిలబడి పోయిన లలిత. విన్నది చాలు. నే ఉన్నానని తెలియక యింకా ఏం మాట్లాడుకుంటారో...నే ఉన్నట్టు గుర్తిం చేలా చేస్తే నయం...అంటూ ముందుకే వేసింది పాదం.

అదే క్షణంలో 'హల్లో లలిత' అంటూ హాలుకి లటువైపున్నటి తలుపు తెరచి బల రామశాస్త్రి హాల్లోకి ప్రవేశించాడు. ఆ సందడికి వరండాలోంచి ఇద్దరు లోపలికి వచ్చారు—అక్కడ ఒకళ్ళనొకళ్ళు చూస్తూ నిలబడ్డ లలితని బలరాంని చూసి; 'ఎవరు బలరాం!' అంటూ పలకరించింది పెద్దావిడ.

'మా అత్తయ్యా, లలిత. మన లాయరు గారు రాశారే ఆ అమ్మాయి. సుబ్బమ్మగారి మేనకోడలు. ఈవిడ నాకు మేనత్త సరస—వాళ్ళ అమ్మాయి సరళ. మీ పట్నంలోనే కాలేజీలో చదివింది!' [illegible] అన్నాడు బలరాం.

'వెల్‌కం, వెల్‌కం' అంటూ చేయి జాచి ముందుకి వచ్చింది సరళ.

లలిత మటుకు అలాగే నిలబడి పోయింది.

'రండి టిఫిన్ ముగిస్తే నాకింకా పను లున్నాయి. అందర్నీ పరిచయం చేయడం అవుతుంది కదా అని ఒకసారే తిందాం అన్నాను' అంటూ డైనింగ్‌రూముకి తీసి దారి తీశాడు బలరాం...

'ఎప్పుడూ లేంది ఇదేమిటి? బలరాంకి ఆకలేయడం వింతగా లేదు అమ్మా?' కిలకిల నవ్వుతూ బలరాంని తోసుకుంటూ టేబిలు ముందు కుర్చీలో చతికిల పడింది సరళ.

మూగపోయినట్టు బొమ్మలాగా నడిచి వెళ్ళి కూర్చుంది లలిత.

ఇద్దరివైపూ ఓ క్షణం ఆశ్చర్యంగా చూసి కూర్చున్నాడు బలరాం.


వంటావిడతో అన్నీ తెమ్మంటూ చెప్ప డానికి లోపలికి వెళ్ళింది సరస్వతమ్మ.

ఆ గదిలో నిశ్శబ్దం తాండవించింది. ఎంతో ఉత్సాహం తలెత్తి ఇలా అయిం దేమిటి? అనుకుని గోళ్ళు చూసుకుంటూ కూర్చుంది లలిత.

వంట ఇంటిలోంచి తిరిగివచ్చి లలిత పక్కన ఖాళీ ఉన్న కుర్చీలో కూర్చున్నా రావిడ.

'అయితే నువ్వన్నమాట సుబ్బమ్మ మేనకోడలివి...నే నూహించినట్టే ఉన్నావు పాపం. సగం పిచ్చి సగం మూర్ఖం, ఎలా పెంచిందో నిన్ను!' అంటూ ఏహ్యంగా నిట్టూర్చింది.

లలిత ఏం మాట్లాడుతుంది; తలెత్తి ఓసారి అందరిముఖాలూ చూసింది. బల రామశాస్త్రి చాలా కుతూహలంగా తనకేసి



చూస్తున్నాడు.

'గట్టిదానివే తిన్నగా రాగలిగావు! ఎక్కడిదాకానూ చదివిందన్నావు బలరాం ?' కిల కిల నవ్వేసింది సరళ.

వంటావిడ అందరి ప్లేట్లలోనూ వడ్డిస్తూ ముఖం చిట చిట లాడించు కుంటూ ఈ మాటలు వింటూంది.

'నాకేం పెట్టకండి, కాఫీ చాలు' అంది లలిత. అందరూ వినేలా మాట్లాడా లంటేనే దడగా ఉంది.

'ఇలా అయితే ఎలాగమ్మా ? ఈ రోజు నీకు కొత్తగానీ' అంటూ వాక్యం పూర్తి చేయకుండానే వడ్డించి వెళ్ళిందావిడ.

'తినమ్మా, దూరప్రయాణం కూడా చేసి అలసివచ్చావు!' అన్నాడు బలరాం.

'హు! అమ్మాయట! నేనేం చిన్నపిల్లనా!' అనుకుంది లలిత.

'నా కిప్పటికీ అర్థంకాడంలేదు. లక్ష్మి వారంనాడు వస్తానన్నది రోజెలా రాగలిగా వని!' అన్నారు సరస్వతమ్మగారు.

'లాయరుగారి గుమాస్తా పొరపాటు రాసి ఉంటాడని నా ఊహ.'

'పోనీలే జాగ్రత్తగా వచ్చి చేరావు అంతే కావలిసింది. అమ్మాయి, అయితే నీ కెన్నే ళ్ళుంటాయి ?' కుతూహలంగా అడిగింది. 'వచ్చే మే మాసానికి ఇరవై నిండిపోతాయి.

'పాపం బలరాంకి ఏం షాకు తినిపిం చావు! ఎలా వచ్చిందో అర్థం కావుగాని మా అందరి బుర్రల్లోకీ ఒకేఊహవచ్చింది: నీకు పది పదమూడేళ్ళుంటాయని' గట్టిగా నవ్వింది సరళ, 'ఏ స్కూల్లోనో ఉండి ఉంటావని ఊహించుకున్నాను నేను.'


'అలా అయితే అక్కడే ఉండి ఉందును కదా ?'.

'సరళకీ జూన్‌లో పుట్టిన రోజు వస్తుంది—ఇద్దరూ సరదాగా పార్టీ చేసుకో వచ్చు ఈ ఏడు ? ఏం సరళా ?' అంది కూతురి ముఖంలోకి వాడిగా చూస్తూ.

సరస్వతమ్మగారి ఆదరణంతా పైపైదే నని గ్రహించడానికెంతోసేపు పట్టలేదు లలితకి. ప్రయాణంగురించి అత్యంత విషాదకరమైన మరణం గురించి...ఎన్నెన్నో ప్రశ్నలు వేసి చూసింది.

(ఇంకా ఉంది)

ఏటికి ఎదురీదడమే ధీరుని గుణం



రంగుల రాట్నం

సాల్మన్ చేప

చేపలు అందరికీ పరిచయమే. వాటి అలవాట్లు లక్షణాలు అందరికీ తెలిసి నవే. అయితే ఈ చేపకొక ప్రత్యేకత ఉంది. పసిఫిక్ మహాసముద్రంలో ఒకానొక సాల్మన్‌ఉంది. కొన్ని పెద్దవి దరిదాపు మనిషి బరువు, ఎత్తు ఉన్నా (100 పౌన్లు, 5 అడుగులు) సామాన్యంగా 50 - 60 పౌన్లు బరువు వుంటాయి. వాటి జీవితం అంతా సముద్రంలో గడిచినా, గుడ్లు పెట్టడానికి మంచినీటి వాతావరణం కావాలి. ఆ సమయం వచ్చాక గుంపుల్లో సముద్రం వదలి నదుల్లోకి ప్రవే శిస్తాయి. అలా నదుల్లో వందలాది మైళ్ళు (కొలంబియానదిలో 1000 మైళ్ళు) ప్రయాణంచేసి నదీ జన్మ స్థానంవరకు పోతాయి. ఈ ప్రయా ణం ఎంత కష్టతరమైనదో కదా! ఎందుకంటే నదీ జన్మస్థానంనుంచి సముద్రంవట్టు రావడం సులభం. వ్యతిరేకమార్గంలో ఎన్నోమిట్టలు, అడ్డు కొండలు దాటుకొని పోవాలి కదా. అలా పోవడంలో అవి 10, 15 అడుగులవరకు పైకి ఎగురుతాయి. ఆనకట్టలు కట్టాక ఇది వాటికి ఇంకా కష్టమయింది. అమెరికాలో వీటికోసం ప్రత్యేకం ఒకప్రక్క మెట్లవరుసగా కట్టి ఉంచారు. పైగా వాటికి లిఫ్టులుకూడా అమర్చారు. ఎన్నోచేపలు చేరాక ఎత్తి పైమటా నికి తీసికొపోయి వదుల్తారు. యాత్రికులు విరివిగావచ్చి ఈ వింతను చూస్తూ ఉంటారు ఆరోజుల్లో!

తిండికూడా తినకుండా కొన్ని నెలలు ఈ ప్రయాణంచేసి, ఇవి పూర్తిగా అలసిన దెబ్బలుతిన్నస్థితిలో గమ్యం చేరతాయి. అక్కడ గుడ్లుపెట్టి పైకి తేరి తిరుగు ప్రయాణం ప్రారం భిస్తాయి; కాని త్వరలోనే చనిపో తాయి.

పిల్లలు గుడ్లనుండి బయటకు వచ్చాక తిరిగి సముద్రమార్గంలో ప్రయాణం చేస్తాయి. సముద్రంలో కొన్ని సంవత్సరాలు ఉన్నాక, తిరిగి సంతానోత్పత్తికాలంలో నదిమార్గం పడతాయి.

గోదావరి నదిలో ఇలాగే పొలసచేప (హిల్సా) గుడ్లుపెట్ట డానికి సము ద్రంనుండి వస్తుంది.

—జమ్మి కోనేటిరావు.




ఏదో ఒకటైములో ఒకపేరో, లేక బద్దలుకొట్టుకోవడం అందరి
యింటినెంబరో గుర్తుతెచ్చుకోడానికి బుర్ర అనుభవంలోను జరుగుతుంది. ఈ మతి

మరుపు అనేది ఎలా కలుగుతుంది అని శాస్త్రజ్ఞులు 19వ శతాబ్దంనుంచే తీవ్రంగా ప్రయోగాలు జరుపుతున్నారు. అయితే ఈ ప్రయోగాలు ఎలా వుంటాయి? సాధారణంగా యివి కాలేజీ విద్యార్థులమీద జరుపుతారు. వాళ్లకి ఒక మాటల జాబితా గాని, మాటలుగాని అక్షరాల సముదాయాల (ఉ॥ QZR, DAX) జాబితా గాని యిస్తారు. ఒక్కొక్కమాట నేర్చుకోడానికి ఒకటి, రెండు సెకండ్లు టైము యిస్తారు తరవాత కొంతసేపయాక ఆ జాబితా అప్పచెప్పమంటారు. ఒక జాబితలో 20, 30 మాటలుండొచ్చు. వాటిల్లో ఎంత ఎక్కువ శాతం గుర్తుంచుకుంటే అంత జ్ఞాపకశక్తి వున్నట్లు లెక్క. ఈ పరీక్ష కొన్నిగంటలు, రోజులు, నెలలు పోయాక జరుపుతారు. కాలం ఎక్కువ గడచిన కొద్దీ జ్ఞాపకం పెట్టుకోగలిగిన మాటల సంఖ్య తగ్గుతో వుంటుంది. అలాగే మాటల సంఖ్య ఎక్కువ అయినకొద్దీ, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.

ఇలాంటి ప్రయోగాలవల్ల కొన్ని వింత సంగతులు తెలియవచ్చాయి. మతిమరుపుని గురించి మనకి సాధారణంగా వుండే ఊహాలు కొన్ని తప్పనికూడా వీటివల్ల తెలుస్తోంది.

మాటలు జ్ఞాపకం పెట్టుకోడం కన్నా మాటలుకాని పొడి అక్షరాలు గుర్తుపెట్టుకోడం కష్టం. వేరు వేరు రకాల సంగతులు గుర్తుపెట్టుకోడంకన్నా, ఒకేరకం మాటలుగాని, సంగతులుగాని గుర్తుపెట్టుకోడం ఎక్కువ కష్టం. అయితే గుర్తుపెట్టుకోవలసిన మాటలు అర్థవంతమైనవా కావా అనేది వాటిని గుర్తుపెట్టుకోడంలో ఏవిధంగాను సాయపడదు. ఒక విషయం ఎంత క్షుణ్ణంగా నేర్చుకున్నాము అనేది ముఖ్యం. నేర్చుకునేప్పుడే ఎక్కువ టైము వినియోగించి క్షుణ్ణంగా నేర్చుకుంటె అది చాలకాలం జ్ఞాపకంవుండే అవకాశం ఎక్కువ.


ఏదైనా విషయాన్ని తొందరగా నేర్చుకోగలిగిన వ్యక్తి ఈ విషయాన్ని ఎంత కాలం గుర్తుపెట్టుకోగలడో, నిదానంగా నేర్చుకునే వ్యక్తికూడా అంతేకాలం గుర్తుంచుకోగలడు. అంటే నేర్చుకోడానికి పట్టే కాలానికి, అది ఎంతకాలం గుర్తుంచుకోగలం అనేదానికి ఏవిధమైనసంబంధం లేదు. తెలివైనవిద్యార్థి పరీక్షలో ఎక్కువమార్కులు తెచ్చుకున్నాడంటే అది అతని జ్ఞాపక



శక్తి ఎక్కువ అవడంవల్ల కాదు. అతను తక్కువకాలంలోనే ఎక్కువ విషయాలు నేర్చుకుంటాడు. కొంచెం మందగొడి విద్యార్థి అదే విషయాలు నేర్చుకోవడానికి ఎక్కువ టైం తీసుకుంటాడు. జ్ఞాపకశక్తిలో యిద్దరికీ ఏమంత ఎక్కువ తేడా వుండదు.

ప్రతి మనిషి తన బుర్రలో అనేక విషయాలు నిల్వ చేసుకుంటాడు. దాంతోటి టక్కున ఏదో ఒక టైంలో ఒకవిషయం గుర్తుచేసుకోవాలంటే, బుర్రలో వుండే అసంఖ్యాకమైన సంగతులు ఒకదానితో ఒకటి కలిసిపోయి గజిబిజిగా తయారవుతాయి. అందువల్లే మనకి కావలసిన విషయం ఠపట్నాన బైటికి రాదు. ఇందులో రెండురకాల గజిబిజి లున్నాయి: (1) మనకి కావలసిన విషయానికి పూర్వం మెదడులో నిల్వవున్న సంగతులవల్ల, (2) మనకి కావలసినదానికి తరవాత మెదడులో ప్రవేశించేవాటివల్ల ఈ గజిబిజి ఏర్పడుతుంది. దీన్నిబట్టి ఒక సంగతి తేటతెల్లమవుతుంది. 20 ఏళ్ల వ్యక్తికి, 10 ఏళ్ల కుర్రాడికన్నా మతిమరుపు ఎక్కువ వుంటుంది. ఎందుకంటే పెద్దవాళ్ల బుర్రల్లో, చిన్నపిల్లల బుర్రల్లో కన్నా అనేకరెట్లుఎక్కువసంగతులునిల్వవుంటాయి. అలాగే ముసలాళ్లకి పాత సంగతులు గుర్తున్నంతగా యిటీవల జరిగిన సంఘటనలు గుర్తుండవు. వారి నేర్పుశక్తి, ఏకాగ్రత క్షీణించడంకూడా దీనికి కొంత వరకు కారణం అవచ్చు.


అయితే బుర్రలో నిల్వ ఉన్న సంగతులు ఎక్కువ అయినకొద్దీ, మతిమరుపు ఎక్కువ అయేపక్షంలో మనం అనేకవేల సంగతులు ఎలా 'గుర్తు' పెట్టుకో గలుగుతున్నాము? దీనికి రెండు కారణా లున్నాయి: ఒక టేమిటంటే నేర్పుశక్తి, జ్ఞాపకశక్తి కొంతవరకు ప్రాక్టీస్‌వల్ల అభివృద్ధి చెందుతాయి. రెండో దేమిటంటే మనం ఒక సంగతిని ఏ విధంగా నేర్చుకుంటామో దానిమీదకూడ జ్ఞాపకశక్తి కొంతవరకు ఆధారపడి వుంటుంది. ఒకేసారి ఎక్కువ సంగతులు బుర్రలోకి ఎక్కించుకుందుకు ప్రయత్నిస్తే అవి ఎక్కువకాలం జ్ఞాపకం వుండవు. అందుకే పరీక్షలముందు ఒక్క




సారిగా బట్టీపట్టి సంపాయించిన విజ్ఞానం ఆట్టే రోజులు బుర్రలో వుండదు. నిదానంగా ఒక్కొక్క విషయమే బాగా అర్థం చేసుకుని నేర్చుకున్న సంగతులయితే చాల కాలం గుర్తుంటాయి.

మతిమరుపునిగురించి యింకా మనకి తెలియని విషయాలు చాలావున్నాయి. కొన్ని విషాదానుభవాలు మనం ఎంత ప్రయత్నించినా మరచిపోలేము! ఎందుకని? ఒక్కోసారి ఒక పేరు మనం ఎంత ప్రయత్నించినా గుర్తురాదు. కాని వున్నట్లుండి దాని అవసరం తీరిపోయాక చటుక్కున దానంతట అదే గుర్తొస్తుంది! ఎందుకని? మున్ముందు శాస్త్రజ్ఞులు జరిపే ప్రయోగాలవల్ల యిలాంటి ప్రశ్నలకి సమాధానాలు దొరుకుతాయని ఆశించవచ్చు. యింతవరకు తెలిసిన విషయాలు జాగ్రత్తగా పాటిస్తే మన జ్ఞాపకశక్తిని వృద్ధిపరచుకొని, మతిమరుపు తగ్గించుకోడానికి వీలవుతుంది.

—డా॥ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి



పెద్ద కథ ప్రారంభం



వేళ్ళపల్లి వెంకటలక్ష్మీనారాయణశర్మ

సెకండవరయ్యిందంటూ గంటకొట్టాడు ప్రిన్సిపాల్ ఆఫీసు ప్యూను...అమ్మాయిల వెనకబెంచీ ఆక్రమించేందుగ్గాను లెక్చెరరు వెళ్ళకముందే క్లాసురూం గోడలు సునాయాసంగా లంఘించి తర్వాత క్లాసుకు పరుగెత్తే రోమియోలతోనూ, మిగతా స్టూడెంట్సుతోనూ కాలేజీ ఆవరణ నిండుగా వుంది.

'రూం నెంబరు 7' లో కూర్చుని లెక్చెరర్ సగంలో వదలి వెళ్ళిన లెక్క పూర్తి చేసుకుంటున్నాడు మూర్తి. మిగతా స్టూడెంట్సందరూ ఎప్పుడో వెళ్ళిపోయారు...మూర్తి కూడా పుస్తకం మూసి అంతలావుపాటి 'బాట్లీబాయ్' ఎకౌంట్సు పుస్తకాన్ని పుచ్చుకుని గది తలుపువరకూ వచ్చి 'టక్కు'న ఆగిపోయాడు ...రెండు గజాల దూరంలో ఒక అమ్మాయిల సమూహం యీ రూములోకే వచ్చే వాలులో వుంది. 'ఫక్కు'మని నవ్వారు అమ్మాయిలు. బహుశ తన బెదురును చూసేనేమో ననుకున్నాడు మూర్తి. కాళ్ళు తడబడ్డాయి. 'అనుమానం ఎందుకు? నీ బెదురుచూసే మేం నవ్వేది' అన్నట్టు, యింకేం పన్లేనట్టు నవ్వారు అమ్మాయిలు. 'యిదే మాపనన్న'ట్టు మళ్ళీ నవ్వారు. 'వన్సుమోర్' అనకుండానే అమ్మాయిలు మళ్ళీమళ్ళీ నవ్వుతారని మూర్తికి తెలియదు. నలుగు రమ్మాయిలుంటె నలభై సార్లు నవ్వుతారని కూడా తెలియదు మూర్తికి. యిలా ఓ మగాణ్ని—చాలా'కావ్'గా

వుండే ఓ 'బి.కాం' అబ్బాయిని—పట్టుకుని కాకపోయినా ముందుగా పెట్టుకుని ఓ అరడజను బియస్సీ అమ్మాయిలు నవ్వేస్తుంటే మూర్తికి కోపం వచ్చింది. కోపం యింకా కొంచెం ఎక్కువయ్యింది' అనుకున్నాడు మూర్తి. దానికి తార్కాణంగా కాళ్ళు మరింత తడబడ్డాయి. 'యిహ లాభం లేద'నుకున్నాడు మూర్తి. అలా అని యింతవరకూ లాభం వుందనుకున్నాడని కాదు. ఎందుకో మరి లాభంలేదనుకున్నాడు. కనీసం తనకోసం కాకపోయినా మగాళ్ల పరువుకోసం అయినా ధైర్యంగా నిలబడాలనుకున్నాడు క్రిందికి చూస్తూ ... హఠాత్తుగా దృష్టి 'బాట్లీబాయ్' పుస్తకం మీద పడింది. 'యింత పెద్దవాణ్ణి నేను నీ ప్రక్కనుండగా నీకెందుకు భయం' అన్నాడు బాట్లీబాయ్. 'అచ్ఛా, భాయ్' అన్నాడు మూర్తి. బాట్లీబాయ్ పుస్తకాన్ని యింకా గట్టిగా పట్టుకుని తలెత్తి సూటిగా ఆ అమ్మాయిలవైపు చూశాడు. యిదంతా కొన్ని క్షణాల్లో జరిగింది. అలా అందరూ నవ్వుతూ, మూర్తిని ఏడిపిస్తున్నామనుకొని మళ్లీ మళ్లీ నవ్వుతూవుంటే అందులో ఒకమ్మాయి మూర్తివంకే నిశ్చలంగా చూస్తూ వుంది. యింతవరకూ అలాంటి చూపు ప్రేయసి చూసేచూపు అని కథల్లో చదివాడు. సినిమాల్లో అట్లా చూసుకుంటుంటే చూశాడు. కానీ నిజ జీవితంలో కూడా యిట్లా జరుగుతుందనీ, నిజంగా ఆ చూపు తనమీదకే ఓఅమ్మాయి విసుర్తుందని మూర్తి ఎప్పుడూ అనుకోలేదు... మూర్తి వాళ్లని తప్పుకుని ప్రక్కగా వెళ్లిపోయాడు.

క్లాసులో మూర్తి ఆలోచిస్తూ కూర్చున్నాడు. మనస్సు ఎక్కడో వుంది. లెక్చరర్ అడిగాడు కూడా, 'మిస్టర్ మూర్తీ! అప్పర్ ఛాంబర్ టు లెట్?' అంటూ. 'అండర్ కన్సిడరేషన్' అన్నాడు లోపలి మూర్తి. యింతలో యింటర్వల్‌లో ఏదో మీటింగు వుందని, తప్పక రావాలని నోటీసు వచ్చింది.

...యింటర్వల్లో మూర్తి కూడా 'కళాసదనం'కు చేరాడు. 'ఫస్ట్ అయిటమ్ ఆఫ్ ది ప్రోగ్రాం—ప్రేయర్' అంటూ చదివాడు సెక్రటరీ. అందరూ లేచి నిలబడ్డారు. ఒకమ్మాయి మైకు ముందుకు వచ్చి నిలబడింది...'అరె, ఆ అమ్మాయే!' అనుకున్నాడు మూర్తి. అమ్మాయి కూడా మూర్తి వైపు చూసింది. మూర్తి అసలే పొడుగు. అందులో 'ప్రేయర్' సమయం అని మరీ పొడుగ్గా నిలబడ్డాడు. 'ఆ అమ్మాయి' స్టేజిమీదుండే సరికి యింకొంచెం హైట్ వచ్చింది. అందుకే అమ్మాయికి తొందరగా కనిపించాడు ... 'స్టేజి మీద నుంచి కూడా ధైర్యంగా నా వంకే చూస్తోందే?!' అని మూర్తి ఆశ్చర్యపోయాడు

'ఒరేయ్! యిది ప్రేయరు సమయం. వెధవ్వేషాలెయ్యకు. కళ్లు మూసుకుని నిలబడు. ఆ ముందు బెంచీలో లెక్చరర్‌గార్ని చూడు ... ఎలా కళ్లు మూసుకుని నిలబడ్డారో...అలా నిలబడు' అన్నాడు లోపలి మూర్తి.

'ఆయనా?...ఆయన క్లాసులోనూ అంతే. కళ్లు మూసుకుని పాఠం చెపుతాడు ... ఆయన్లా వుండే వాణ్ణే... కానీ అపైన... స్టేజిమీద చూడు ఎవరున్నారో?...పైగా నావంకే చూస్తోంది' అన్నాడు మూర్తి.

'నీవంకే చూస్తోందా. నా తండ్రీ !... పిచ్చిగాని ఎక్కేను...తర్వాతేడిస్తే నాకేం తెలియదు, తెలుసా' అన్నాడు లోపలివాడు.

'నువ్వు బాగా వున్నంతకాలం నాకేం ఫర్వాలేదు కానీ కాస్సేపు నువ్వు నోరు మూసుకో...ఆ అమ్మాయి ఆఖరి చరణంలోకి వచ్చింది. కాస్సేపు సరిగా చూడనీ' అంటూ కసురుకున్నాడు మూర్తి. లోపలివాడు చిన్న బుచ్చుకున్నాడు. మూర్తి విజృంభించాడు. ఆ అమ్మాయిని అలానే చూడసాగాడు. సన్నగా, తెల్లగా అచ్చు 'బాపు' బొమ్మలావుంది. ('బాపు' బొమ్మ తెల్లగావుందో, నల్లగా వుందో కూడా తెల్సిందా యీ కథరాసే ఆయనకి' అని కోప్పడకండి. అంతబాగా వున్నమ్మాయి నల్లగా వుంటుందిటండీ, మీ పిచ్చిగాని ! ఒహవేళ నలుపైనా అది నలుపా ?... ఎన్నటికీ కాదు) లేతగులాబీ రంగుచీర, ఆదే రంగు జాకెట్టు...మెళ్లో నాజూగ్గా చిన్నగొలుసు.

'మోస్ట్ బ్యూటిఫుల్' అనుకున్నాడు మూర్తి...పాట ఆగిపోయింది. 'అమ్మాయి' స్టేజిదిగి వెళ్లిపోయింది. మూర్తి యీ లోకంలోకి వచ్చాడు...

మీటింగవ్వగానే మూర్తి ఫస్టవరు క్లాసుకు వెళ్లిపోయాడు. సాయంత్రం అయిదు గంటలవాకా తీరికలేదు. అయిదింటికి కాలేజీ గేటుదగ్గరకు వచ్చాడు. ప్రక్కనేవున్న కిళ్లీకొట్టు దగ్గర నిలబడి 'అమ్మాయి'కోసం చూడటంమొదలెట్టాడు. ఎంతోమంది అమ్మాయిలు వెళ్లారు. కానీ యీ 'అమ్మాయి' మాత్రం రాలేదు. మూర్తి లోపలికి వెళ్లాడు. లేడీస్ వెయిటింగు రూంకు తాళం వేస్తున్న ప్యూను కనిపించాడు యింటిముఖం పట్టాడు మూర్తి...

గదికి వస్తూనే చేతిలో పుస్తకాలు టేబిలు మీదికి విసిరాడు మూర్తి. టేబిలు ప్రక్కనే వున్న మంచంమీద పడుకుని, ఎదురుగావున్న కోటు, టై ల వంక చూస్తున్నాడు నరసింహం. నరసింహం మూర్తి స్నేహితుడు. నిరుడు బి. ఎ. పేసయ్యాడు. ప్రస్తుతం నిరుద్యోగి. ఉద్యోగాలకి అప్లయ్ చెయ్యటం, యింటర్వ్యూలకెళ్లటం ప్రస్తుత వుద్యోగం. బెజవాడకి దగ్గర్లో వున్న ఏ పల్లెటూరు స్వగ్రామం అవటం వల్ల, అక్కడినుంచి వుద్యోగప్రయత్నాలు చెయ్యటం కష్టం అని బెజవాడని కేంద్రంగా పెట్టుకుని ఉద్యోగాన్వేషణ సాగించాలనే ముఖ్యోద్దేశంతో బెజవాడ వచ్చాడు. వచ్చి మూర్తి రూంలో చేరాడు.

'ఒరేయ్ సింహం! నువ్వొట్టి వెధవవిరా. ఎప్పుడూ మధ్యాహ్నం తోచక అటు కాలేజీ వేపుకి వచ్చేవాడివి యివ్వాళే ఎదో యింటర్వ్యూ తగలడిందని మానెయ్యటంతో నావనేవయ్యిందో తెల్సా' అన్నాడు కోపంగా మూర్తి.

'ఏం చావమంటావు ? అయినా యింటర్వ్యూ అంటే ఏమిటనుకున్నావ్... నిరుద్యోగుల పాలిటి ఆశాజ్యోతి;ఒక్కోప్పుడు కల్పతరువు కూడా. 'అయ్యా...యింటర్వ్యూ వచ్చింది. ఉద్యోగం రాబోతుంది. ఓ ఏభై అప్పివ్వండి' అంటే అప్పు పుడుతుందా లేదా? అలాంటి యింటర్వ్యూని అంత యిదిగా తీసిపారెయ్యకు ... అసలీ రోజుల్లో యింటర్వ్యూలు రావటమే గొప్ప. కొంతకాలం క్రిందట ఉద్యోగం రావటం కూడా పెద్దగొప్ప విషయం కాదు. 'అ... చదివాడు. ఉద్యోగం వచ్చింది' అని అదేదో సామాన్య విషయంగా కొట్టేసేవాళ్లు. కొన్నాళ్ళక్రితం వరకూ ఉద్యోగం దొర

కటం కష్టంగా వుండి దొరికితే చాలా గొప్ప విషయంగా చెప్పుకునే వాళ్లు యిప్పుడు యింటర్వ్యూ రావటమే గొప్ప... చివరికా యింటర్వ్యూ తగలడుగాక ... అయినా యిది గొప్పవిషయమే...ఆ విషయం వ్రాలోజుల క్రిందట మా నాన్నకి రాస్తే సంతోషించి విన్నో ఏభై పంపాడా లేదా... కాబట్టి యింటర్వ్యూనట్లా తీసిపారె య్యకు...యింతకూ నేను రాకపోవటం వల్ల నీకు వచ్చిన నష్టం ఏమిటి?... లేడీస్ వెయిటింగురూం దగ్గర్నించి వక్కడివే వెళ్లాల్సొచ్చిందా? నువ్వు లైబ్రరీలో వుండగా అమ్మాయిలెవరన్నా తలుపు దగ్గర గంటల తరబడి బాతాఖానీ కొడ్తూ నిలబడితే నీకు వాళ్లని తప్పుకోమనే ధైర్యం లేక లైబ్రరీలోనే క్రమగ్గపోయావా? లేదా అమ్మాయిలందరూ పక్కుమ్మడిగా...' అంటూ నరశింహం చెప్పుకు పోతున్నాడు.

'ఛ...వెధవా...ఆపు నీ వాగుడు. అర్ధం లేకుండా నాయకుళ్లా ఏమిటా వుపన్యాసం... అలాంటివి జరిగితే నీ బోడి సహాయం

ఆ అమ్మాయి

ఎందుకూ?' కసురుకున్నాడు మూర్తి.

'నాయనా... పూర్వం ఒకా పరిస్థితు ల్లోనే నేను నిన్ను రక్షించిన సంగతి నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేదు. అందుకే చెప్పుతున్నాను.' అన్నాడు నర శింహం.

'ఒరేయ్ సింహం! వాగుడు కట్టిపెట్టి నాబాధ కాస్త ఆలోచించరా...నీకు జమున సినిమాకి డబ్బులిస్తాను' ఏడ్చాడు మూర్తి.

'సరే, చెప్పు...ఆగు ముందుగా నే చెప్పే షరతుకు వప్పుకొని మరీ చెప్పు. చక్కగా 'నరసింహం' అని మావాళ్లు పేరు పెడితే 'సింహం' అంటూ నీ కటింగ్ పేర్లేమిటి? ఏ 'నర్సూ' అనో ముద్దుగా పిల్చి చావ రాదూ? అలా పిలుస్తానంటేగానీ నువ్వు చెప్పేది వినను' నిష్కర్షగా చెప్పాడు నరశింహం.

'సరే, యిహనించలాగే పిలుస్తాను... ఏం జరిగిందంటె...' అంటూ మొద లెట్టాడు మూర్తి.

'ఆగాగు. చేసిన మంచిపనుల గురించి కంచుకంఠంతో మరీమరీ మళ్లీమళ్లీ చెప్పి, తప్పులూ, తప్పుడుపన్లూ దాచేసే నాయ కుడి మాదిరి పరుగెత్తకు. యింకో షరతు కూడా వుంది, విను...యింతకాలం నన్ను 'సింహం' అని పిల్చినందుకు ఎపాలజీ చెప్పుకు తీరాలి.' అన్నాడు నరసింహం,

'ఒరేయ్! చెట్టెక్కితే వూరుకున్నా. చిట్టచివరి కొమ్మవరకూ వెళ్లితే నీకే నష్టం తెల్సిందా?' అన్నాడు మూర్తి.

'ఒరేయ్! అవసరంలేదు. నాకేం ఫర్వా లేదు. ఏ కొమ్మెక్కినా పడను. త్వరగా చెప్పకోలేకపోతే ఆకాశంలోకెగుర్తాను' అన్నాడు నరసింహం.

'నాయనా హిరణ్యాక్షా! అయితే విను. నిన్ను 'సింహం' అని ఎందుకు పిలిచే వాణ్ణంటే...నాక్కాస్త ధైర్యం తక్కువ; అదీగాక నాపేరుకూడా ధైర్యాన్నిచ్చేది కాక పోవటంవల్ల స్నేహితుడి పేరుతోనన్నా ధైర్యం వస్తుందని అలా పిలిచాను. వెధవాయ్! దీనికి ఎపాలజీట...' ఏడ్చినంత పనిచేశాడు మూర్తి. నరసింహం జాలి పడ్డాడు. 'సరే...చెట్టుమించి దిగాను. చెప్పు' అన్నాడు.

'ఒరేయ్! యివ్వాళ ప్రొద్దున ఎకౌంట్సు క్లాసులోంచి వస్తుంటే ఒకమ్మాయి కన బడింది...అబ్బ! ఏం బ్యూటీ అని. ఎలిజబెత్ టేలర్‌మాదిరుంది...'

'స్టాప్... వాటీజ్ యువర్ నేమ్? నీ యస్సెల్సీ రిజిష్టరెత్తుకురా. దాంట్లో నీ అయిడింటిఫికేషను గుర్తుల్చూడాలి. త్వరగా చెప్పు. లేచి రిజిష్టరు తీసుకురా' అంటూ హఠాత్తుగా అడ్డుకున్నాడు నరసింహం మధ్యలో.

'ఏమిట్రా యిదంతా సొంతం వినకుం డాను...'

'కాదు. ముందుది చెప్పు. నువ్వు మా మూర్తివేనా అని అనుమానం. కాబట్టి నువ్వు వాటికి సమాధానం చెబితేగానీ సొంతం వినను'

మూర్తి పేర్చి చెప్పాడు. రిజిస్టరు తీసు కొచ్చాడు. 'ఏ పేజీలో వుంటాయ్ ఒకా అయిడెంటిఫికేషన్ గుర్తులు' అన్నాడు.

'నీకివన్నీ ఏం తెలుస్తాయ్. యింతవరకూ యస్సెల్సీ రిజిష్టర్లో మార్కులపేజీ తప్ప



మా అబ్బాయింటిపక్కనను చూర్యక్క వున్న పేజీ సంగతి తెలియదు. యిటు పారెయ్ నే చూస్తాను. ఉద్యోగాల కద్దయ్ చెయ్యటం మొదలెడితే గానీ నీకీ సంగతులు తెలియవ్. మొదటిపేజీ తియ్యి' అని గుర్తులన్నీ చూసి

'సరే, నా మూర్తివే...ఒరేయ్ మూర్తి! ఒక్కరోజులో ఎంత మారిపొయ్యావు? ఆడపిల్ల గురించి మాట్లాడేస్తున్నావ్?! నాకు చాల్లా ఆశ్చర్యంగా వుంది. రికమండేషను లేకుండా ఓ వుద్యోగం వచ్చినా నాకాశ్చర్యం లేదు. కానీ...' అంటూ చెప్పుకు పోతున్నాడు నరసింహం.

'ఒరేయ్...సాంతం విను...ఆ అమ్మాయి యివ్వాళ కాలేజిలో నావంక రెండుసార్లు చూసింది. మన్నివాళ మధ్యాహ్నం అటు నేపు కొస్తే ఆ అమ్మాయి యింటి కెళ్లే టప్పుడు ఆ అమ్మాయికి కొంచెం దూరంలో నడుస్తూ యిల్లెక్కడో తెల్సుకునే వాళ్లం. ప్రోగ్రాం అంతా నాశనం అయ్యింది' హీనస్వరంలో అన్నారు మూర్తి.

'నా యునా మూర్తి! విచారించకు. యివ్వాళపోతే రేపుంది. రేపు ఆ అమ్మాయి రిక్షా వెనకాల పరుగెత్తి, ఆ అమ్మా

ఆ అమ్మాయి

ఎక్కిన బస్సులో వెళ్లాడో ఎట్లాగో నీకా అడ్రసు తెస్తాను. అధైర్యపడకు ... ముందలా సత్యనారాయణపురం స్టేషను వేపుకు పద. హోటల్లో కూర్చుంటె బోల్డు అయిడియాలొస్తయ్' బిల్లు మూర్తి నెత్తిన కొట్టొచ్చుగదా అని సంతోషిస్తూ అన్నాడు నరసింహం.

'ఒరేయ్! మన్నివ్వ మాపూనే వున్నావుగా? రెండ్రోజుల్నుంచి పోస్టుమేన్ కోసం చూట్టం, వాడు మనిమార్డరు రాలేదనటం. ఏ మొహంతో హోటలుకు తీసుకు పొమ్మంటావ్!? సిగ్గులేదూ?' చివాట్లేశాడు మూర్తి.

'ఏవిటది? అదేవిటో తెలియద' న్నాడు నరసింహం...కానీ మళ్లీ కొస్సె పటికీ—

'పోసీ కనీసం సినిమాకెళ్దాం...టైమింకో అరగంటుంది. బయల్దేరు. యివ్వాళ కనీసం సినిమాకైనా వెళ్లాల్సిందే. లేకపోతే రేపు నీకా సహాయం చెయ్యను' అన్నాడు నరసింహం.

'సర్వా! నీకు నేను 'సర్వ'లా కన్పిస్తున్నానురటా?...అయినా ఒరేయ్, నీకన్నా ఆ అప్పారావే నయంరా. వాడికిస్తే నమ్మకం దని ఆశన్నా వుంటుంది. మరి ఫ్రీ సర్వీసు గాడి వయ్యావు...కానీ నాదగ్గిర కానీ కూడా లేదు. తన్నుకు చావు' అన్నాడు నరసింహం నవ్వాడు.

'ఒరేయ్ ... కానీ యిప్పుడెవర్దగ్గిరా వుండదు. అదుగో బొజ్జ పెంచి ఆ కొట్లో కూర్చున్నాడే...అతగాడి ఇనప్పెట్టె వెతికినా కానీ కన్పించదు. అందుకని నీదగ్గిరెక్కత్తే పోవటంలో ఆశ్చర్యంలేదు...అయినా డబ్బులేనని అంత ఖచ్చితంగా చెపుతున్నావ్; నాతోపని అయిపోయిందనుకున్నావా? వాడెవడో ఏడుదాటి తెప్ప తగలేశాట్ట. మన్నావనిముందే చేస్తున్నావ్, జాగ్రత్త. రేపు నీ ప్రేమ ధ్యానంలో నా అండదండలుండాలి. తెల్సా?' బెదిరించాడు నరసింహం. మూర్తికి అతగాడ్చెప్పిన దాంట్లో నిజం వుందనిపించింది. అంతా నిజమే ననుకునేసరికి భయం వేసింది.


'సరే...పద' అన్నాడు మూర్తి. యిద్దరూ సైకిలు తీసుకు బయల్దేరారు ...దూరంగావున్న కొత్తడాబా ముందు కారు కనిపించింది.

'ఒరేయ్, నారదా! ఆ కొత్తగా కట్టిన డాబాలోకి ఎవరో వచ్చినట్టున్నారు' అనడిగాడు మూర్తి.

'ఎస్...యివ్వాళే ఎవరో గృహ ప్రవేశం చేశారు. మధ్యాహ్నం రెండింటికి కాఫీ కెడుతూవుండగా ఆ విషయం తెల్సింది' అంటూ వివరాలు చెప్పాడు నరసింహం.

'సరేగానీ సింహం!...యివ్వాళ జమున సినిమాకి నిన్ను తీసుకు వెడుతున్నందుకు గాను, రేపట్నుంచి పది రోజులవరకూ నే చెప్పే పనులన్నీ చేస్తూ, నే రమ్మనప్పుడల్లా ఎదుర్చెప్పకుండా రావాలి...' చెప్పుకు పోతున్నాడు మూర్తి. ప్రక్క గోడమీద పోస్టర్పు చూస్తూ జమున పిక్చరు తల్చుకుంటూ 'ఊఁ' కొడూ నడుస్తున్నాడు నరసింహం.

'సరిగ్గా విను...ఆ అమ్మాయి కనిపించినప్పుడల్లా గట్టిగా నీ లౌడ్స్పీకరు గొంతుతో నాగురించి మంచిగా చెప్పెయ్యాలి. నాకు ఎన్నిటిలో ఫస్టుమార్కులొచ్చిందీ, వచ్చే ఏడు నేను నేను ఆంధ్రాయూనివరి



టీలో ఎం. కాం. చదివే సంగతి, అదయ్యాక లెక్చరర్‌గా చెయ్యదల్చుకున్న సంగతి, యింకా... నేనుండబట్టే నువ్వు ఉద్యోగం లేకపోయినా బ్రతికి గల్గుతున్నావనీ...' మధ్యలో హఠాత్తుగా ఆపేశాడు మూర్తి... యిద్దరూ ఆ కొత్త డాబా ముందున్నారు. మూర్తి చూపు కొత్త యింటి వరండాలోకి పడింది. పాప ఎత్తుకుని లోపలికి వెళ్లే అమ్మాయి, మూర్తిని చూసి వెనక్కి తిరిగి వరండా చివరికొచ్చి నిలబడింది. మూర్తి 'అరె' అనుకున్నాడు. మళ్లీ చూశాడు. నడుస్తూనే మళ్లీ మళ్లీ చూశాడు. ఇల్లు దాటిపోయింది. ఆగి పోయాడు మూర్తి.

'నడవ్వేరా' విసుగ్గా అన్నాడు నరసింహం.

'ఆగరా ... అలా వెనక్కెడుదాం పద' అన్నాడు మూర్తి.

'నీ బొంద... యిప్పటికే టయిమయి పోయింది. అరున్నర అవుతోంది' తొందర పెట్టాడు నరసింహం.

'బాబ్బాబు అలా వెనక్కెడుదాం' అంటూ బ్రతిమాలాడు మూర్తి.

'యిలాంటి వేషాలు వేస్తే నీకు నా సహాయం ఏ మాత్రం దొరకదు. జాగ్రత్త ...సైకిలెక్కు పోదాం' అంటూ భీష్మించాడు నరసింహం.

'ఒరేయ్, సింహం! నీమేలుకే చెప్తున్నా. వెనక్కెడుదాం. యిందాక అక్కడొక రూపాయి బిళ్ల కనిపించింది. ఎందుకులే తీసుకోవటం మనది కానిదను కున్నా. తీరా యిపుడు చూస్తేనా దగ్గర రెండు రూపాయిలే వున్నాయ్. అది కూడా తీసుకుంటె ఎందుకయినా వుంటుంది. అందుకే వెనక్కెడదాం' అన్నాడు మూర్తి.

'మరా సంగతి ముందే చెప్పొద్దూ?' పద యీపాటికి ఎవరన్నా తీసుకునుంటారేమో కూడాను' అంటూ వెనక్కి తిరిగి నడక వేగం హెచ్చించాడు నరసింహం.

'నెమ్మదిగా నడు... జాగ్రత్తగా క్రింద చూడు' కాషన్ యిచ్చాడు మూర్తి ... నరసింహం కళ్లన్నీ నేలమీదున్నాయ్. మూర్తి కళ్లు వరండాలో వున్న 'అమ్మాయి' మీదున్నాయ్...

'ఆ అమ్మాయే' 'ననుకున్నాడు మూర్తి ...అమ్మాయి గులాబీలా నవ్వింది ... మూర్తి రాకెట్టులో ఎక్కి గోళాలన్నీ తిరిగాడు...హఠాత్తుగా వీపుమీద దెబ్బ పడ

ఆ అమ్మాయి

టంతో క్రిందకొచ్చి పడ్డాడు.

'రూపాయేదిరా' అంటున్నాడు నరసింహం.

'రూపాయీ లేదూ...నీ తలకాయా లేదు. అటు చూడరా ... రూపాయిలు ... కోటి రూపాయలకన్నా విలువైంది.'

'ఓహో, యిదన్నమాట నీ బాక్‌వర్డ్ మార్చికి కారణం... యీవిడేనా నీ హీరోయిన్' సందర్భం అర్థం చేసుకున్న నరసింహం ప్రశ్నించాడు.

'అవునురా ... నా ప్రణయారాధ్య దేవత... నా హృదయ...'

'ష్టాప్...పబ్లిక్కు రోడ్డిది' అని అలా నిలబడుండటం బాగాలేదని మూర్తిని వెనక్కి లాక్కెళ్ళాడు నరసింహం.

'ఒరేయ్, రోమియో, సినిమాకెళ్ళాక వచ్చి ఆలోచిద్దాం పద' అన్నాడు నరసింహం.

'ఛ...వెధవ!...సినిమా? సినిమా?... ఏం వచ్చింది సినిమాకి రేపుండదా' కోపంగా అన్నాడు మూర్తి.

'నాయనా ... వ్యవహారం చాలా దూరం వచ్చిందే...జమున పిక్చరనంగానే రెక్కలు కట్టుకు వాలే వాడివి... యిప్పుడీ దేఃవిటి? రెక్కపట్టుకుని లాక్కెళ్ళాల్సొస్తోంది... సినిమా రేపున్నా మనం వుంటామో లేదో తెలియదు. అయినా తెలుగు సినిమామీద అంతనమ్మకంతగదు.అందుకని అనుకున్నపని వెంటనే చెయ్యాల్సిందే...సినిమాకు వెళ్ళాల్సిందే' నిఖ్ఖచ్చిగా చెప్పాడు నరసింహం.

'సరే, పద...అటు తిరిగెడ్దాం' అన్నాడు మూర్తి వెనక్కి తిరుగుతూ.

'ఎటు?...మళ్ళీ వెనక్కా?'

'అవును... యీ దారిన నేడితే సైకిలు లైసెన్సు లేదని పట్టుకుంటారు. మనం లైసెన్సు కట్టలేదు. యిది కాస్త లాక్కుంటాడు తెల్సిందా?...నడు వెనక్కి.'

'అరి వెధవా! ఎలాగైతేనేం మళ్ళీ తిరిగావ్ వెనక్కి' అన్నాడు వెనక్కు తిరుగుతూ నరసింహం...మళ్ళీ యింటి ముందుకొచ్చారు. ప్రక్కగదిలోంచి చూసిందేమో మళ్ళీ వచ్చింది వరండాలోకి ఆ 'అమ్మాయి'. మూర్తి భారంగా నడుస్తున్నాడు. లాక్కుపోతున్నాడు నరసింహం మూర్తిని. యిల్లు దాటిపోయింది. మూర్తి తెలివిలోకి వచ్చాడు.

'ఎక్కు సైకిలు' అన్నాడు నరసింహం.

'నీకు హృదయం లేదురా సింహం... అందుకే నిన్ను సింహం అని పిలిచాను' అన్నాడు కోపంగా మూర్తి.

'అయితే యింతాక అపాలజీతో చెప్పింది అబద్ధమా?'

'ఆఁ...అంతా అబద్ధం ... లేకపోతే ఆ అమ్మాయి అంత రెస్పాన్సిస్తుంటే ఓ అరవైసార్లు అటూ యిటూ తిరక్క, సినిమా అంటూ ఏడుస్తావేం?' చాలా బాధగా అన్నాడు మూర్తి.

'నాయనా దేవానందం ... అక్షణంగా తిరుగు. లక్షసార్లు తిరుగు. నా డబ్బులు నాకు పారెయ్యి, నే సినిమాకి పోతాను.'

'ఒక్కణ్ణే తిరగటం కొంచెం కష్టంరా ... తోడుగా వుంటె ఏదో మాట్లాడుతూ వుంటె కొంచెం భయం పోతుంది'

'అలాగైతే రేపట్నుంచీ తిరుగుదాం. యివ్వాళ మాత్రం సినిమాకి తప్పదు' అల్టిమేటం యిచ్చాడు నరసింహం.

'అయితే పద' అంటూ మళ్ళీ వెనక్కి తిరిగాడు మూర్తి.

'వెధవా... మళ్ళీ వెనక్కా ... అక్కడ సైకిళ్ళు పట్టుకుంటున్నారన్నావుగా? యిటే పోదాం'

'అది కాదురా ... మన చాకలి బట్టలెప్పుడు తెస్తాడో కనుక్కుందాం. వాడి లాండ్రీ యీ దోవలోనేగా?'

'వెధవ్వేషాలెయ్యకు ... చాకలి బట్టలు తీసుకెళ్ళింది నిన్న. అప్పుడే తెస్తాడా? నేను మళ్ళీ మళ్ళీ తిరగను' అని సైకిలుకు స్టాండు వేసి వంతెనదిమ్మకానుకుని నిలబడ్డాడు నరసింహం... మూర్తి కాస్సేపయాక మొదలెట్టాడు.

'సింహం! యివన్నీ ఎందుకు? నేనివ్వాళ సినిమాకు రాలేనురా. నువ్వెళ్ళు' అంటూ నరసింహానికి ఓ రెండు రూపాయిలిచ్చాడు. 'జాగత్త' అంటూ నరసింహం సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

(ఇంకా వుంది)

వారఫలం

13-12-1968 శుక్రవారం మొదలు
19-12-1968 గురువారం వరకు

మేషం: ఇతరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ప్రయాణాలు శ్రమనిగాద ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులకు గురికాగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

వృషభం: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నూతన వ్యవహారాలు లాభించగలవు. సాటివారితో మాట పట్టింపులు తగవు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహిత్యకళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మిథునం: సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

కర్కాటకం: వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయాణాల ద్వారా కార్యసాధన చేయగలరు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులభంగా నెరవేరుతాయి. సాటివారితో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు —ఆరోగ్యం బాగానే ఉంటుంది. సంతోషకరమైన వర్తలను వింటారు.

కన్య: వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు బాగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

తుల: వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణించగలదు. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

వృశ్చికం: వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. వారం మధ్యలో అన్నివ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. వృత్తిలో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు: వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. వారం మధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరుతాయి.

మకరం: ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. సాటివారిలో గౌరవం లభిస్తుంది.


కుంభం: కొన్ని వ్యవహారాల్లో మీరు శ్రమపడినా, ప్రయోజనం ఉండదు. వ్యాపారంలో ప్రయాసకు గురి కాగలరు. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం: భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలే బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

—మహేష్





జరిగిన కథ

సావిత్రమ్మ ఒక మధ్యతరగతి ఇల్లాలు. ఆమె భర్త రామనరసయ్య. పెద్దకొడుకు గోపీ వారాలు చేసుకుని హైస్కూల్లో చదువుకుంటూ వుంటాడు. విధిలేక చిన్నవాడు మురళిని నరసింహానికి పెంపకం ఇస్తుంది. గోపీ తెలివితేటల్ని గ్రహించి అతనికి తన ఇంటిలోనే వసతి ఏర్పాటు చేస్తాడు ప్రొఫెసరు. అతని కుమార్తె అనిత. అనిత ప్రవర్తన గోపీకి నచ్చదు. గోపీ ఆచోటు విడిచి పెట్టేస్తాడు విదేశాలకి వెళ్తాడు. విమల ఒప్పుకోని సంబంధానికి కమల ఒప్పుకున్నది. చదువుమీద ఆసక్తిగల విమల ఒక కాన్వెంటులో స్థానం సంపాదించుకోగల్గుతుంది. ప్రిన్సిపాల్ ఆమెను ప్రత్యేకశ్రద్ధతో గమనిస్తూ ఉంటుంది. ప్రిన్సిపాల్ మార్గరెట్‌ను నర్సు శిక్షణకోసం పంపిస్తుంది.

11

'పిన్నిగారూ

నేను మా ఊరు వచ్చి ఉద్యోగంలో చేరి రెండు నెలలయింది.

నేను అక్కడి నుంచి వచ్చిన తరువాత హాయిగా నిద్రపోయి ఉదయమే లేస్తున్నాను. గౌరవంగా ఉద్యోగం చేస్తున్నాను. మా అన్నయ్యలిద్దరూ నేను మళ్ళీ ఉద్యోగంలో చేరినందుకు చాలా సంతోషించారు. వదినలు మాత్రం ముభావంగా ఉన్నారు.

మా అమ్మ లేవటం లేదు. కాళ్ళు పట్టుకు పోయాయి. ఆమె మాత్రం నేను తిరిగి వచ్చి ఉద్యోగంలో చేరినందుకు సంతోషపడటం లేదు.

మీతో చెప్పుకుంటే నా బాధ తగ్గి, మనసు తేలికపడుతుందని వ్రాస్తున్నా. నేను రెండు ఉత్తరాలు వ్రాసినా ఆయన జవాబు వ్రాయలేదు. అవి ఆయనకు చేరాయో లేక మధ్య ఎవరి చేతిలోనయినా పడ్డాయో?

పిన్నిగారూ మీ చేత్తో నాకొక ఉత్తరం వ్రాయరూ? మా అమ్మ తరువాత మీరే నా సంగతి ఆలోచించేవారు.

ఇట్లు
యామిని'

హనుమాయమ్మగారు ఉత్తరం తిప్పి తిప్పి మళ్ళీ మళ్ళీ చదువుకున్నది. పాపము అనుకుంటూ నిట్టూర్చింది.

అప్పుడే క్రిందికి వచ్చి కదంబమాల కట్టటానికి చాప మీద కూర్చున్న రాధిక హనుమాయమ్మగారి చేతిలో ఉన్న ఉత్తరం చూసి 'ఎక్కడి నుంచి అత్తయ్యగారూ?' అన్నది.

హనుమాయమ్మగారు లేచివచ్చి ఆమెకు దగ్గరగా కూర్చున్న రాధిక వీపుమీద చెయ్యి వేసి 'నీవు ఇన్నిసార్లు పైకీ క్రిందికి తిరగకూడదని చెప్పానా? ఎందుకు వచ్చావు చెప్పు' అన్నది.

తల వంచుకుని 'మాలకట్టి పైకి తీసుకు వెళ్దామని వచ్చాను. నాకు ఒంట్లో బాగానే ఉన్నది. ఏ మాత్రం అలసటగా ఉన్నా తిరగను' అన్నది.

'నీ పరీక్ష ఎప్పుడు?' రాధికకు పూలు బొత్తిచేసి అందిస్తూ అడిగింది.

'మార్చి పదిహేను నుండి ప్రారంభమవుతాయి. పదిరోజులలో పూర్తవుతాయట'

'అయితే పదిహేను రోజులపాటు ఒక మనిషి నీ వెంట ఉండాలి. నేను నీ వెంట రావటానికి ఇల్లు చూసుకుని అబ్బాయిని కనిపెట్టి ఉండేవారు లేరు. పరీక్షలు దగ్గరికి వచ్చాయి మనం ఓ వారం రోజులలో ఎవరు బయలుదేరవలసిందో నిర్ణయించుకోవాలి.'

'అత్తయ్యగారూ. నేను ఒక్కదాన్నీ వెళ్ళి పరీక్ష వ్రాసి వస్తానండీ. నాకేం ఫరవాలేదు. మీ అబ్బాయిగారినే ఒక్కరినే వదిలి ఉండటం కష్టం.'

'ఏడు నెలల మనిషివి ఒంటరిగా రైలు మీద పంపుతామా? నా మనసు అంగీకరించదు. అబ్బాయి ఏమంటున్నాడు?'

'మీరు పైకి వస్తారుగా? వచ్చినప్పుడు అడగండి.' రాధిక కళ్ళన్నీ ఆమె చేతిలో ఉన్న ఉత్తరం మీద ఉన్నాయి. కుతూహలంతో 'ఏమిటది అత్తయ్యగారూ?' అడిగింది. తల్లి దగ్గర నుండి ఉత్తరమేదయినా వచ్చిందేమోనన్న భ్రమతో కనురెప్పలార్పుతూ చూసింది.

'రాధికా. యామిని ఉత్తరం వ్రాసింది. పాపం వయసున చిన్నది. అనుభవం తక్కువ. పెనిమిటి పరిస్థితులు కూడా అందరి పరిస్థితుల వంటివి కానట్టున్నాయి. తన ఆత్మగౌరవమూ తన సుఖమూ చూసుకున్నదిగాని ఆ భర్త సంగతి ఆలోచించ లేదు. అతడయినా స్వతః చెడునడత కలవాడయితే అనుకోవచ్చు ఆ యింటి పరిస్థితులు కొన్నాళ్ళకు బాగుపడేవేమో, లేక అతడేమయినా బాగుచేసేవాడేమో. అతడితో ఆలోచించకుండా చెప్పయినా చెప్పకుండా మావాళ్ళింటికి వెళ్ళిపోతున్నానని వెళ్ళింది. ఏమయినా యామిని తొందరపడ్డదనే నా అభిప్రాయము' యామిని వ్రాసిన ఉత్తరం రాధిక చేతికిచ్చింది.

రాధిక ఉత్తరం చదువుతున్నంతసేపూ హనుమాయమ్మగారు ఆమె ముఖంలోకే చూస్తూ 'మగవాడిని బాగుచేసి ముందుకు తెచ్చినా ఆడదే— చెడగొట్టి అధఃపాతాళా

వికి ఈడ్చినా ఆడదే బిడ్డలనయినా బాగు చేసినా తల్లే—చెడగొట్టినా తల్లే.'

ఉత్తరం చదివి 'అత్తయ్యగారూ. ఐతే యామిని రాదంటారా?'

'చెప్పలేము. ఇంతకూ వెళ్ళనా అని ఆమె అతడిని అడగలేదు. వెళ్తానంటే సరే నన్నాడు. ఇంతవరకూ అతడు ఆమెకు రావద్దని ఉత్తరం వ్రాయలేదు. అతడి మనసులో ఏమున్నదో ? కాలమే నిర్ణయిస్తుంది. కాని గడచిన రోజులు మళ్లీ రావు.'

రాధిక మెల్లగా లేచి చీరె దులుపుకుని మాల పళ్లెంలో పెట్టుకుని మేడమీదికి బయలుదేరింది.

ఆమె వెంటనే హనుమాయమ్మగారు లేస్తూ 'రాధికా. నీవు ఈ యింటి గృహ లక్ష్మివి. చక్రపాణి నా ప్రాణంలో ప్రాణం, వాడికంటి వెలుగువు నీవు' రాధికను తన వైపుకు తిప్పుకుని గుండెకు హత్తుకున్నది.

రాధిక రెండుమెట్లు ఎక్కిందో లేదో చక్రపాణి పైనుంచి గంటనొక్కాడు.

*   *   *

విజయవాడ స్టేషనులో స్త్రీల విశ్రాంతి గదులలో సంచీ పెట్టుకుని బైటికి వస్తూ సావిత్రమ్మ రాధికను చూసి నివ్వెరబోయింది. కళ్లు నులుపుకుని మళ్లీ చూసింది. కమలే నిస్సందేహంగా. కమలను చూసి ఎన్నాళ్లయింది?

ఎదురుగావచ్చి కమలా అంటూ కౌగిలించుకుని కన్నీళ్లు పెట్టుకుంది. తల్లిని అక్కడచూసి రాధిక దిగ్భ్రాంతురాలయింది.

తల్లీ కూతుళ్లు భుజాలమీద చేతులు వేసుకుని ఆ సమీపంలో ఉన్న బెంచీమీద కూర్చుంటూ మూడు సంవత్సరాల ముచ్చట్లు చెప్పుకున్నారు. మధ్య మధ్య కౌగలింతలు—కన్నీళ్లు.

'అమ్మా. నేను ఎంతో సుఖంగా ఆనందంగా ఉన్నాను. నిన్ను చూడాలని పరితపించిపోయాను. మురళికోసం ప్రాణం కొట్టుకు పోతోంది. ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబివ్వవు.'

'నీవు నీ యింట్లో సుఖంగానే ఉన్నావనుకో. కాని నా మనసు నీకు ద్రోహం చేసినట్లుగా—అన్యాయం చేసినట్లుగా బాధ పడుతున్నది. నేను ఆ యింటికి వచ్చి భరించలేను తల్లీ' సావిత్రమ్మ పేగులన్నీ కదిలేటట్లు ఏడ్చింది. కొంతసేపటికి తెప్పరిల్లి రాధికను బాగా పరకాయించి చూస్తూ 'ఏడునెలలు ఉంటాయి' అనుకుంది.

'మురిటిమాట ఏమనుకుంటున్నారు?'

'అక్కడ ఒకపెద్ద అమెరికన్ హాస్పిటల్ ఉన్నది. అక్కడికి పంపాలనుకుంటున్నారు.'

సావిత్రమ్మ వకీలు సాంబయ్యగారి అమ్మాయిని అత్తవారింట్లో దిగవిడిచి యింటికి వెళ్ళుతున్నది. ఆమె వెళ్ళవలసిన రైలు ఒంటిగంటకు బయలుదేరాలి. కాని గంట లేటని తెలిసింది. రాధిక వెళ్ళవలసిన రైలు మూడుగంటలకు ఉన్నది.

'కమలా—అప్పటినుంచీ చెప్పటం మరిచి పోయాను. గోపీ చదువు పూర్తిచేసుకున్నాడు గాని అక్కడే కొంతకాలము పని చేయాలనుకుంటున్నాడట. తన స్నేహితురాలు పద్మని ఫోటో బాగుందా అంటూ పంపాడు



నాకు డబ్బు పంపుతానన్నాడు. నేను డబ్బేం చేసుకుంటాను చెప్పు?' విషాదంగా నవ్వింది సావిత్రమ్మ.

'డబ్బు చేదుటమ్మా? పంపమనక పోయావా?'

'ఎందుకు? ఏం చేసుకోను? శేషగిరి రిసెర్చి చేస్తూ వాడు స్కాలర్‌షిప్పుతో బ్రతుకుతున్నాడు. శంకరం హాయిగా మిలిటరీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. మురళి శ్రీమంతుల యింట్లో ఉంటు న్నాడు. వాడక్కడి నుంచి బైటికి రాడు. విమల నర్సుపని చేసుకుంటోంది. నీవు పది మందికి పెట్టగలదానవు. ఇంకా డబ్బు ఎవరికి? ఎందుకు?'

'అమ్మా. నీవీ వయసులో అక్కడ ఉండకపోతే మాలో ఎవరి దగ్గరయినా ఉండకూడదా? విమల ఒంటరిగా ఉంటోంది. పోనీ అక్కయ్య దగ్గరయినా ఉండు.'

'ఎవరి దగ్గరయినా ఉండవచ్చు కాని నాకిష్టం లేదు. విమల సంగతంటావా? అది ఎప్పుడూ టూర్‌చేసే డాక్టరు చేతి క్రింద పనిచేస్తూ ఉంటుంది. ఆ డాక్టరికి రెండుమూడు ఊళ్లల్లో ఆసు పత్రులు ఉన్నాయి. వారానికొక ఊరువంతున తిరుగుతూ ఉంటాడు. ఆయన వెంట కారులో తిరుగుతూ ఉంటుంది. అటు వంటి చోట నేనెట్లా ఉండగలను చెప్పు? ఎక్కడయినా నేను ఒంటరిగా ఉండవలసిన దానినే కదా? మరెక్కడయితేనేం?'

రాధిక తల్లితో తను నేర్చుకున్న విద్య లను గురించి చెప్పింది. చక్రపాణి హను మాయమ్మగారు తనను ఎంత ప్రేమతో చూస్తున్నారో వివరాలతో కూడా చెప్పింది. తన పేరు మార్చిడి సంగతి చెప్పింది.

'అమ్మా. మనకు డబ్బు ఉంటే మాత్రం ఇంతకంటె మంచి సంబంధం వస్తుందా? లోపము లేని వాడు దొరుకు తాడనుకుందాం—కాని ఇంత మంచివాళ్ళు లభించటం మన అదృష్టం కాదుటమ్మా?' ధైర్యం చెప్పినట్లుగా తల్లి వీపుమీద చెయ్యి వేసి రాసింది రాధిక.

వింటున్నట్లుగా తల ఆడించింది సావిత్రమ్మ.

'అమ్మా. మా అత్తగారు పురిటి సమ యానికి ఉత్తరం వ్రాయించాలనుకుంటు న్నారమ్మా' అన్నది తల్లి ముఖంలోకి చూస్తూ.

దీర్ఘంగా నిట్టూర్చి 'చూద్దాంలే. అప్పటి మాటకదా. ఇంకా చాలా టైము ఉన్నది' తల వంచుకుని జవాబిచ్చింది సావిత్రమ్మ.

రైలుకూత వినగానే ఇద్దరూ ఉలిక్కి పడ్డారు. కబుర్లు ఆపుచేయవలసి వచ్చింది. మూడు నాలుగునెంబరు ప్లాట్‌ఫారములమీద రైళ్ళు వచ్చి నిలిచాయి.

విడలేక విడలేక కన్నీళ్లతో తల్లీ కూతుళ్లు విడిపోయారు. చేతులూపు కుంటూ రైళ్ళు ఎక్కారు.

సావిత్రమ్మ ఎక్కిన రైలు బయలుదేర గానే ఆ ప్లాట్‌ఫారంమీద జనం పలచ బడ్డది. రాధిక ఎక్కినరైలు బయలుదేర టానికి ఒక అరగంట టైం ఉన్నది. రాధిక. పూలు పండ్లుకొని బుట్టలో సర్దు కుని డబ్బు లెక్కపెట్టి యున్నది.

మిలిటరీ యూనిఫారమ్‌లో ఉన్న శంకరం చేతిలో ఫ్లాస్కు పట్టుకుని నడుస్తూ రాధికను చూసి 'కమలా కమలా' అంటూ చెయ్యిపట్టుకొని ఊపాడు.

'శంకరం అన్నయ్య! ఎక్కడినుంచీ? ఎక్కడికి వెళ్ళుతున్నావు?' ఆశ్చర్యంతో నోరు తెరిచింది రాధిక.

* * *

'ఎంతకాలానికి చూశానన్నయ్యా నిన్ను?' చేటంత ముఖంతో శంకరాన్ని ప్రశ్నించింది రాధిక 'అమ్మను చూశావా?'

'అమ్మను చూసి చాలా రోజాలయింది. ఒక స్నేహితుడి పెళ్లి బందరులో రేపు ఉదయం పదిగంటలకు. రమ్మని ఎంతో బ్రతిమిలాడాడు. పెళ్లిచూసి, అమ్మదగ్గర ఒకరోజు ఉండి తిరిగి వెళ్లిపోతాను. నీ వెక్కడికి? ఒక్కదానవూ బయలుదేరావేం?' ఆశ్చర్యంతో అడిగాడు.


'నీవుకూడా బందరుకే కదా. రైలు యెక్కు మాట్లాడుకుందాం.'

తన మూడవతరగతి టికెట్టుతో సంకో చిస్తూ రాధిక ఎక్కిన రెండవ తరగతి పెట్టెలోకి ఎక్కాడు శంకరం. ఆమె ప్రక్కన కూర్చుంటూ ఏడునెలల ఆమె గర్భాన్ని ఆ పామానుచూసి నివ్వెరపోయాడు.

అదే పనిగా తనను చూస్తున్న శంక రంతో రాధిక 'అన్నయ్యా అమ్మ ఎక్కిన రైలు ఇప్పుడే బయలుదేరింది' అంటూ శంకరం వెళ్లిన తరువాత కుటుం బంలో జరిగిన సంగతులన్నీ పూస గుచ్చి నట్లు చెప్పింది. తన వివాహము, అందరి వైముఖ్యమూ కూడా వివరించింది.

ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసుకుని నోరు తెరిచాడు శంకరం.

అయితే శంకరం అన్నయ్యకు కూడా తన పెళ్లిని గురించి ఇంతవరకూ తెలియ దన్నమాట. ఆమె ఎంత గంభీరంగా ఉన్నా



జీవితవలయాలు

ఆమె విడిచిన నిట్టూర్పు శంకరం కంటు పడనే పడ్డది.

'అన్నయ్యా. నివైనా యింటికి రావా? వచ్చి మా యింట్లో రెండురోజులు ఉంటే నాకెంతో తృప్తిగా ఉంటుంది' గునిసింది రాధిక.

'రాకేమమ్మా నేను వస్తాను. నీ సంగతంతా నాకిప్పుడేగా తెలిసింది? రేపు ఉదయం వరకూ మీ యింట్లోనే ఉంటాను.'

'అయితే విమల సంగతి ఏమయినా తెలిసిందా?'

'తెలియకేం? నీకు ఇందాక చెప్పలేదట్లుంది. ఆ ప్యూల్లో మెట్రిక్ ప్యాసయింది. తరువాత నర్సింగ్ కోర్సుకు వాళ్లే పంపించారట, ఇప్పుడెవరో డాక్టరు దగ్గర పనిచేస్తోందిట. అమ్మ దగ్గరికి ఒకసారి వచ్చి వెళ్లిందిట. ఇప్పుడు అక్క విమల కాదు—మార్గరెట్'

'ఇదేమిటి?' అన్నట్లు చూశాడు శంకరం.

'మతం పుచ్చుకున్నది. అందుకనే వాళ్ళు ఉచితంగా అన్నం బట్టలూ యిచ్చి చదువు చెప్పించారు.'

ఇంటి సంగతులన్నీ విన్న తరువాత శంకరం పేపరు మడత విప్పాడు.

స్టేషనుకు కారు వచ్చింది. డ్రైవరు సామాను దింపుకుని కారులో పెట్టుకున్నాడు. హనుమాయమ్మగారు వాకిటి మెట్లమీద నిలబడి ఎదురుచూస్తోంది.

కమల దిగి 'మా అన్నయ్య శంకరం బెజవాడ స్టేషనులో కనబడ్డాడు' అత్తగారికి పరిచయము చేసింది.

'మనిషి వెంట ఉన్నప్పటికీ నీవు ఇంటికి వచ్చేవరకూ నాకు ప్రాణంలో ప్రాణం లేదనుకో. క్షేమంగా ఇల్లుచేరావు' హనుమాయమ్మగారు వాళ్లిద్దరినీ లోపలికి తీసుకువెళ్లింది.

రాధిక గబగబా మెట్లుయెక్కి పైకి వెళ్లింది. మెట్ల గదిలో ఆఖరు మెట్టు దగ్గరగా చక్రాల కుర్చీలో కూర్చుని సిగరెట్ పొగ విడుస్తూ తనకోసం ఎదురు చూస్తున్న చక్రపాణిని చూసిన సంతోషంలో తబ్బిబ్బయిపోయింది రాధిక.

ఆమె మెట్లుయెక్కి తనదగ్గరికి రాక ముందే 'బాగా రాశావా శేఖా?' అడిగాడు చక్రపాణి.

'వ్రాశాను. బాగా వ్రాశాను. టీచరు చెప్పినవి కాక మీరు చెప్పినవి కొన్ని భాగాలు వచ్చాయి. ఉత్సాహంతో మీరు చెప్పినదంతా వ్రాశాను. అందరికంటె నేనే బాగా వ్రాశాను' అతడిని సమీపించి 'ఎన్నో సంవత్సరాలయినట్లుంది మిమ్మల్ని చూసి. ఎంతోకాలమయినట్లుంది మీతో మాట్లాడి' అంటూ అతడి తలను గుండెలకు అదుముకుంది.

ఆమె వెళ్ళిన తరువాత తన దినచర్యనంతా ఏకరువుపెట్టాడు చక్రపాణి.

'మీరు పుట్టినప్పటినుంచీ నేనే ఉన్నానా?' అన్నది అతడి చెంపలను చేతో్త రాస్తూ.

'లేదు నిజమే. కాని ఎన్నాళ్లనుంచో ఉన్నట్లుగా నా ప్రాణానికి అనిపిస్తున్నది.'

ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అయి కళ్ళనీళ్లు వచ్చాయి రాధికకు. చక్రాల కుర్చీని తనే స్వయంగా లోపలికి నెట్టుతూ పడకగదిలోకి తీసుకువెళ్లింది. చక్రపాణి మంచం మ్మీద కూర్చున్నాడు. అతడి కెదురుగా నిలబడి భుజాలమీద చేతులువేస్తూ 'మా అమ్మ విజయవాడ స్టేషనులో కనబడ్డది. మా అన్నయ్య శంకరం ఈ ఊళ్లో స్నేహితుడి పెళ్లికివస్తే మన యింటికి తీసుకువచ్చాను. రేపు ఉదయం పెళ్లి. సాయంత్రము వెళ్లిపోతాడు.'

'ఇంతసేపూ చెప్పావు కాదేం? రమ్మను పైకి' షర్టు కాలరు సవరించుకుని కుర్చీ మీద కూర్చున్నాడు చక్రపాణి.

రాధిక క్రిందికివెళ్లి శంకరానికి కాఫీ యిచ్చి పైకి తీసుకువెళ్లింది. సోఫాలో కూర్చున్న చక్రపాణికి పరిచయము చేసింది.

ఆర్మీలో పనిచేస్తున్న శంకరం చక్రపాణిని చూసి ఎటువంటి వికారమూ పొందలేదు. అతడితో ఒక గంట మాట్లాడిన తరువాత శంకరం తృప్తికరంగా నవ్వుకున్నాడు. చక్రపాణితో మాట్లాడటానికి తన చదువు—తన విజ్ఞానం—తన సభ్యత చాలలేదు. అతడు చాలా గొప్ప వ్యక్తి అనుకున్నాడు.

చక్రపాణి శంకరానికి మరొక కప్పు కాఫీ ఇప్పించి సిగరెట్టు డబ్బా ముందుకు పెట్టాడు.

ఏడుగంటలకే పళ్ళు పాలూ తీసుకున్న

హనుమాయమ్మగారు ముగ్గురికీ మేడ మీదనే భోజనాలు ఏర్పాటు చేసింది. వాళ్ళకు ఎదురుగా కూర్చుని వడ్డిస్తూ కబుర్లు చెప్పింది.

వరండాలో ముగ్గురూ వరుసగా మంచాలు వేయించుకుని పడుకున్నారు. రాత్రి ఒంటిగంట వరకూ శంకరం ఆర్మీలో సైనికుల ధైర్యోత్సాహాలను గురించి చెప్పాడు. కొందరు—పిరికి సైనికులు తుపాకులు పట్టుకుని ముందుకు నడవమంటే లోపల ఎట్లా గజగజ వణికేదీ వర్ణించి వర్ణించి చెప్పి వాళ్ళను నవ్వించాడు.

ఉదయము కాఫీ టిఫిన్ తీసుకుని తొమ్మిది గంటలకు శంకరం పెళ్ళికి వెళ్ళాడు. మళ్ళీ రమ్మనీ అతడిని తమ యింటి నుంచే స్టేషనుకు వెళ్ళమనీ చక్రపాణి మరి మరీ చెప్పాడు.

చక్రపాణి ఆహ్వానించే తీరూ అతడి ఆప్యాయతా శంకరాన్ని తబ్బిబ్బు చేసివేశాయి.

శంకరం రాకవల్ల హనుమాయమ్మగారికీ చక్రపాణికీ ఎంతో ఆనందం కలిగింది. రాధిక సుఖంగా ఉంటున్నట్టు వాళ్ళకు తెలిసిందికదా అన్న తృప్తి కలిగింది.

శంకరం పెళ్ళికి వెళ్ళి వచ్చాడు. సాయంకాలను నాలుగుగంటల వరకూ రాధికా చక్రపాణులతో కబుర్లు చెప్పి స్టేషనుకు వెళ్ళాడు.

రాత్రి పదకొండుగంటలకు వచ్చిన శంకరాన్ని చూసి సావిత్రమ్మ విస్తుపోయింది.

'ఎక్కడి నుంచిరా ఊడిపడ్డావు?' అంటూ శంకరం వీపుమీద చెయ్యివేసింది.

తెల్లవారేవరకూ తనను గురించిన కబుర్లకంటె రాధిక యింటి కబుర్లుచెప్పి తల్లిని ఆనందపరచాడు శంకరం.

'అమ్మా—రాధికకేం లోటని మీరంతా అలా విచారపడుతున్నారు? ఒక్కళ్ళయినా పెళ్ళయిన తరువాత తొంగి చూడలేదని వాళ్ళంతా బాధపడుతున్నారు.'

'నాయనా. ఎంత సరిపెట్టుకుందామన్నా మనసు సమాధానపడటం లేదంటే నమ్ము. వాళ్ళ యింటికి వెళ్ళి అతడిని చూసి భరించలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంటే బాగుంటుందా చెప్పు? అందుకే నేను వెళ్ళలేకపోతున్నా అంతేకాని మరేం లేదు.'

'నీవు సర్దుకుపోవాలమ్మా. దానికిష్ఫుడిప్పుడే రోజులు వస్తున్నాయి. విన్నూ కంపించవమని మరి మరీ చెప్పారు రాధిక వాళ్ళ అత్తగారూను. వాళ్ళనుమనముచిన్నబుచ్చకూడదు.'

శంకరం రాధిక సంసారం చూసివచ్చి అన్ని సంగతులు చెప్పిన తరువాత సావిత్రమ్మ మనసులో గూడు కట్టుకున్న విచారము కొంత తగ్గింది. రాధిక తనకు చెప్పిన కబుర్లన్నీ నిజమే నన్నమాట. అయితే అవి తనను మాయచెయ్యటానికి చెప్పిన వట్టి కబుర్లు కావు. తృప్తిగా నిట్టూర్చింది సావిత్రమ్మ.

'అమ్మా.'

ఏమిటన్నట్టు చూసింది కొడుకు ముఖంలోకి సావిత్రమ్మ.

'రాధిక బి. ఏ. పరీక్ష వ్రాసింది చూడు. చదువు కూడా చెప్పిస్తున్నారు వాళ్ళు. అదంటే వాళ్ళిద్దరికీ ప్రాణం' ఈమాట పదోసారి శంకరం చెప్పటం. అతడు చెప్పినప్పుడల్లా ఆనందంతో సావిత్రమ్మ ముఖం ప్రఫుల్లమవుతున్నది.

*　　　*　　　*

విశాఖపట్నంలో లవితతోను అక్కడి వాతావరణంతోనూ విసిగిపోయి ఉన్న గోపీకి ఇంగ్లండు వెళ్ళినప్పటి నుంచీ హాయిగా ఊపిరి పీల్చుకున్నట్టుంది. కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి కొంతకాలము పట్టింది. హృదయం ఒంటరిగా బిక్కు బిక్కుమంటున్నట్టుగా ఉండేది. ఎవరిని పలకరించటానికి జంకుగా ఉంది. ఎవరు ఎటువంటివారో నన్న భయం అతడిని వెనక్కు లాగుతున్నది. తన చదువేమో తానేమో—ముక్కుకు సూటిగా నడవటం—అంతే.

అటువంటి సమయంలో పద్మవితో పరిచయము ఏర్పడ్డది. ఆమె కంటికి కనబడ



గానే గ్రీష్మములో శీతల చందన స్పర్శ మాత్రంగా ఉంటున్నది. ఒడలు పులకరించే ఆమె పలకరింపులకు బిగిసిపోయిన అతడి హృదయ కవాటాలు తెరుచుకుంటున్నాయి. తేనెలూరిన ఆమె సంభాషణలతో అతడు నిలువెల్లా పులకరించి పోతున్నాడు. పద్మని. అబ్బా. ఎంత మనోహరమయిన పేరు. ఆమె తన కోసమే భారతదేశాన్ని విడిచి ఇంత దూరము వచ్చిందా?

అతడికి రాత్రిళ్ళ స్వప్నాలలో కూడా నిడుపాటి జడతో—చందమామలాంటి ముఖంతో — లేత తమలపాకు లాంటి దేహంతో— దివి నుంచి భువికి దిగి వచ్చిన అప్సర కన్యలా తన వైపుకు వస్తున్న పద్మని సాక్షాత్కరిస్తున్నది. ఆమె నవ్వులతో మాటలతో తనను గిలిగింతలు పెడుతున్నది. సన్నటి నిడుపాటి వేళ్ళతో అల్లి నయిస్తూ తీగెలు సాగుతున్న ఆశాలతను తీయటి మాటలతో చిత్రిస్తూ మధ్యమధ్య చిరునవ్వులు చిందిస్తూ అతడిచేత గలగల నవ్విస్తున్నది. ఆ సోయగము అతడిని దిగ్భ్రాంతుణ్ణి చేస్తున్నది.

చదువుల సమయం దాటిన తరువాత ఇద్దరూ బుజబుజాలు రాసుకుంటూ ఏ పార్కుకో—ఏ సంతకో— ఏ సినిమాకో -ఏ పాట కచేరికో జంటగా వెళ్ళి కిలకిల నవ్వుకుంటూ తిరిగి వచ్చేస్తున్నారు. అతడి మనసుకు వాళ్ళ కలయిక ఆ నాటిది కాదు — ఆ సంవత్సరంది కాదు. ఏనాటిదో జన్మాంతర సంబంధం ఉన్నట్టుగా ఉంది. పూవుకు తావిమ ఉన్నట్టు— రాత్రి తరువాత పగలు ఉన్నట్టు — అంత సహజంగా ఉన్నది.

గోపీకి పద్మని కనబడనిరోజు అన్నాహాస్య, పద్మనికి గోపీ కనబడనిరోజున జీవమూ జవమూ లేనట్లే.

సాయంకాలము వేళ. పద్మని ఇన్స్టిట్యూట్ నుంచి ముందుగా తన గదికి వచ్చింది. ముఖం కడుక్కుని పెన్సిలుతో తిలకం దిద్దుకుని సాయం సమయంలో మనసుకు ఆహ్లాదకరమయిన రంగుచీర కట్టుకుని రెండు గులాబిరంగు పువ్వులు కుడివైపు కొప్పుకు తలలో అమర్చుకుని, మధురమయిన ఊహాలు మనసులో గంతులు వేస్తూ ఉండగా గోపీ గదికి చేరుకున్నది.

(ఇంకా ఉంది)

బ్రతక లేక పోతున్న బడి పంతుళ్లు

చదువుకు తగిన ఉద్యోగం మనదేశంలో దొరకడం లేదు. విద్యా విధానంలో మార్పు అవసరమనే విద్యావేత్తల గోడు గాలిలో కలిసి పోతున్నది. నిరుద్యోగ సమస్య నిత్యమూ దేశాన్ని పీడిస్తున్నది. తత్ఫలితంగా అర్హత, యోగ్యతలతో నిమిత్తం లేకుండా, అభిరుచుల్ని దూరంగా వుంచి — విద్యావంతులంతా ఏ ఉద్యోగంలో పడితే ఆ వుద్యోగంలో చేరి పోతున్నారు.

కలకాలం ఒకే సామెతా ?

ఉపాధ్యాయ వృత్తిని చేపడుతున్న వారు ఎవరు ? జీవనభృతి గడవనివారందరికీ ఈ వృత్తి దగ్గరగా వుంటున్న దన్న విషయం నేటికీ సత్యదూరంకాదు. నిరుద్యోగ రాక్షసితో వేగలేక ఉపాధ్యాయులుగా మారేవారు అనేకం వున్నారు. కేవలం ఈ వృత్తిని మనసారా కోరుకున్నవారు చాలా అరుదు. ఇప్పుడిప్పుడు, అసంతృప్తికరమైన భవిష్యత్తు దృష్ట్యా ఈ వృత్తిని అవలంబించేవారి సంఖ్య మరీ తగ్గిపోతున్నది.

'ఉపాధ్యాయవృత్తికి స్త్రీలు తగినవారు' అని మనస్తత్వశాస్త్రజ్ఞుల దగ్గరనుంచి విద్యావేత్తల వరకూ ప్రామాణికంగా చూపిస్తూనే వున్నారు. ఉద్యోగం చేస్తున్న స్త్రీలలో అధికశాతం ఉపాధ్యాయినులై వుంటున్నారని లెఖ్ఖలు చెబుతున్నాయి. రాను రాను, విద్యావిధానంలో పొకడలు వారిని కూడా నిరుత్సాహపరచేవిధంగా మార్పు చెందుతున్నాయి. దేశానికి పట్టుకొమ్మలాంటి ఈ రంగం ఇలా చిన్నచూపు చూడబడటం అత్యంత శోచనీయమైన విషయం.

ప్రణాళికల్లో అన్యాయం

'మూలమూల కుగ్రామాలలో కూడా విద్యలేనివాళ్లంటూ వుండకూడదు. దానికి తత్పరచర్యలు తీసుకుంటున్నామ'ని ప్రభుత్వం ప్రకటిస్తూ వస్తున్నది. అందుకుతగినవిధంగా ప్రణాళికలు ఏర్పరుస్తారని ప్రజల ఆశాభావం.

కాని, ఉపాధ్యాయులజీతాల్లో కూర్పుంచే ప్రణాళికాకార్యక్రమం పూర్తికాదనీ, ఈ కార్యక్రమాన్ని ఆలోచిస్తున్నప్పుడు అసలు ఉపాధ్యాయుల్ని దృష్టిలో ఉంచుకోకూడదనీ ఆమధ్య కేంద్రం నిర్ణయించుకుంది.

1965 లో నిర్ణయం ప్రకారం నాల్గవ ప్రణాళికలో విద్యకు 2000 కోట్ల రూపాయలు కేటాయించాలి కాని, తాజా ప్రతిపాదనలో రు. 1000 కోట్లు మాత్రమే వుంది !

విద్య అవసరాన్ని కనిపెడుతూనే ఇలా కోతకోయడం ప్రభుత్వం చిత్తశుద్ధికి దర్పణం! కేంద్రం విద్యని చిన్నచూపు చూస్తున్న దనడానికి ఇదొక ఉదాహరణ !

టీచర్ల తొలగింపు

'విద్యకు కేటాయించే ధనం పెట్టుబడిగా భావించాలి గాని ఖర్చుగా తీసుకోకూడదు' అనేది పండిట్ నెహ్రూగారి ఆశాభావం. ఇందుకు విరుద్ధంగా నడుస్తున్నాయి రాష్ట్రప్రభుత్వాలు.

ఇప్పుడు, పదకొండవ తరగతి (యస్. యస్ యల్. సి) రద్దు చేస్తామంటూ మన ప్రభుత్వం ప్రకటించింది. ఇందువల్ల 273 బిం.గ్యాడి టీచర్లు (కృష్ణాజిల్లాలో మాత్రం) నిరుద్యోగు లవుతారని తెలియ వస్తున్నది. రాష్ట్రం మొత్తంమీద ఈ సంఖ్యని చూస్తే వేలకు మించుతుంది. ముందు ముందు 12 వ తరగతికూడా రద్దు చెయ్యాలని ఒక ఆలోచన వున్నది. ఇదికూడా రద్దయితే మరికొన్ని వేల మంది టీచర్లకి ఉద్వాసన చెప్పబడుతుంది. బియ్యేడీ టీచర్లను సర్దుబాటు చేసే పథకంలో సెకండరీగ్రేడు టీచర్లు నష్టపోతారు.

వీరికి అవకాశ మేర్పరచడానికి ప్రభుత్వం చాలా అవస్థ పడుతున్నది. 69–70 లో హెచ్. యస్. సి. ప్రవేశ పెట్టడమూ, ఆ పాఠశాలల్లోనే అయిదవ తరగతిని చేర్చడమూ జరుగుతుందని వార్త. కంచం మార్చి మట్లు, మట్లు మార్చి కంచాలూ అన్నట్టుగా ఈ రూపేణా ధనం దుర్వినియోగ మవడం తప్పితే టీచర్ల బ్రతుకు బాగు పడుతుందని, విద్యారంగంలో ఆశాజనకమైన మార్పు వస్తుందనీ ఎవరూ అనుకోవడంలేదు.

క్రిక్కిరిసిన తరగతులు

జనాభా పెరుగుతున్నది. దీనితోపాటు పాఠశాలలలోని విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. విద్యార్థులసంఖ్యతో సమానంగా

ప్రణాళికలో కేటాయింపు

	మొదటి ప్రణాళిక	రెండవ ప్రణాళిక	మూడవ ప్రణాళిక
ఎలిమెంటరీ ఎడ్యుకేషన్	85 కోట్లు	87 కోట్లు	209 కోట్లు
సెకండరీ ఎడ్యుకేషన్	20 కోట్లు	48 కోట్లు	88 కోట్లు
విద్యకు కేటాయించిన మొత్తం	133 కోట్లు	208 కోట్లు	418 కోట్లు

భారతదేశంలో ఉపాధ్యాయులు (1965-66)

ప్రాథమిక పాఠశాలల్లో	5,37,918	6 91,249	9,10,000	12 66,000
మాధ్యమిక పాఠశాలల్లో	85,496	1,48,394	2,30 000	3,60,000
ఉన్నత పాఠశాలల్లో	1,26,504	1 89,794	2 29 000	2,90,000

తరగతులసంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతున్నదా ? అంటే లేదు ! కాని, తరగతిలో విద్యార్థుల సంఖ్య మాత్రం విపరీతంగా పెరిగిపోతున్నది !

ప్రస్తుతం, పాఠశాలలోని ఏ ఒక తరగతిని తీసుకున్నా లెక్కకు మించిన విద్యార్థు లుంటున్నారు. తరగతుల్ని పెంచితే టీచర్ల సంఖ్య పెరగాలి. అందుకు తరగతుల పెంపకం జరగడంలేదు. ఈ కారణంగా విద్యార్థులతో తరగతులు క్రిక్కిరిసి పోతున్నాయి. అంత టి ఇరుగ్గా కూర్చుంటూ విద్యార్థులు పాఠాలేంనేర్చుకోగల్గుతారు ? నేర్చుకున్నదేం వంటపడుతుంది. ఒక టీచరు అంతమంది విద్యార్థుల్నీ తట్టుకోగలడా ? ఇవి జవాబులేని ప్రశ్నలు.

ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్యని 20 నుంచి 30 కి పెంచారు. ఉన్నత పాఠశాలల్లో 40 నుంచి 60 కి పెంచారు. (పెంచడంమాట ఎలావున్నా తరగతుల్లో ఇంతకంటె ఎక్కువ సంఖ్యే వుంటున్నది !) ఇందువల్ల విద్యార్థులకి, ఉపాధ్యాయులకి ఎంత అసౌకర్యంగా వుంటున్నదో చెప్ప నలవికాదు. ఇది దృష్టిలో వుంచుకుంటే, టీచర్ల 'పొదుపు' ఎంత మేలైనదో అర్థమవుతుంది !

విద్యార్థులు—టీచర్లు నిష్పత్తి ఈ విధంగా వుండగా—ఇప్పుడు టీచర్లని తొలగిస్తున్నామంటూ మన రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.

గడ్డు సమస్య

ఈ తొలగింపువల్ల ఎదురయ్యే ఒక ముఖ్య సమస్య వున్నది. తరగతుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం అనివార్యంకదా ? ఇక, ప్రత్యేక పాఠ్యవిషయాలని బోధించేవారుంటారు. (ఉదా: హిందీ, తెలుగు,—వగైరా) వారి ఖాళీలని నింపడానికి అనుభవమున్న టీచర్లు ఎంతమందున్నారు? లేకనేకదా, కొత్త ఉపాధ్యాయుల నియామకం! దీని వల్ల అర్థమవుతున్నదేమిటి అంటే—అర్హతలేనివారికి పాఠ్యవిషయాలని అంటగట్టడమన్నమాట! అప్పుడు విద్యా ప్రమాణం ఎంత ఉన్నతస్థితిలోవుంటుందో ఊహాతీతంకాదు !

ఇది పొదుపా?

ఈ తొలగింపు ప్రకటన దేనికి సమర్థనీయంగావుంటుందో తెలియదు. 'పొదుపు' అనుకుంటే—దానిని అమలుపరచడానికి ఇంకా అనేక రంగాలున్నాయి. అనేక విధానాలున్నాయి. దానికి విద్యారంగాన్నే ఎర చెయ్యడం బాధాకరమనిపించదూ? అలా తీసుకున్నా, ఈ శాఖలోనే అనవసరపు ఖర్చు కనిపిస్తూనేవుంది.

విద్యాశాఖకి ఇద్దరు డైరెక్టర్లున్నారు. ఆ డైరెక్టర్ల క్రింద మరికొంతమంది జాయింటు డైరెక్టర్లున్నారు. జిల్లాకి ఒక డి. యి. వొ. వుండడం పూర్వంపద్ధతి. ఇప్పుడు వారికింద నలుగురు గెజెటెడ్ ఇన్స్పెక్టర్లున్నారు. డి. యి. వొ. ప్రతిపాఠశాలనీ దర్శించవలసిన అగత్యం ఇప్పుడు లేదు. పాఠశాలల బాగోగులకి ఇప్పుడాయన దూరంగావుంటున్నారన్నమాట! ఇక, ఉపాధ్యాయుల వయోపరిమితిచూద్దాం. 55 నుంచి 60కి పెంచారు. (ఇంకా పెంచాలనే వాదనకూడావుంది) అది సాధారణంగా విశ్రాంతి తీసుకునే వయస్సు. ఈ వయస్సును పెంచడంవల్ల కొత్తవారికి అవకాశాలు సన్నగిలుతున్నాయి. ఒక టీచరు రిటరయినప్పుడు—అతని జీతంతో ఇద్దరు ఉత్సాహమైన కొత్తటీచర్లు పనిచెయ్యగల్గుతారు.—ఈ విషయాన్ని ప్రముఖవిద్యావేత్తలు ప్రభుత్వదృష్టికి తెచ్చారు.

ఉచితమైన సలహాలు

అనుభవజ్ఞులు ప్రభుత్వంచేస్తున్న కొన్ని మార్పుల్ని సమర్థిస్తూ టీచర్లకు నష్టం కలక్కుండా యిచ్చిన సూచనలివి :

1. సెక్షనుకు 40 నుంచి 45 విద్యార్థులకు మించకుండా తరగతుల సంఖ్య పెంచడం,
2. 55 ఏళ్లపైబడిన ఉపాధ్యాయులకు విశ్రాంతి ఇవ్వడం,
3. ట్రయినింగు పాఠశాలల్ని కొంతకాలం మూతవెయ్యడం,
4. హయ్యర్ సెకండరీ స్కూళ్లల్లో 5వ తరగతి తప్పకుండా ప్రవేశపెట్టడం.

జీతనాతాలు

ఉపాధ్యాయుల జీతాలు తదితర ఉద్యోగులకంటె ఎక్కువ, వారిని తొలగించడం ద్వారా చాలా మిగులుతుందనుకుంటే తొలగింపుపద్ధతి అచరణీయమైనదే. కాని వారి జీతాలు ఇతర ఉద్యోగులతో పోల్చిచూస్తే హస్తిమశకాంతరం వుంటున్నాయి. విశిష్టమైన విద్యాదానంచేస్తూ చాలీచాలని జీతనాతాలతో జీవనయాత్రచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి కడు విచారకరమైనది.

పంజాబ్, హర్యానా, బీహార్ ప్రభుత్వాలు మనకి ఆదర్శంగా నిలబడ్డాయి. కేంద్రం సహాయం లేకుండా టీచర్ల

భారతదేశంలో విద్యార్థుల మొత్తం (లక్షల్లో)

	1950 51	1955-56	1960–61	1965-66
ప్రాథమిక పాఠశాలల్లో	191.5	251.7	343.4	496.4
మాధ్యమిక పాఠశాలల్లో	31.2	42.9	62.9	97.5
ఉన్నత పాఠశాలల్లో	12.2	18.8	29.1	45.6

జీతాలు మెరుగుపరిచారు. ఈ పద్ధతి మన ప్రభుత్వం అనుసరించి నట్టయితే ఉపాధ్యాయులు ఎంతయినా హర్షిస్తారు.

ఉదాహరణకి ఒక ప్రాథమిక ఉపాధ్యాయుని జీతం చూద్దాం: పంజాబులో '25 రూపాయల జీతము, రు. 91 కరువు భత్యం'తో ప్రారంభమై — 'రు. 300 జీతమూ రు. 137 కరువు భత్యంతో' రిటయి రవుతున్నాడు. మరి, ఈ స్కేలుతో చూస్తే మన ఉపాధ్యాయుని జీతం సగం కంటె మించదు!

మేలొనగూర్చే ఈ విషయాన్ని అలా వుంచి, రిట్రెంచిమెంటు పేరుతో ప్రభుత్వం చేస్తున్నపని ఉపాధ్యాయులకి అశని పాతం లాంటిదని వేరే చెప్పక్కరలేదు.

ఇబ్బందులు

ఇచ్చే జీతాలుకూడా ఆలశ్యంగా ఇస్తున్నారు. కొన్నిచోట్ల నెలల తరబడీ బకాయిలుంటున్నాయి. పింఛన్ల సంగతి సరేసరి! ఇవి ఆడిట్ అభ్యంతరాలవల్ల, ఆవిధమైన జాప్యాలవల్ల ఆలశ్య మవుతున్నాయని విద్యామంత్రి ఒప్పుకున్నారు. కొన్నిసందర్భాల్లో పింఛన్లు ఆయా వ్యక్తులు మరణించిన తర్వాత అందుతున్నవంటే — ఇది చాలా హాస్యాస్పదమైన విషయం. టీచర్ల పట్ల ఇలాంటి నిరాదరణ ఎక్కడచూసినా కనిపిస్తున్నది. 'రెడ్ టేప్' దృష్ట్యా వీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనేకం.

...బక్కి పంతులు

ప్రయివేటు క్లాసులు

టీచర్లు ప్రయివేట్లు చెప్పకూడదని ప్రభుత్వం శాసనం! ఈ శాసనాన్ని తల దాల్చినవారు చాలా అరుదు. స్కూలు విడిచిన తర్వాత టీచర్ల యింటిదగ్గర మరో స్కూలు తెరవబడుతుంది పరీక్షలు ఆసన్నమవుతున్న సమయాల్లో ఈ సంఖ్య మరీ విపరీతంగా వుంటుంది. డాక్టర్లకి ప్రయివేటు ప్రాక్టీసులా టీచర్లకి యిది వేన్నీళ్లకి చన్నీళ్లలా సాయపడుతుంది. టీచర్లు ప్రయివేట్లు చెప్పుకోవడంలో అర్థం లేకపోలేదు. విరామకాలాన్ని ఎవరు మాత్రం ఎందుకు పాడుచేసుకుంటారు? ఇది ఆలోచించవలసిన విషయం.

ఈ ప్రయివేట్లవల్ల అనేక అనర్థాలు ఎదురవుతుంటాయి. క్లాసులో పాఠాలు చెప్పడం టీచర్లకి ఎంత అశ్రద్ధగా వుంటుందో, విద్యార్థులకు నేర్చుకోవడం లోనూ అంతే శ్రద్ధ వుంటుంది! సాయంత్రం, మాష్టరిదగ్గర చెప్పించుకో వచ్చులే అని ఎగవెయ్యడంకద్దు. ఇంటి దగ్గరా, పాఠశాలలోనూ బోధించాలంటే టీచర్లకూ దుస్సాధ్యమే!

విద్యార్థుల క్రమశిక్షణారాహిత్యం

ఈనాడు ఎక్కడచూసినా విద్యార్థులలో క్రమశిక్షణారాహిత్యం కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. క్రిక్కిరిసిన తరగతులు, బోధనోపకరణాల లేమి, ఆటస్థలాల చాలమి, ఉపాధ్యాయుల అశ్రద్ధ, తల్లిదండ్రుల ప్రమత్తత ఇందుకు ముఖ్య కారణాలు ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడివడిన విషయాలు. క్రమశిక్షణారాహిత్యాన్ని సమూలంగా త్రుంచివేయాలంటే కీలెరిగి వాత పెట్టడం ప్రభుత్వం వంతు.

అయితే మన ప్రభుత్వాలచూపు ఎప్పుడూ పరిశ్రమలమీద, అంతర్జాతీయ రాజకీయాల మీద తప్పితే విద్యావిధానాన్ని చక్కజేయడంలోను, ఇల్లు చక్కబెట్టుకోవడం లోను వుండటం లేదు. ముఖ్యమైన వాటిమీదనుంచి దృష్టి మరల్చి అనవసరాలకు పోవడంవల్లనే అనర్థాలకి గురికావలసి వస్తున్నది.

ఉద్యమాలు జరిగి తీరాలా?

సమ్మెలు ఉద్యమాలవల్లగాని ప్రభుత్వం ఉద్యోగుల పరిస్థితిని చక్కబెట్టడానికి పూనుకోవడంలేదు. కార్య సాఫల్యానికి ఇదొక పూజా విధానంగా తయారయింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలు కోకొల్లలు. గంగిగోవుల్లాంటి ఉపాధ్యాయుల్ని కూడా ఈ పరిస్థితికి తీసుకువస్తున్నది ప్రభుత్వమే అని చెప్పక తప్పదు.

దేశం నలుమూలలనుంచి దాదాపు పదివేలమంది ప్రాథమికోపాధ్యాయుల ఈ మధ్య, తమ కోర్కెలని పార్లమెంటుకు నివేదించుకోడానికి వెళ్లారు సుమారు అయిదుమైళ్ల పొడవున వారు ఊరేగింపు జరిపారు. ఇందులో సుమారు 500 మంది ఉపాధ్యాయినులుకూడా వున్నారు. ఆందోళనా రహితమైన ఉద్యమంగా అది తెల్లవారి పోయింది!

కమిషన్ సూచనలు

ఉపాధ్యాయుల స్థితిగతులను విచారించడానికి ఒక కమిషన్ ఏర్పడింది. దేశంలో అన్ని ప్రాంతాల ఉపాధ్యాయులకు సమానమైన జీతాలు నిర్ణయించాలనీ, కేంద్రం రాష్ట్రప్రభుత్వాలకి ఉదారంగా విరాళాలు ఇవ్వాలనీ ఈ కమిషన్ సూచించింది. కొఠారికమిషన్ నివేదికను ఆచరణయుక్తం చెయ్యడానికి ప్రభుత్వం పూనుకుంటే — కొన్ని సమస్యలు వాటికంతట అవే పరిష్కారమవుతాయనే ప్రముఖుల అభిప్రాయాన్ని తోసిపుచ్చడానికి వీలులేదు.

—ఒక విలేఖరి ●

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావసతి

	సంవత్సరము	బాలురు	బాలికలు	మొత్తం
1 నుంచి 5 తరగతులు	1960—61	17.50	10.70	44.20 లక్షలు
(6-11 మధ్యవయసు)	1965—66	25 40	18 80	60 3 లక్షలు
6 నుంచి 8 తరగతులు	1960—61	2.74	0 81	6.13 లక్షలు
(11-14 మధ్యవయసు)	1965—66	4.68	1.45	15.6 లక్షలు
9 నుంచి 11 తరగతులు	1960—61	1 62	0.24	2.36 లక్షలు
(14-17 మధ్యవయసు)	1965—66	1.94	0.42	8.8 లక్షలు



'సినిమా నటీనటులకు ఊరూరా అభిమానసంఘాలు యేర్పడుతున్నాయి. విద్యార్థులుకూడా వానిలో చేరుతున్నారు. ఇది చాలా శుభసూచకం' అన్నాడు చంద్రరావు.

'ఇది యెంతమాత్రం శుభసూచకం కాదు' అంటూ చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఊరూరా సినిమా ప్రేక్షక సంఘాలు ఉన్నాయి అంటే వాటి ప్రయోజనాన్ని మనం కొంతవరకు అర్థం చేసుకోనవచ్చును. ఆ సినిమా ప్రేక్షక సంఘాలైనా ప్రస్తుతం సరిగ్గా పనిచేయడం లేదనేది వేరే విషయం.'

'కాళిదాసు, షేక్స్పియరు, తిక్కన, శ్రీనాథుడు వంటి కవులకు అభిమాన సంఘాలు ఉన్నాయంటే అందులో అర్థం ఉంది. ఆ కవియొక్క రచనల ప్రత్యేకత, ఆ కవికి మిగిలిన కవులకు గల భేదం మొదలైనవాటిని గురించి ఆ సంఘాలు పరిశోధనలు జరపవచ్చును. వాటివల్ల సాహిత్యసేవ జరుగుతుంది.'

'సినిమా నటీనటుల అభిమానసంఘాల లక్ష్యం యేమిటి? తమ అభిమాన నటిగాని నటుడుగాని యెంత అసహ్యంగా, అసభ్యంగా నటించినా ఈఅభిమాన సంఘాలు ఆమోదిస్తాయా? మరొక నటుడు యెంత బాగా నటించినా వీరు హర్షించరా?'

'పోనీ, ఈ అభిమాన సంఘాల కార్యక్రమాన్ని చూద్దాం. తమ అభిమాన నటుడు నటించిన ప్రతి సినిమాకు తప్పకుండా హాజరవడం, తమ అభిమాన నటుని పేరు కన్పించినా, విన్పించినా, తమ అభిమాన నటుడు సినిమాలో కన్పించినా చేతులు తీట తీరేలా గుస చప్పట్లు కొట్టడం తప్ప మరొక కార్యక్రమం ఈ సంఘాలకు ఉందా? కాకపోతే యేడాది కొకసారి తమ అభిమాన నటుడికి ఒక కొత్త బిరుదును యివ్వడమో, కనకాభిషేకంలాంటి సన్మానం చేయడమో చేస్తుంటారు'

'అందుచేత ఈ సంఘాలు 'అభిమాన సంఘాలు' అని కాకుండా ఫలానా నటుని భజన సంఘాలనో, లేకపోతే ఫలానా నటుని శాశ్వత సన్మాన సంఘాలనో పేర్లు పెట్టుకోవడం మంచిది' అన్నాడు చూడామణి

'ఒక సినిమాలో ఒక నటుడు బాగా నటించాడనుకో. అతని నటనను మెచ్చుకొన్న ప్రేక్షకులందరూ ఒక సంఘంగా యేర్పడితే తప్పేముంది?' అని ప్రశ్నించాడు చంద్రరావు.

'ఒక సినిమాలో ఒక నటుడు బాగా నటించవచ్చును కాని మరొక సినిమాలో అసహ్యంగాను అసభ్యంగాను నటించడనే హామీ యేమిటుంది? ఈ మధ్యను యెంత చెత్త సినిమాలు వస్తున్నాయో చూస్తూనే ఉన్నాం కదా!'

సినిమా బాగా లేకపోతే ఈ నటులు కథ బాగా లేదనో, దర్శకుని లోపం అనో తోసివేస్తుంటారు. అయితే బాగా ఉన్న సినిమాకు మాత్రం అంతా తమ ప్రభావమేనని ప్రచారం చేసికొంటారు. అయితే కథ బలంగాలేని సినిమాలో యెందుకు నటించాలి? అని ప్రశ్నించితే దానికి సమాధానం ఉండదు. 'లేకపోతే వాళ్లు, డబ్బు యిచ్చారు కాబట్టి మేము



ముగ్గురు మూర్ఖులు

పటించాము.' అనె సమాధానం వస్తుంది. అంటే కళను గురించి తాము సభల్లో చెప్పే విషయాలోన్నింటినీ డబ్బు దగ్గరకు వచ్చేసరికి మర్చిపోతుంటారు. డబ్బుకోసం యెవళ్ల పనులను వాళ్లు చేసికొంటున్నారు. అలాగే సినిమా నటులు కూడా నటిస్తున్నారు. అందులో ప్రత్యేకంగా అభిమాన సంఘాలు యేర్పడి వీళ్లను సన్మానించవలసిన అవసరం యేమిటి ఉంది?' అని తిరిగి చూడామణి ప్రశ్నించాడు.


'నువ్వు చెప్పినదానిని బట్టి చూస్తే అవసరం లేదనుకో. కాని యిందులో నష్టం కూడా లేదు. ఈ సన్మానసభల ఖర్చుల్లో చాలా వరకు పాపం ఆ నటులే భరిస్తుంటారు. లేకపోతే ఆ నటుడు నటించే సినిమా కంపెనీలవాళ్లు భరిస్తుంటారు. ఇక బిరుదల సంగతి అంటావా? అందులో కూడా సంఘాలకు యే యిబ్బందీ లేదు. తనకు యే బిరుదు కావాలో ఆ నటుడే సాధారణంగా తన శ్రేయోభిలాషులతో సంప్రదించి నిర్ణయించుకుంటాడు. ఈ అభిమాన సంఘాలు చేయవలసిందల్లా ఆ నటుడి పేరుకు ఆ బిరుదును తగిలించి ఒకసారి 'జై' అనడమే' అంటూ అభిమాన సంఘాలను సమర్థించాడు చిదంబరం.

'బిరుదు' అనగానే నాకు ఒక సంఘటన జ్ఞాపకానికి వచ్చింది అన్నాడు చూడామణి.

'ఏమిటా సంఘటన?' అని చంద్రరావు చిదంబరం ఒకేసారి ప్రశ్నించగా చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఒక ఊళ్లో సినిమా ప్రేక్షకసంఘం యేర్పడింది; అందులో రెండు పార్టీలు ఉన్నాయి. ఒక పార్టీకి ఒక నటుడంటే అభిమానం ఉంది. రెండవ పార్టీకి మరొక నటుడంటే అభిమానం ఉంది. ఒకప్పుడు ఆ ఊళ్లో గ్రామదేవత పండుగ వచ్చింది. ఆ సందర్భంలో సినిమానటులకు సన్మానం చేయాలని తీర్మానించింది. సినిమా ప్రేక్షక సంఘం.

'అయితే యే నటునికి సన్మానం చేయాలనేది తెలలేదు. తమ అభిమాన నటుడుకి, ఆ నటుని మురాకు చెందిన ఉపనటులకు సన్మానం చేయాలని యే పార్టీ మట్టుకు ఆ పార్టీ పట్టు పట్టింది. ఎలక్షనుద్వారా యీ విషయాన్ని తేల్చుకోవడం మంచిదన్నారు కొంతమంది సభ్యులు.'



'ఈ విషయంలో యెన్నికలు జరిగితే కొట్లాటలు, రక్తపాతం జరగవచ్చునని ఆ గ్రామంలోని పెద్దలు భయపడ్డారు. అప్పుడు గ్రామపెద్దలు సినిమా ప్రేక్షక సంఘ సభ్యులతో యిలాగ అన్నారు.'

'గ్రామదేవత పండుగ ప్రతి యేడాదీ వస్తుంది. అందుచేత మనం ప్రతి యేడాదీ సినిమానటులకు సన్మానాలు చేయవచ్చును. బిరుదులు యివ్వవచ్చును. ఈ సంవత్సరం ఒక నటుడి మురాకు సన్మానంచేస్తే వచ్చే సంవత్సరం మరొక నటుడి మురాకు సన్మానం చేయవచ్చును. ముందుగా యెవరికి సన్మానం చేయడం అనేది లాటరీ వేయడం ద్వారా తేల్చుకోవడం మంచిది.'

'ఈ సూచనకు అందరూ అంగీకరించారు. లాటరీ వేశారు. అందులో ఒక నటునిపేరు వచ్చింది. వెంటనే మరొక నటుని అభిమాన వర్గంవారికి ఒకసందేహం వచ్చింది. అప్పుడు వారు పెద్దలతో యిలాగ అన్నారు.'

'ఈ సంవత్సరం ఆ పార్టీవాళ్లు తమ అభిమాన నటుడికి సన్మానం చేస్తున్నారు. బాగానే ఉంది. కాని మంచి మంచి బిరుదులన్నీ వాళ్లు తమ నటుని మురాకు యిచ్చివేస్తే వచ్చే సంవత్సరానికి మాకు బిరుదులు ఉండవద్దా? ఈ సంగతి యేమిటో యిప్పుడే తేల్చుకోవడం మంచిది.'

'అవును. మీరు చెప్పింది సబబుగానేఉంది. ఎవరెవరికి ఏయే బిరుదులను యివ్వవలసిందీకూడా యిప్పుడే మనం లాటరీద్వారా తేల్చుకొందాం. మనం యేయే బిరుదుల్ని యిద్దామనుకొంటున్నామో ఆ బిరుదులను చిన్న చిన్న కాగితం ముక్కలమీద రాసి ఒక పెట్టెలో వేద్దాం. తరువాత మనం యెవరెవరికి బిరుదులను యిద్దామనుకొంటున్నామో ఆ నటుల పేర్లను ఒక్కొక్క కాగితం ముక్క మీద రాసి మరొక పెట్టెలో వేద్దాం...

మనలో బొత్తిగా అక్షర జ్ఞానంలేని ఆసామీని న్యాయమూర్తిగా యెంచుకొందాం. ఆ ఆసామీ దైవంమీద భారంవేసి, ఆ పెట్టెలోనుంచి ఒకచీటి యీ పెట్టెలోనుంచి ఒకచీటి తీయాలి. యే నటుని పేరుగల చీటీ వచ్చినప్పుడు యే బిరుదు చీటీ వస్తుందో ఆ బిరుదు ఆ నటునికి యిచ్చివేయాలి' అని గ్రామ పెద్దలు తీర్పు యిచ్చారు.

'ఇది చాలా బాగుంది. ఏ నటుని అదృష్టాన్నిబట్టి ఆ నటుడికి ఆ బిరుదు వస్తుందని అందరూ అంగీకరించారు. ఆ ప్రకారమే బిరుదుల్ని నటులకి యిచ్చారు' అంటూ బిరుద ప్రదానోపాఖ్యానాన్ని పూర్తి చేశాడు చూడామణి.

'వాళ్లుచేసిన విధానం బాగానే ఉంది కాని అక్కడ ఒక చిక్కు రావచ్చును. కత్తియుద్ధాలు బాగాచేసే నటుడికి 'శృంగార రస ధురీణ' అనే బిరుదు రావచ్చును. అలాగే విషాదాన్ని బాగా నటించే నటుడికి 'మేరు నగధీర' అనో 'భండనభీమ' అనో బిరుదు రావచ్చును. అందుచేత యే నటునికి సరిపోయిన బిరుదు ఆ నటుడికే వస్తుందన్న హామీ యేముంది? అని ప్రశ్నించాడు

చిదంబరం:

'సినిమా నటులకు, నాటకాల నటులకు బిరుదులు, ఛాలెంజీలు సరిపోతాయా? సరిపోవా? అనే ప్రశ్న ఉండదు. 'నాతో ఛాలెంజీచేసి శ్రీ కృష్ణపాత్రను నటించే వారికి రూ. 1116 లు బహుమానం అంటూ కొంతమంది నటులు నాటకాలు వేయడం లేదా? ఇలాంటి ఛాలెంజీలకే అదే సమయంలో నలుగురైదుగురు నటులు చేస్తున్నారనే విషయం వారికి తెలియదా? అయినా వాళ్ళు ఆ విషయాలను పట్టించుకొంటున్నారా? ఛాలెంజి చేయడం మానుతున్నారా?

'అలాగే, బిరుదుల విషయంలో కూడాను. చక్రవర్తి, సామ్రాట్, సార్వభౌమ యివన్నీ సమానార్థకాలే. అయినా ఒకే కాలంలోనే నటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసామ్రాట్ అనే బిరుదుల్ని నటులు ధరించడంలేదా? సామ్రాటో, చక్రవర్తో, సార్వభౌముడో ఒక సమయంలో ఒకరు మాత్రమే ఉంటారనే విషయాన్ని యెవరైనా పట్టించుకొంటున్నారా? పోని ఒకరికి చక్రవర్తి అనే బిరుదును యిస్తే మిగిలినవారికి నటమంత్రి, నటసేనాధిపతి! నటసామంత అనే బిరుదులను యివ్వవచ్చును గదా! అలాగ కాకుండా ఖాళీగా ఉండిపోయిన ప్రతి పెద్ద బిరుదును యీ అభిమాన సంఘాలు నటులకు యివ్వడం లేదా? అంటూ చూడామణి ప్రశ్నించగా చిదంబరం, చంచ్రావు యేమీ మాట్లాడలేదు.

'ఈ విషయంలో ఒక్క అభిమాన సంఘాలనే అనవక్కరలేదు. 'బిరుదుల విషయంలో పదాలు మాత్రం గంభీరంగాను అందంగాను ఉండాలిగాని అర్థాన్ని గురించి అంతగా పట్టించుకోనక్కరలేదు' అని ఘనత వహించిన భారత ప్రభుత్వం వారు యేనాడో నిర్ణయించి పారేశారు' అన్నాడు చూడామణి.

'ఏమని నిర్ణయించారు?' అని చిదంబరం ప్రశ్నించగా చూడామణి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

బిరుదుకు ఒక అర్థం ఉండాలి. ఆ అర్థం కూడా సులభంగా బోధపడేట్టు ఉండాలని అందరికీ తెలుసుకదా!

'పద్మశ్రీ, పద్మభూషణ, పద్మవిభూషణ అనే బిరుదులను ప్రభుత్వం ప్రతి సంవత్సరం కొంతమందికి యిస్తూ ఉంది. వీటి అర్థాన్ని గురించి యెవరైనా ఆలోచించారా?

పద్మం అంటే లక్ష్మి అనీ, తామర అనీ రెండు సామాన్యమైన అర్థాలు ఉన్నాయి. అలాగే శ్రీ అంటే లక్ష్మి అనీ, సంపద అనీ తేజస్సు అనీ, సామాన్యమైన అర్థాలు ఉన్నాయి. ఈ రెండింటిని కలిపితే వచ్చే అర్థం యేమిటో భారత ప్రభుత్వానికే తెలియాలి.

'బ్రహ్మశ్రీ' అని బ్రాహ్మణులకు

'రాజశ్రీ' అని యితరులకు గౌరవ సూచకంగా వాడుతుంటారు. బ్రహ్మశ్రీ అంటే బ్రహ్మతేజస్సు కలవాడని లేకపోతే, బ్రహ్మకు సంబంధించిన అయిశ్వర్యం అనగా జ్ఞానం కలవాడనీ అర్థం చేసికోవచ్చును. అలాగే రాజశ్రీ అంటే రాజైశ్వర్యం కలవాడని అర్థం చేసికోవచ్చును.

V. S. ఆప్టే కూర్చిన సంస్కృతం యింగ్లీషు డిక్షనరీలో 'పద్మ' అనే పదానికి 22అర్థాలు, శ్రీఅనే పదానికి 20 అర్థాలు ఉన్నాయి. వీటిలో యే రెండింటిని జత చేసినాకూడా సరియైన అర్థం రాలేదు. అందుచేత ప్రభుత్వంవారే తాము యిచ్చే బిరుదులకు అర్థం ఏమిటో ఒకసారి ప్రకటిస్తే బాగా ఉంటుంది' అని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు మూడామణి.

'అయితే యీ అభిమాన సంఘాలు ఉండడం మంచిదిగాదు. సినిమా ప్రేక్షక సంఘాలు ఉండవచ్చు నంటావు' అని అన్నాడు చిదంబరం.

'ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలో అయితే యీ సినిమా ప్రేక్షక సంఘాలు కూడా దండుగే—ఈ సినిమా ప్రేక్షకసంఘాలు మాత్రం యిప్పుడు యేమిటి చేస్తున్నాయి? ఏడాది కొకసారి నటీ నటులకు సన్మానాలు

ముగ్గురు మూర్ఖులు

చేయడం తప్ప వీటికి మరొక కార్యక్రమం ఉందా? అందుచేత ఈ సినిమా ప్రేక్షక సంఘాలుకూడా ప్రస్తుతం నటీనటులు భజన సంఘాలుగా మారిపోయాయి.' అంటూ మూడామణి చెప్పడం ప్రారంభించాడు.

ఇప్పుడు యెన్నో అసభ్యమైన అసహ్యమైన సినిమాలు వస్తున్నాయి. వాటి విషయంలో యీ సినిమా ప్రేక్షక సంఘాలు యేం చేస్తున్నాయి? ఎప్పుడో యిరవై సంవత్సరాల క్రిందట వరూధినిలాంటి సినిమాల విషయంలో యేవో గొడవలు జరిగేయని విన్నాంగాని తరవాత యేమైనా జరిగిందా?

నిజంగా యీ సినిమా ప్రేక్షక సంఘాలు ప్రజలకు సేవ చెయ్యదలుచుకొంటె యీ అసభ్యమైన సినిమాలను ఆపించవద్దా? అని ప్రశ్నించాడు మూడామణి.

సినిమాలను ఆపించడం యెలాగ సాధ్యం? అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు చంద్రరావు.

అసభ్యమైన సినిమాలను తప్పకుండా ఆపించవచ్చును. మొట్టమొదట యీ సినిమా ప్రేక్షక సంఘసభ్యులు సదరుసినిమాను ప్రదర్శించవద్దని సినిమాహాలు యజమానితో చెప్పాలి. హాలు యజమాని వీరి మాటలను విని సదరు సినిమాను ఆపివేస్తే సరేసరి. లేకపోతే ఆ సినిమాకు యెవరూ వెళ్ళకుండా సినిమా ప్రేక్షక సంఘంవారు పికెటింగ్ చేయాలి' అన్నాడు మూడామణి.


'అంత పికెటింగ్ చేసే అంత అవసరం యెవరికి వుంది. అయినా, అసభ్యకరమైన సినిమాలను నిషేధించవలసిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది కదా?' అన్నాడు చిదంబరం.

'నటీ నటులకు సన్మానాలు చేయవలసిన అవసరం మాత్రం ప్రేక్షక సంఘాలకు యేమిటుంది? అయినా అవి సన్మానాలు చేయడానికి శ్రమపడడం లేదా? అలాగే పికెటింగ్ చేయడానికికూడా శ్రద్ధ తీసుకోవాలి. సన్మానాలు చేయకపోతే వచ్చే నష్టం యేమీ లేదుకాని యీ అసభ్యమైన సినిమాలను ఆపించకపోతే మాత్రం చాలా నష్టం ఉంది.'

'ఇక ప్రభుత్వంమాట అంటావా? దేశపు సరిహద్దులను రక్షించలేని పోయిన ప్రభుత్వం, యిరవై సంవత్సరాలయినా ఆహార సమస్యలను పరిష్కరించలేని యీ అసమర్థపు ప్రభుత్వం యీ విషయంలో యేదో చేస్తుందనుకోవడం కేవలం అవివేకం' అన్నాడు మూడామణి.

అయితే యింగ్లీషు సినిమాల మాటేమిటి? అని ప్రశ్నించాడు చంద్రరావు.

ఇప్పటికే చాలా ఆలస్యమైంది. యింగ్లీషు సినిమాల గురించి, కనకాభిషేకాల గురించి మరొకసారి మాట్లాడుకోవచ్చు నంటూ మూడామణి లేవగానే మిగిలిన యిద్దరూకూడా అతన్ని అనుసరించారు. ●



ప్రశ్నావళి ?

కె. రామలక్ష్మి

ఎమ్. వి. హెచ్. ఎల్, విజయవాడ

నా కింకా చదువుకోవాలని ఉంది. మా వారి నడిగితే సమాధానం ఇవ్వరు...

అందుకని ఉత్తరం వ్రాయడం? ఇంట్లో పరిస్థితులు, (పాప అంటున్నారు) అర్థం చేసికొని ఇంట్లో ఉండే వీలు చూసుకుని చదువుకుంటే మీవారు మటుకు ఎందుకు వద్దంటారు? లేక ఇప్పుడు స్కూలుకి వెళ్ళే చదువుకోవాలనా?

పి. ఏ, చీరాల

ఆడవారి మనస్తత్వం అర్థం చేసుకోవడం ఎలా ?

అర్థం చేసుకోరు ఎవరూ— అందుకే అలవాటు చేసుకుంటారు.

వి. ఎస్. ఎస్. ఎమ్, దార్లపూడి

మీరు ఎలా బ్రతకాలో చెప్పే ప్రఖ్యాత మహాశయ గుణసంపన్ను ఆరుద్ర కవి సర్యుని మెట్టి నింటిపేరుతో భర్తలో భాగంగా కన్పించక పుట్టినింటి పేరుతో 'కె' గానే చెలామణీ అవుతున్న మీరు మీ భవిష్యత్తును భర్తలో వెతుక్కొన్న వాళ్ళకు మీ భవిష్యత్తులో భర్తవాలు పంచుకోవా లనేడి—ప్రగాఢ వాంఛా సంకల్పాలా ?

శుద్ధ గ్రాంథికంలో గట్టిగానే కోప్పడ్డారే! రచయితగా అలవాటైనదే ఆపేరు. అందుకే దాని జోలికి పోక ఊరుకున్నాను. ఇక భర్తకి వేరూ భార్యకు వేరూగా ఉంటాయో—భవిష్యత్తులు? ఇద్దరిదీ ఒకే బాట. అంచేత ఒకే భవిష్యత్తు. బెంగపడకండి. అదే నా ప్రగాఢ వాంఛ.

వి. డి. హెచ్. ఆర్, కడప

స్త్రీ గానీయండి పురుషుడు గానీయండి మనకు తెలిసినవారు ఎదురుపడి నప్పుడు మన ముఖంమీద మందహాసం వెలుస్తుంది కారణం ఏమిటి ?

దాని వెనక శాస్త్రీయమైన వివరణ చెప్పలేను గాని, అది గుర్తింపునకు చిహ్నంగా వెలుస్తుంది. కనీసం అమాత్రం కూడా చూపక పోవడం సభ్యతా లక్షణం కూడా కాదు.

ఎమ్. వి. ఆర్, బరంపురం

చాలామంది మగవారు ఇతర స్త్రీల వద్ద ఎక్కువ నమ్రతతో అడుగులకు మడుగులు ఒత్తుతూ ఉంటారు. కాని వారి భార్యలతో అంత మోటుగా ప్రవర్తిస్తారు ఎందుచేత ?

ఒకటే— పొరుగింటి పుల్లకూర. మీరన్నట్లు కొందరి మగవారిని ద్వంద్వ ప్రవృత్తులు. వారి ప్రవర్తనకూడా అందుకు తగ్గట్టే ఉంటుంది.

ఎమ్.వి.ఆర్.వి.హెచ్, ఉరవకొండ

ఆంధ్ర సాహిత్యంలో ఇంతకు పూర్వం కవయిత్రులూ రచయిత్రులూ బహు స్వల్పంగా ఉన్నారు. ఈనాడు ఇందరు రచయిత్రులున్నారంటే దానికి కారణం?

లభిస్తున్న ప్రోత్సాహం సోదరీ,

వి. వి. ఆర్, గుంతకల్లు

రామలక్ష్మిగారూ స్వప్నాలు కేవలం స్వయంభవాలంటారే నిజమేనా ? తను చనిపోయినట్లు తనకే కల వచ్చింది. ఎందుచేత?

ఎవరు చెప్పారలాగని రంగయ్యగారూ? నాకెప్పుడూ నేచచ్చిపోయినట్లూ నాచుట్టూ కూర్చుని అంతా బాధపడుతూన్నట్లు కలొస్తూ ఉంటుంది. వాళ్ళనుకునే మాటలు వింటే...బాబోయ్— నాకు తెలిసిన ముఖాలన్ని ఉంటాయనుకున్నారు చుట్టూ?!

టి. కె. కె. మెడ్చల్

మొదటి నవల ఏ సంవత్సరంలో రాశారు? దాని పేరేమిటి?

59 లోనో 60 లోనో జ్ఞాపకం లేదు. అపరిచితుల్లు దాని పేరు.

డిటెక్టివ్ నవలలు రాశారా!

లేదు. రహస్యం దాచలేను!

ఎమ్. బి. ఆర్, కోరాపుట్

...మరి మీ ప్రశ్నలకి జవాబులు.

మా పిల్లలు చెప్తుంటారు రావుగారూ.

మానవుడు పరిపూర్ణత నొందేదెప్పుడు?

సంసార సాగరపు ఒడిదుడుకులలో పండి రాలి పోయినప్పుడు.

పుణ్యానికెడితేపాపం పాపం ఎదురవుతోందేమిటి సిస్టర్ ?

పుణ్యానికెందుకు వెళ్ళావు తమ్ముడూ ఊర్కినే ఏపనీ చేయకూడదు!

కె.హెచ్. ఎస్. డి, బాపట్ల

ఏవైనా కథలుగాని నాటకములుగాని అనువాదములుచేయాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి?

ఆయా రచయితల అనుమతి తీసికోవాలి. స్వర్గస్థులైన వారి రచనలకి సాధారణంగా కాపీరైటు ఉంటుంది. ఈ కాపీరైటు పుస్తకం అచ్చయినాక కాక ఆ రచయిత మరణానంతరం ఏభై సంవత్సరాల పాటు ఉంటుంది. తరవాతనే ఆ రచయిత రచనలు పబ్లిక్ ప్రాపర్టీ అవుతాయి.

సి. వి. జి, సికింద్రాబాదు

మీరిలా సమాధానాలిచ్చుటవలన సంసారాలు బాగుపడతాయని అనుకోవడం పొరపాటేమోనని నా అభిప్రాయం. మరి మీ ఉద్దేశ్యం?

సంసారాలు బాగుపడ్డానికని సమాధానా లిస్తున్నానని నేను అనుకుంటున్నానని మీరనుకోవడం పొరపాటు. ఇవి సరదాకి, ఊహాపోహలు కలబోసుకుందుకు.

కె. ఎస్. ఆర్, హైదరాబాదు

నేటి పరిస్థితులను చూస్తే ప్రజలు సినిమాతారలకు 'గుళ్ళు' కడతారేమో.

కట్టినా ఆశ్చర్య పడనక్కరలేదు రావుగారూ, ప్రస్తుతం వాళ్ళ ఇళ్ళనే గుళ్ళగా భావించి ప్రదక్షిణాలు చేస్తాయి టూరిస్టు బస్సులు!

జి. ఆర్. ఆర్, కాకినాడ

చెప్పినవి విని ఒకటికి పది కల్పించేవారి నేమనాలి?

మధ్యన పరినెందుకనడం? కుళ్ళుమోతు నొక్క కూర్చుండి మాట్లాడిన, గొప్ప మర్మములను చెప్పరాదు' అన్నది గ్రహించవలసినది మీరు.

వి. జి. ఎస్, చూరిగుమ్మ


భగవంతునియందు భక్తిగాని అతని కర్మలయందు విశ్వాసముగాని కొంచమైనా కుదరని యొకడు మహాపురుషుడు కాగలిగాడు. భక్తివిశ్వాసములు లేనివాడు ముక్తికి దూరం అవరా!

అవరనేగా మన ప్రాచీన గాథలు చెప్తున్నాయి? నిగమ శర్మ చూడండి, దేవుణ్ణి తలపెట్టకైనా లేదు, బొందితో కైలాసం పొందాడట!

వి. ఎస్. కె, చిత్తూరు

చిత్తూరులో ఇటీవల జరిగిన జిల్లా రచయితల మహాసభలో ఒక రచయిత హిందీలో కావ్యగానం చేసినప్పుడు వీరు రెండు చెవులు మూసుకున్నారు. మీరు హిందీ వ్యతిరేకులా?

విన్నాం, మద్రాసు వరం కదా!



భర్త మరణం భార్య ఆత్మహత్య

వేలూర్ రెవెన్యూ బోర్డులో పనిచేస్తున్న27 ఏళ్ల సద్గురునాధన్ అనే అతను గుండెనొప్పి అని మెలితిరిగి పడిపోయాడట. ఆసుపత్రికి గమ్మున తీసుకు వెళ్లేసరికి అక్కడ చనిపోయాడుట. ఆవార్త విన్న అతని భార్యశకుంతల నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందట.

అభినవ ఋష్యశృంగుడు!

ఖుషిబ్‌లో 35 ఏళ్ళ గౌసు మహమ్మద్ అనే అతనికి రెండేళ్ళ క్రితం భరించరాని తలనెప్పి వచ్చేదట. ఆనక అతని తలమీదుగ ఓ చిన్నబొడిపి వంటిది లేచి, చూస్తుండగా అది కొమ్ములా ఆరంగుళాలు పెరిగిందట. దీన్ని డాక్టర్లు ఆపరేషనుచేసి



తీసినా, ఆకొమ్ముతాలూ ఒ వేళ్లు మెదడులోంచే వుండడంవల్ల కొమ్ము మళ్లీ పెరుగుతుందేమోనని డాక్టర్లు అభిప్రాయ పడుతున్నారు. పురాణం (రామాయణం) లో ఋష్యశృంగుడనే ఓ మహర్షికి నెత్తిమీద కొమ్మువుండేదట. ఈ గౌసుమహమ్మదు "అభినవ ఋష్యశృంగుడా!" ఫెంటాస్టిక్.

వివాహంకాకుండా గర్భవతైన కూతుర్ని హత్యచేసిన తండ్రి

వివాహం కాకుండానే గర్భంధరించిందన్న కోపంతో సుబ్బన్‌సింగ్ అనే 39 ఏళ్ళాయన తన 19 ఏళ్ళ కూతుర్ని అతిక్రూరంగా చంపాడట. ఇది లండన్‌లో జరిగింది. కూతురు పెళ్ళిగాకుండానే గర్భవతి అయిం దన్నవార్త విని, ఆవేశంలో ఆమెనెత్తిమీద సుత్తితో కొట్టి, ముక్కలు ముక్కలుగా నరికేశాడట. ఆనక, ఆ ముక్కలన్నిటినీ ఒక పెట్టెలో పెట్టి సింధూ శైలులో పడేశాడట. పోలీసులకు దొరికిన యీ పెట్టెల ఆమెతల మాత్రం లేదట. తరువాత ఓ నెల తరువాత సైకిలుమీద వెళుతున్న ఓ వ్యక్తికి పొదల్లో యీ తల కనుపించిందట. ఈఘోరం ఏప్రియల్లో జరిగింది. ఈకేసు లండన్ కోర్టులో జరుగుతోంది— తను చెప్పినతన్ని పెళ్లి చేసుకుని, తన పరువు నిలబెట్టకపోతే చంపుతానని బెదిరించిన కేసూ లండన్‌లో జరిగినదే

పరిసరాల ప్రభావం

మనిషికివున్న విషయపరిజ్ఞానశక్తి తను నిర్మించు కున్న పరిసరాలు మీద ఆధారపడి వుంటుంది. గడియారమే లేకపోతే మనిషి 48 గంటల రోజైనా భరించ గలడని ఫ్రెంచి శాస్త్రవేత్త మైకేల్ సెఫి అనే ఆయన పారిస్‌లో వెల్లడించారట. ఆప్స్‌పర్వతాలలోని ఆండన్ వద్దవున్న ఒక గుహలో 20 ఏళ్ల బీదయువకుణ్ణి నెలంరోజుల క్రితంపెడితే ఆ యువకుడు విశ్రాంతి అవసరం లేకుండా వరుసగా 24 గంటలు పని చేసి ఆనక 12 గంటలు నిద్ర పోయాడట— అయ్యా- వుద్యోగాలు చేసేవాళ్ళంతా చేరి, "బాబూ రోజుకు 12 గంటలు ఎంత బాగుండేదో" అంటే "అప్పుడు మేం సగం జీతమే యిచ్చేవాళ్ళం" అన్నారట. వుద్యోగా లిచ్చేవారు. అలా వుంది.

ఆకలిబాధ- అయిదుగురికి మరణం

బెంగుళూరుకు సమీపంలోవున్న ఒక గ్రామంలో ఆకలిబాధకు తట్టుకోలేక ఒక ఆమె తన పిల్లలు ఆకలితో పడే బాధను చూడలేక ఆ నలుగురు పిల్లల్నీ నూతిలో పడేసి, తనూ దూకి చనిపోయిందట. మరపి యీ అయిదు శవాలనూ బయటికి తీశారు.

• • •

బట్వాడాకాని ఉత్తరాలు 50 లక్షలు

అయ్యా గోహతిలో బట్వాడా చేయబడని ఉత్తరాల సంఖ్య 50 లక్షలట. ఇటీవల వచ్చిన వర దల నాధారంగా చేసుకుని "నెమ్మదిగా పనిచెయ్యి మన్నే మనగలరు"అనే పద్ధతివల్ల యీ విపరీతం వచ్చిందట.

క్యూలో మరణం

నైవేలిలో జెమినీవారి "ఒళివిళక్కు" అని (ఫూల్ అవుర్ పత్తర్ ఆధారం) తమిళచిత్రం క్యూలో 22 ఏళ్ల కలియపెరువాళ్ అనే అతను నలిగి, చనిపోయాడట. ఈసినిమాలో జయలలిత జానకి, యం. జి. రామచంద్రన్ నటీనటులు. యం. జి. ఆర్. సినిమా విడుదల సందర్భాలలో ఒక్కటి రెండు చావులు రివాజే.

* * *

జాక్‌పాట్ గుర్రం పందెంలో కడప—— వెంకటరామ రాజుకు, తిరుపతిలో చదువుకుంటున్న రమణారెడ్డి అనే యిద్దరికీ కలిసి ఎనిమిదిలక్షల చిల్లర వచ్చిందట. ఈడబ్బుమీద ఆదాయపు పన్ను వుండదు. ఇద్దరూ చెరో 4,13,968 రూపాయలూ తీసుకున్నారు. ఈ సారిజాక్‌పాట్ 3 లక్షల చిల్లర ఎవరికీ రాలేదు. హుర్రే!! అన్నకి!

పిల్లల్ని ఎదిరిస్తున్న ఎలుకలు

జపానులో పిల్లలు యీమధ్య సోమరిపోతు లయిపోతున్నాయని అక్కడి డాక్టర్లు గోలపెడు తున్నారు. చాలా లావవడం వల్ల, కడుపు నిండుగా వుండడం వల్ల యీ పిల్లలు మందకొడిగా వుండి కనబడిన ఎలుకలను పట్టుకోడం మానేస్తున్నా యని, దానివల్ల కొంచెం బలమైన ఎలుకలు పిల్లలమీదికి ఎదురు తిరిగివాటిని భయపెడు తున్నాయనీ, యీవిపరీతం తగ్గాలంటే పిల్లలు అర్థాకలితోనే వుండాలని ఆయన అన్నారు. అన్ బిలీవబుల్! బట్ బిలీవిట్.



తల్లిని హత్యచేసిన తనయుడు!

పోరూరు తాలూకా కిళక్కువేడు గ్రామంలో పెరుమాళ్ అనే అతను తనతల్లిని కొట్టిచంపి వేశాడుట. తండ్రి కొడుకు లిద్దరూ ఎవరికి విసుగు పుట్టిన పుడు వాళ్ళామెను కొట్టేశారట. పెరుమాళ్ కోపంతో ఆమెను జుట్టుపుచ్చుకుని గుంఝూయించి శక్తికొద్దీ బాదే సరికి ఆమె అక్కడే చనిపోయిందట. ఆనక అతను, అతని తండ్రి చిన్నసామి ఆమె (పొళ్ళాచిఅమ్మాళ్) శవాన్ని ఓ దూలానికి వ్రేలాడ దీసి, ఆత్మహత్యగా విరూపింప చూశారట.

వర్ధమాన నటి ఆత్మహత్య


తమిళ వర్ధమాన నటి వసంతరాణి అనే 17 ఏళ్ళ అమ్మాయి తన గుండెనొప్పి, ఫిట్సు భరించే వోపిక లేక ఆత్మహత్య చేసుకుందట మదరాసులోని తనఇంట్లో.

ఆవేశమూ-హత్యలూ-ఆత్మహత్యలూ

పోళూరులో పరమానందం అనే స్కూలు మేస్టారి భార్య కస్తూరి (26 ఏళ్ళు) తన నాలుగో కాన్పుకు పుట్టింటికి వెళ్ళి ప్రసవమై నాలుగు నెలలయినా తిరిగి భర్తవద్దకు వెళ్ళలేదట. దాంతో పరమానందం ఆమెను అడిగి అడిగి విసుగెత్తి, కత్తితో ఆమెను పొడిచి, చంపి, అడ్డమొచ్చిన అత్తగారినీ పొడిచి, తనింత విషంతిని, పోలీసులకు లొంగిపోయాడుట. లొంగిపోయిన కాస్సేపటికి ఆసుపత్రిలో చనిపోయాడట. జీవితం మీద రోతపుట్టకుండానూ, ఆవేశం కలగ కుండానూ వుండాలికానీ ఆరెండూ జరిగితే హత్యలూ, ఆత్మహత్యలూ కొల్లలు.

పట్టపగలు నడిరోడ్డుమీద హత్య

21 ఏళ్ళ ప్రభాకరన్ అనే ఒక సైకిలుషాపు అతన్ని 40 ఏళ్ళ వరదాచారి అనే అతను పట్టపగలు టీనగర్ నడిరోడ్డు మీద కత్తితో పొడిచి చంపి వేశాడుట. వీరి ద్దరికి ఏవో ఘర్షణలున్నాయుట. రోడ్డుమీద ప్రభాకరాన్ని చూసి, కత్తితో ఓ పోటు పొడిచాడట, 'బాబోయ్ రక్షించండి'' అని అరుస్తూ ప్రభాకరన్ పరుగెత్తి ఏయింట్లో నయినా దూరాలని ప్రయత్నించాడట. కానీ అందరూ తలుపులు వేసేసుకోడం వల్ల (భయంతో—ఎవరిభయం వారిది) వరదాచారి అతని పట్టుకుని క్రిందపడేసి కంఠంమూడొంతులు వరకూ కోసి, చంపేశాడట.



మొన్నామధ్య సిటీ బస్సు దిగిన ఓ 55 ఏళ్లాయనను ఓ పశువు కుమ్మేసరికి ఆయనక్కడే చనిపోయాడుట.

* * *

ఆంధ్రులంతా వొక్కటే (దేశమంతా కూడా వొక్కటే) కానీ తెలంగాణాకు చెందని ఆంధ్రులు తెలంగాణాలో వుద్యోగాలు చెయ్యరాదు. అట్టివారి వుద్యోగాల వూడపీక వలెను అనే నినాదాలు తెలంగాణాలో ముమ్మరంగా వున్నాయి. ఇదీ సంగతి.

గూడ్సులోనుంచి గోధుమల దొంగతనం

నంచర్ల రైలు స్టేషనులో (గుంతకల్లు—బొంబాయి రైలు మార్గం) ఆగివున్న గూడ్సు వాగనులో నుంచి గోధుమ మూటలు దొంగిలించడం చూసి, స్టేషను పోలీసులు జరిపిన కాల్పులలో ఒకరు చనిపోయారుట.

డాక్టర్ కబుర్లు

మెడమీది రక్తనాళాలు చిక్కుపడితే?

మెడ మీ ది రక్తనాళాలలో కొన్ని మెలికలు తిరిగినా, చిక్కుపడినా మూర్ఛ రావచ్చు. ఎందుకంటే మెదడులోకి రక్తం సరఫరా తగ్గిపోవటంవల్ల. మెదడులో రక్తనాళం విరిగితే, చిల్లుపడితే



ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయో ఈ పరిస్థితివల్లకూడా అటువంటి లక్షణాలే కనిపిస్తాయి. (రక్తపు పోటు అధికంగా ఉన్నప్పుడు రక్తనాళాలు విరగవచ్చు. చిల్లు పడవచ్చు.) ఇక్కడ ఒక సంగతి గమనించాలి. రక్తనాళాలు నీలం (చెడు) నెత్తురు తీసుకుపోయేవి కావు. ఎర్ర (మంచి) నెత్తురు తీసుకువెళ్లేవి.


ఈ రెండు రకాల బాధలనీ ఎలా తెలుసుకోవడం? తలని హఠాత్తుగా తిప్పితే, కదిపితే మయకం వచ్చినట్లుంటే; చూపు మసక అయితే; చెవులలో గింగుర్లు ఎత్తితే; కాళ్ళు, చేతులు మొద్దుబారితే; తెలివి తప్పితే మెడమీది రక్తనాళాల బాధేనని ఊహించవచ్చు.

కొన్ని ఉదాహరణలు: ఒక వ్యక్తి కారు నడుపుతూ తలని హఠాత్తుగా తిప్పటంచేత తెలివి తప్పాడు. ఒకావిడ భోజనం చేసే ముందుగా ప్రార్థించటానికి తలని వంచినప్పుడు స్పృహ కోల్పోయింది. ఒక పక్క అంతా పక్షవాతం వచ్చిన ఒక మనిషి తన తలను కొద్దిగా కుడి వయిపుకి తిప్పటంచేత పక్షవాతం తగ్గటం గమనించాడు. కొన్ని సమయాలలో అసలే ఉండేది కాదుట.

మెలికలు తిరిగిన నాళాన్ని ఆపరేట్‌చేసి బాధని పోగొట్టవచ్చు.

హెచ్. ఎల్. హెర్షెన్‌సోన్

(కాపీరయిటు)



'పేదరాశి పెద్దమ్మ కథ'లో విజయలలిత, రామకృష్ణ.

<u>చిత్రసమీక్ష:</u>

పేదరాశి పెద్దమ్మ కథ

ఉగ్గుపాలతోనే పేదరాశి పెద్దమ్మ కథల్ని జీర్ణించుకొన్నవారు తెలుగువారు. వారిని రంజింపచెయ్యాలనే కోరికతో 'పేదరాశి పెద్దమ్మ కథని' చలన చిత్రంగా పి. యస్. ఆర్. పిక్చర్స్‌వారు సమర్పించారు.

కథ ప్రేక్షకునికి గందరగోళంగా వుంటుంది. అయినా దానిని ప్రేక్షకులు ఉత్సాహంగా చూడగల్గుతారు — అంటే దానికి కారణం చిత్రీకరణ. రసవత్తరమైన చిత్రీకరణ ప్రేక్షకులని ఆకట్టుకుంటుంది. ఇందుకు ముఖ్యంగా స్క్రీన్ ప్లే, దర్శకత్వపు బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించిన గిడుతూరి సూర్యం ప్రశంసనీయులు. కథ ఎలా వున్నాసరే పూర్తి విడివి చిత్రాన్ని తియ్యొచ్చునని ఆయన నిరూపించి చూపించారు

కొన్ని వింతమృగాలని సృష్టించడంలోను, పిశాచాలని కల్పించడంలోను చిత్రానికి ఆకర్షణ పెరిగింది. చిత్రంనిండా అమాయికులు కన్నుల పండువుగా కనిపిస్తారు. ఇదీ ప్రత్యేకత! ఇవికాక—కత్తి యుద్ధాలు, మంత్ర తంత్రాలు ప్రేక్షకుల్ని పేదరాశి పెద్దమ్మ కాలానికి తీసుకుపోతాయి.

ఇది పేదరాశి పెద్దమ్మ చెప్పిన కథ. ఆ పాత్రకి అంత ప్రాముఖ్యం లేదు కనక పేదరాశి పెద్దమ్మ కథ అనుకుంటే పొరపాటే. కథ అల్లుకుపోడానికి మాంత్రికుడు కీలకమవుతాడు. ఆ మాంత్రికుని చేతులో పాత్రలన్నీ కీలుబొమ్మ అవుతాయి. ఈ బొమ్మలు అతనిచుట్టూ తిరిగి మరీ అంత ఎక్కువ శ్రమ పడకుండానే అతన్ని హత మార్చేస్తాయి!—ఇదీ కథ.

జానపదాల్లో లోపాల సంగతి అడక్కూడదు. నాగలోకానికి చేరుకోడానికి ఒక ప్రధాన పాత్ర పడ్డన్నిపాట్లు, మరో హాస్యపాత్ర పడక్కరలేదు! ఇలాంటివి జానపద చిత్రాల్లో సహజం. కథ నడిచే విధానంలో బిగి వుందా లేదా అని చూడాలిగాని 'ఎప్పుడు? ఎందుకు? ఎలా?' అనే ప్రశ్నలు వేసుకోకూడదు. బాక్సాఫీసును దృష్టిలో వుంచుకొని నడచిన జానపద చిత్రాల త్రోవలోనే పేదరాశి పెద్దమ్మ కూడా నడిచింది. అందుచేత 'జనాన్ని' తృప్తి పరచామన్న సంతృప్తి చిత్రానికి దక్కుతుంది.

కథానాయికగా కృష్ణకుమారి, కథానాయకుడుగా కాంతారావు—చిత్రం మొత్తం విడివిమీద చూస్తే—తక్కువగా కనిపించినా, వారు ప్రేక్షకుల మనసును దోచుకోగల్గుతారు. రామకృష్ణ హీరోచితమైన పాత్రలకి తగువనిపించాడు. రాజవాల ఏ వేషం వేసినా రక్తి కడుతుంది. మాంత్రికుడుగా ఈ చిత్రానికి సర్వాంగ రక్షకుడయ్యాడు. తదితర ముఖ్యపాత్రలని విజయలలిత, రాజసులోచన, ప్రభాకరరెడ్డి, బాలకృష్ణ, మిక్కిలినేని, మొదలైనవారు పోషించారు.

సంగీతం: కోదండపాణి, కథ: యస్. ఎం. సంతానం, మాటలు చిల్లర భావనారాయణరావు రాశారు. నిర్మాత పింజల సుబ్బారావు. పేదరాశి పెద్దమ్మ కథని విన్నంత ఉత్సాహంగానూ ఈ చిత్రాన్ని ఆబాలగోపాలమూ చూడగల్గుతారు.

—సితరాజు

సినిమా డైరీ

- కేంద్రప్రభుత్వంచే రాష్ట్రపతి రజతపతకాన్ని పొందిన "సుడిగుండాలు" నిర్మాతలు అక్కినేని, ఆదుర్తి ఢిల్లీలోని "విజ్ఞాన్‌భవన్"లో రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ గారి వద్ద నుండి తేది 25—11—68 న బహుమతి నందుకున్నారు.
- ఎన్. ఎ. టి. అండ్ రామకృష్ణ కంబైన్స్ "వరకట్నం" అవుట్‌డోర్ షూటింగు నవంబర్ 23 నుండి తాడేపల్లిగూడెంలో జరుగుతుంది.
- రాజలక్ష్మి పిక్చర్స్ తెలుగులో నిర్మిస్తున్న "ప్రణయమా పాశమా" చిత్రానికిగాను వాణిశ్రీ చేసిన ట్విస్ట్ డ్యాన్సును రామచంద్రరావు సహాయంతో 23—11—68 న చిత్రీకరించారు.
- గౌరి ఆర్ట్స్ పిక్చర్స్ "దేవుడు యిచ్చిన భర్త" షూటింగు గోల్డెన్ స్టుడియోలో 26.11.68 రాత్రి 9 నుండి 27—11—68 ఉదయం వరకు సాగింది. పద్మరాజు దర్శకత్వంలో చిత్రంలోని నటీనటులందరూ పాల్గొన్నారు.
- ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ నిర్మించే పౌరాణిక చిత్రంయొక్క షూటింగు డిసెంబరు మూడవవారంలో సారథి స్టుడియోలో ప్రారంభమౌతుంది. ప్రత్యగాత్మ దర్శకత్వాన్ని, ఆత్రేయ రచనను సాగిస్తున్న యీ చిత్రాన్ని ఏ. వి. సుబ్బారావు నిర్మిస్తున్నారు.
- శ్రీరాజ్ ఆర్ట్స్ ఫిలింస్ యూనిట్ 26—11—68 ఉదయం నాగార్జునసాగర్‌కు బయల్దేరి పోయింది. షీలా, శోభన్‌లు నటించే సన్నివేశాల్ని కె. ఎస్. గోపాలక్రిష్ణన్ చిత్రీకరిస్తారు.


తప్పక చూడండి!
A.S.Murty
పి.యస్.ఆర్. పిక్చర్స్ సమర్పించు
పేదరాశి పెద్దమ్మ కథ
నిర్మాత
పింజల సుబ్బారావు
స్క్రీన్ ప్లే - దర్శకత్వం
గిడుతూరి సూర్యం
VIJAYA



'నిండుసంసారం'లో విజయలలిత.



'కథానాయకుడు'లో జయలలిత, రామారావు.

సినిమా

కాశీనాథ్‌తాతా, రాజనాలచేత మృత్యుంజయ హోమాన్ని చేయిస్తున్నాడని విన్నాను. రాజనాల యింటికి ఫోనుచేసాను; లేరు— శారదా స్టూడియోకి వెళ్లారు అని సమాధానం వచ్చింది; నేనుకూడ శారదాకు వెళ్లాను. అక్కడ రాజనాల పరమ నిష్ఠాగరిష్ఠుడై, కాశీనాథ్ చెప్పినట్టుల్లా హోమనియమాన్ని పాటించాడు; ఈహోమం పదిరోజులు జరిగితే అందులోనుండి ఒక తాయెత్తు వస్తుంది; ఆ తాయెత్తును కట్టుకున్నవారికి ప్రాణభయం వుండదు అని తాతా చెప్పగా విని తదనుగుణ్యంగా రాజనాల ప్రవర్తిస్తాడు; రాజనాల హోమం యెందుకు చెయ్యాల్సి వచ్చింది అని మీరు అడుగుతారుగా, మరేంలేదు — ఆయనకు పుట్టిన కుమారుడు పదవరోజా హతుడు గాకుండా వుండాలని యీ హోమానికి పూనుకున్నాడు. హోమగుండంద్వారా వెలువడ్డ తాయెత్తును తన భార్యకు కట్టడమా లేక తన తనయునికి తగిలించడమా అనేది పెద్ద సమస్యగా పరిణమించింది రాజనాలకు; కడకు కుమారునికే ఆ తాయెత్తును కడ్తాడు. తాయెత్తు కట్టినందువల్ల రాజనాల కుమారుడు బ్రతుకుతాడా లేదా అనేది తెల్సుకోవాలంటే రాజా పిక్చర్స్ నిర్మిస్తున్న 'రాజసింహ' చిత్రం చూడండి. రాజనాల భార్యగా పండరీబాయి, కుమారుడిగ కాంతారావు నటిస్తున్న, పీటూరి వ్రాసిన జానపద చిత్రానికి సుబ్బరామదాసు దర్శకుడు; వాణిశ్రీ, గీతాంజలి నాయికలుగా నటించే యీ చిత్రంలో సత్యనారాయణ మాంత్రికుడిగా నటిస్తున్నాడు. బి. వీరరాజా నిర్మించే యీ చిత్రాన్ని ఆంధ్రాలో అపరాజిత విడుదల చేస్తారు.

పేదకు దొరికిన పెన్నిధి

శారదాస్టూడియోనుండి నాచూపు ప్రసాద్‌వైపు వెళ్లింది. నేను ప్రసాద్‌లోకి పోవడం, అదే సమయానికి ప్రభాకరరెడ్డి మరోవైపు నుండి పరుగు పరుగున రావడం జరిగింది. ప్రభాకరరెడ్డి యెక్కడికి పరుగిడుతూ వచ్చాడో తెలుసా? మీ అభిమాన నాయకి


'మొనగాళ్ళకు మొనగాడు' సమర్పించిన
మోడరన్ థియేటర్స్
106వ చిత్రం
ఎవరు మొనగాడు?
దర్శకుడు ఆర్. సుందరం B.E
నవయుగ విడుదల
సోల్ డిస్ట్రిబ్యూటర్స్
అనిల్ ప్రభాస్ ఎంటర్ ప్రైసెస్

నాయకుడయిన జయలలిత, రామారావుల దగ్గరికే; వాళ్ళ దర్శించి యేదో మాట్లాడుదామనుకుంటాడేగాని ఆనంద పారవశ్యంలో మూగవాడవుతాడు. ప్రభాకర రెడ్డిని రామారావే పలుకరిస్తాడు; దానికి ప్రభాకరరెడ్డి యిలా సమాధానమిస్తాడు. 'బాబూ మీ అంత మంచివారిని నేనెక్కడా చూడలేదు. నాకు జయ అంతా చెప్పింది. కట్నం యిస్తామంటే వొద్దని, యేమీలేని పేదదని తెలిసికూడ నాచెల్లెలిని మీరు పెళ్ళిచేసుకునేందుకు అంగీకరించినందుకు నేనెంతయినా ఋణపడి వున్నాను.' ప్రభాకర రెడ్డి యిలా అంటూవుంటె, రామారావు జయలలితవంక తదేకంగా చూడడం, ఆమె సిగ్గుతో తల వంచుకోవడం, ఆ సిగ్గు మొగ్గలు లొడిగి ఆమె బుగ్గలు కెంపులే అయినాయా అనిపించింది. రామారావును భర్తగా పొందగల్గుతున్నాననే ఆనందంలో జయలలిత వుబ్బి తబ్బిబ్బవుతుంది; ఆమె మేను పులకరించింది. బ్రతుకులో పన్నీటి జల్లు కురియబోతుందని మురిసిపోతుంది జయలలిత. ఈ రసవత్తర సన్నివేశం మొందులోదనుకుంటున్నారు. 'కథానాయకుడు' చిత్రం లోనిదే. హేమాంబధరరావు దర్శకత్వం వహిస్తున్న యీ చిత్రాన్ని గోపాలకృష్ణ నిర్మిస్తున్నారు. ముళ్ళపూడి కథకు, భమిడిపాటి సంభాషణలు వ్రాసారు. స్వామి కెమెరాను, కృష్ణ అర్జున, రాజు సంగీతాన్ని నిర్వహించే యీ సాంఘికం

సినిమా

పూర్ణాద్వారా ఆంధ్రాలో విడుదలౌతుంది. పై సన్నివేశంలో సారథిగా ఎన్. టి. ఆర్, జయగా జయలలిత, నాగులుగా ప్రభాకర రెడ్డి నటించారు.

చేసిన నేరం?

అందమైన అబద్ధాలు!

ప్రసాద్‌నుండి వాహిని స్టుడియోకి వెళ్ళాను; వాహిని మొదటిఫ్లోర్‌లో దర్బారు సెట్టు జరుగుతూ వుంది. సింహాసనంపై ధూళిపాళ ఠీవిగా ఆసీనుడై వున్నాడు. కొలువులో ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ తమ తమ ఆసనాల్లో కూర్చుని వున్నారు. విజయలలిత, విజయనిర్మలలో వాదించడాన్ని దర్శకుడు విశ్వనాథం చక్కగా చిత్రీకరించాడు. ఆర్టిస్టుల ముఖ కవళికల్ని భాస్కర్ తన కెమరాతో విభిన్న కోణాల్లో చిత్రించాడు. ఆరోజు నేను కన్నదాన్ని మీకు చెప్పడం నా ధర్మం. సావధానంగా చదవండి, ఆ తర్వాత 'బొమ్మలు చెప్పినకథ' చిత్రంలో మీరు చదివింది వుందా లేదా అని పరీక్షించండి.

విజయనిర్మల: నేనతని చెల్లెలిని తెలుసుకుని నన్ను చూడాలని వచ్చాడు

విజయలలిత: ఆ బందిపోటు నీ అన్నేనని నమ్మమంటావా ?

నిర్మల: బందిపోటు గనకే, పట్టపగలు



'సత్తెకాలపు సత్తెయ్య'లో శోభన్‌బాబు, విజయలలిత, చలం.

మీకు తెలుసా

ప్రముఖ హిందీనటి మాలాసిన్హాకు ఆడశిశువు పుట్టింది; పుట్టినప్పుడు బిడ్డ బరువు ఆరు పౌన్లు ఎనిమిది ఔన్సులు; తల్లి, బిడ్డ సుఖంగా వున్నారు.

నటి రాజశ్రీకి ఎవర్‌సిల్వర్ పాత్ర అంటే చాలా యిష్టం; ఆమె యింటి నిండా ఎవర్‌సిల్వర్ బిందెలున్నాయని మీకు తెలుసా ?

నటి భారతికి తెల్లరంగు చీరెలను కట్టడం, కాలర్ జాకెటు లను ధరించడం సరదా.

వందపైచిలుకు టార్జాన్ చిత్రాల్లో నాయిక పాత్రను పోషించిన హిందీ నటి కృష్ణకుమారి హిందీలో 'కులగోత్రాలు' చిత్రాన్ని కె. పి. ఆత్మా దర్శకత్వంలో నిర్మిస్తూంది.

సురేష్ పిక్చర్స్ నిర్మిస్తున్న 'బొమ్మలు చెప్పినకథ'లోని యుగళ గీతాల్ని కలర్‌లో తీస్తారట.

శివాజిగణేశన్ నటించిన 125 వ చిత్రం ఎ. వి. ఎం. వారి 'ఉయర్ంద మనిదన్'; ఇతడు నటించిన 'పరాశక్తి' (తొలి చిత్రం) విడుదలయినప్పుడు యెంత ప్రజాదరణ పొందిందో యిప్పుడు విడుదలయినప్పుడు కూడ అదే ప్రేక్షకాభిమానాన్ని పొందగలిగింది.

బహిరంగంగావస్తే నన్ను బందిపోటు చెల్లెలు అని లోకం కించపరుస్తుందని, నా జీవితం నాశనమై పోతుందనే భయంతో అర్థరాత్రివేళ కలుసుకోవాలని వచ్చాడు.

లలిత: మీ ప్రేమకలాపం నేను పట్టుకోగానే అతను అన్నైపోయాడు; నీవు చెల్లెలివైపోయావ్. చేసిననేరం కప్పి పుచ్చడానికి యెంత తెలివిగా, యెంత అందమయిన అబద్ధాలు ఆడుతున్నావే.' ఈ సన్నివేశంలో నిర్మల, లలితల నటన పరాకాష్ఠ నందుకుంది; ధీమంతురాలిగా విజయనిర్మల, అహంకారిగా విజయలలిత

అద్భుతంగా నటించడానికి జూనియర్ మ్యూరాలి సంభాషణలే ముఖ్యకారణం అని నేను భావిస్తున్నాను. బందిపోటు యెవరు? మరెవ్వరో కాదు. మీకు రోజురోజుకీ సన్నిహితుడౌతున్న కృష్ణ! అతను బందిపోటుగా మారడానికి గల బలవత్తరమయిన కారణాన్ని సురేష్ పిక్చర్స్ చిత్రంవల్లే తెలుసుకోవచ్చు. డి. రామానాయుడు నిర్మిస్తున్న యీ చిత్రాన్ని విశాలాంధ్రలో నవయుగవారు విడుదల చేస్తారు.

'ఈ చిత్రంలో 18 సెట్స్ వుంటాయి; ప్రేమగీతాన్ని కలర్‌లో కొడైకెనాల్ లొకేషన్‌లో తీయాలనుకుంటున్నాను. క్లయిమాక్సు ఘట్టాన్ని యింతవరకు యెవ్వరూ చిత్రీకరించని విధంగా పెద్ద యెరీనాలో చేసి, ఇంగ్లీషు పిక్చరును మరిపించడానికి ప్రయత్నిస్తున్నాను; ఈ చిత్రం తెలుగులో బాగా ప్రదర్శింపబడితే, వెంటనే తమిళంలో కూడ తీస్తాను; నేను యేం చేసినా వ్యాపార దృష్ట్యే చేస్తాను, అంటూ యీ 'బొమ్మలు



'బందిపోటుదొంగలు'లో జమున.

చెప్పినకథ' తప్పక హిట్ అవుతుంది అని పొంగాను. బల్లగుద్ది చెప్పిన రామానాయుడు ధైర్యాన్ని, చొరవని అభినందించకుండా వుండలేక

* * *

డి. రామానాయుడుతో మాట్లాడుతున్న

సినిషా

సమయంలో దర్శకుడు తాతినేని రామారావు అక్కడికి వచ్చాడు, ఏమిటి, షూటింగా అని అడిగాను 'కాదు. వాయిస్ డబ్బింగు కొంత వుంటే వచ్చాను,' అన్నాడు. మీ ప్రోగ్రెస్ యెలావుంది అని ప్రశ్నించాను. 'మీకు తెలియనట్లు నన్ను అడుగుతున్నారే!' అని నవ్వి వూరుకున్నాడు నిదానం,



'విచిత్రసోదరులు'లో జయలలిత.

శాంతం, వృత్తిపై గమనంగల యువకుడూ రామారావు తన గురువు అయిన ప్రత్యగాత్మ పోయిన అండ కోల్పడనే సమ్మకం అతని టేకింగు కల్గిస్తుంది. ఇప్పుడూ విజయభట్, త్రివేణి, మధు పిక్చర్స్, పి. ఎ. పి. తదుపరి చిత్రాలకు దర్శకుడిగా నియమింప బడ్డాడు. —శ్రీనివాస్

పుస్తకాలు

రెండు పట్టాలు

రచన : శ్రీ 'మంజుశ్రీ' ఎమెస్కో పాకెట్ సైజు 244 పేజీలు, వెల: రు. 2. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో, మదరాసు, సికింద్రాబాదు, మచిలీపట్నం.

మంచీ—చెడూ, కష్టం—సుఖం, పుట్టుక—చావు అనే ద్వంద్వాల మధ్య ప్రాణికి చిత్రమయిన సంబంధం ఉంది. అదే జీవిత మంటే. చెడు లేని మంచికీ, కష్టం లేని సుఖానికీ విలువ లేదు. చావు లేని పుట్టుక లేనేలేదు. ఆస్తికత్వం లేనిదే నాస్తికత్వం లేదు. సనాతనత్వం లేని అధునాతనం లేదు. అలాగ్గానే అభ్యుదయమున్నూ.

ఇదే సూత్రాన్ననుసరించి, మంచీ—చెడూ అనే రెండు పట్టాల మీద నడుస్తుంది నవల. సనాతనత్వంలో బయల్దేరి అధునికంలోకి దారి తీస్తుంది. పల్లెటూరి వాతావరణంలో కాస్సేపూ, బస్తీలో కాస్సేపూ ప్రయాణం చేస్తుంది. రామిరెడ్డి జబర్దస్తీలతో నడిచి, అతని పశ్చాత్తాపంతో ముగుస్తుంది. ఆచార్యుల వారి సహనాన్ని ప్రదర్శించిన ఈ నవల, వారికి మంచిరోజులు చూపిస్తుంది.

ఈ నవల సగానికి పైగా, చిన్నరెడ్డి జబ్బుతోనే పెరిగింది. కాగా—ఆ పాత్ర మరీ అర్భకంగా తయారు కావటం సహజమే. ఇందులో వైష్ణవ మత సంబంధమైన పదజాలం మరీ విరివిగా కనిపిస్తుంది. ముఖ్యంగా 'తండ్రి', 'నాన్న' అనే మాటల వాడకం కాస్త తికమక పెడుతుంది. అపారంగా వచ్చిపడుతున్న అభ్యుదయ రచనలతో పాటు ఇటువంటి నవల పాఠకులకు కాస్త వెరైటీగా ఉంటుంది. —శివకుమార్.

కన్యాశుల్కం

మహాకవి గురజాడ అప్పారావు రచన 'కన్యాశుల్కం' (ఎమెస్కో పాకెట్ బుక్) మా కార్యాలయం చేరింది. రెండు వందల యాభై ఆరు పేజీల ఈ పుస్తకం వెల రెండు రూపాయలు. ప్రతులకి ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్‌కి రాయాలి.

యదార్థ విశ్వాసము

శ్రీ బ్రహ్మానంద కేశవచంద్రసేన్ రచించిన, శ్రీ కామరాజు హనుమంతరావు అనువదించిన 'యదార్థ విశ్వాసము' మా కార్యాలయం చేరినది. 28 పేజీల ఈ పుస్తకం వెల 40 పైసలు. ప్రతులకి ప్రాక్ ప్రతీచీ గ్రంథమాల, రాజమహేంద్రవరముకి రాయాలి.

ప్రేమ మందిరాలు

శ్రీ చిట్టూరి రచన ప్రేమమందిరాలు (నాటకం) మా కార్యాలయం చేరింది. 92 పేజీల ఈ పుస్తకం వెల రెండున్నర రూపాయలు. ప్రతులకి వి. జి. ఎస్. పబ్లిషర్స్, అమలాపురంకి రాయాలి.

ఆటలు

హాకీలో ఓడినందుకు క్రికెట్‌లో దెబ్బ



ఎం. సి. సి. జట్టువారి దక్షిణ ఆఫ్రికా పర్యటన రద్దు కావటంతో వారు భారతదేశం పర్యటించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వారు మన దేశానికి వస్తే మనకి 20,000 పవున్ల దాకా (సుమారు 360,000 రూపాయలు) విదేశ మారకం ఖర్చు అయ్యేది. ఈ ఖర్చుకి భారతప్రభుత్వం అంగీకరించలేదు. ఎందరో క్రికెట్టు అభిమానులు నిరాశ చెందారు!

అసలు ఎం. సి. సి. వారు దక్షిణ ఆఫ్రికా పర్యటన రద్దు కావటానికి కారణం డి' ఒలివెయిరా అనే నల్లజాతి ఆటగాడిని ద. ఆఫ్రికా ప్రభుత్వం రానివ్వదనటమే. అటువంటి పరిస్థితులలో ఎం. సి. సి. నల్లదేశాలయిన పాకిస్తాన్, సిలోన్, ఇండియాలని పర్యటించటానికి పూనుకోనటం వారి సహృదయ వైఖరిని తెలుపుతుంది.

ఈ భారతదేశ పర్యటనే సంభవించి ఉంటే మన ఆటగాళ్ళకి మంచి అవకాశంగా ఉండేది! మంచి క్రీడాకారులతో ఆడే అవకాశం వారికి దొరికేది. ఇంగ్లాండు జట్టువారు వెస్టిండీస్‌ని ఓడించారు, ఆస్ట్రేలియాతో ప్రథమ గౌరవాన్ని పంచుకున్నారు. వారి ఆట మంచిస్థాయిలో ఉందన్నమాట!

మన అధికారులు అన్న మాటలలో ఒకటి గమనించ తగ్గది—ఎం.సి.సి. వారు కోరిన ఏర్పాట్లు, మొత్తాలు మన జట్టు పోయిన సంవత్సరం ఇంగ్లాండుకి వెళ్ళినప్పుడు వారికి ఇచ్చిన వాటికంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. సరే, ఎక్కువగానే ఉన్నాయి. కాని, భారతదేశం ఇంగ్లాండుతో ఆడి ఎన్ని టెస్టుమాచ్‌లిని గెలిచింది?

పోనీ మన జట్టు ఇంగ్లాండు, కెన్యా, ఆస్ట్రేలియా, న్యూజిలాండు వెళ్ళి ఆడినప్పుడు ఎంత విదేశద్రవ్యం సంపాదించింది? దీనినీ లెక్కలోకి తీసుకునికదా ఎం. సి. సి. వారికి సమాధానం ఇచ్చి ఉండాలి?

విదేశమారకం పరిస్థితి ఎప్పుడూ ఇబ్బందిగానే ఉంటుంది. ఎలాగో సర్దుకిపోయి ఉంటే బాగుండేది.

ఒలింపిక్స్‌లో హాకీలో ఓడిపోయాము కాబట్టి ప్రభుత్వం ఎం. సి. సి. కి కావలిసిన పవున్లు ఇవ్వనన్నారుట. హాకీలో ఓడిపోతే క్రికెట్టుని మానటం ఏమి బాగుంది!

మన జట్టుస్థాయి అసంతృప్తికరంగానే ఉంది కాని కొందరు ఆటగాళ్ళు మాత్రం బాగా ఆడుతున్నారు. వారి ఆటని మరింత బాగు పరుచుకొనటానికి ఇదొక మంచి అవకాశంగా పనికి వచ్చేదేమో—

—కె. ఎస్. నరసింహన్

గమనిక

ఉత్తరాలు రాసేవారు తమ పేరు, చిరునామా పూర్తిగా తెలుగు లిపిలోనే రాయాలి. ఇంగ్లీషు (లేక ఇతర) లిపి అక్షరాలు వాడిన వారి ఉత్తరాలు ప్రచురించ టానికి వీలుకాదు.

—సం.

పుస్తకాలు

జల్సారాజా

శ్రీ చిట్టూరి రచించిన 'జల్సారాజా' నాటకం మా కార్యాలయం చేరింది. మూటనలభై పేజీలు కల ఈ పుస్తకం ఖరీదు రెండు రూపాయల యాభై పైసలు. ప్రతులకి వి. జి. యస్. పబ్లికేషన్స్, అమలాపురంకి రాయాలి.

చైత్రపూర్ణిమ

రచన: శ్రీ పి. గణపతిశాస్త్రి. పాకెట్ సైజు 191 పుటలు. వెల రూ. 2. ప్రకాశకులు: యం. శేషాచలం అండ్ కో, మచిలీపట్టణం, మద్రాసు, సికింద్రాబాదు.

ప్రాచీనకాలంలో కాశ్మీరం సమస్త విద్యలకూ, సంస్కృత భాషా వాఙ్మయాలకూ సరస్వతీ పీఠం. కాశ్మీర మహారాజుల పోషణలో అనేక అమూల్యాలైన గ్రంథాలు రచితము లయాయి. వాటిలో కల్హణ మహాకవి రాజతరంగిణి ముఖ్యంగా చెప్పదగ్గది. పద్యరూపంగా వున్న ఆ బృహద్గ్రంథంలో రసవంతాలయిన కథలు అనేకంగా ఉన్నవి. సంస్కృతాంధ్రాలలో విద్వద్వతంసులూ, ఆధునికాంధ్ర రచయితలలో పెద్దతోబుట్టువులు కలిపినవరూ కవితల్లజులూ అయిన శ్రీ పి. గణపతిశాస్త్రిగారు అందలి కథలను కొన్నిటిని ఆధారం చేసుకుని యీ కథాసంచాన్ని కూర్చారు. ఇందులో ఇదివరకు ప్రకటితాలూ, అప్రకటితాలూ చేరి వున్నాయి. వీటిని గురించి "ముందుమాట" లో రచయిత "ఈ సంపుటిలో కథలు కేవలం రాజతరంగిణి కథల కనువాదాలు కాని, అనుసరణలు కాని కావు. రాజతరంగిణిలో అక్కడక్కడ కనిపించిన కొన్ని గాథలు ఘట్టాలు, వర్ణనలు, సూచనలు, విశేషంగా మార్చి వినూతన పాత్ర చిత్రణలతో వేనివి రచించాను. ఇంతే కాదు. కథాశిల్ప దృష్టితో మూలకథలు కొన్ని గుర్తించడానికి వీలులేనంతగా సరికొత్త రీతులలో మలిచి వెయ్యడం జరిగింది" అని చెప్పుకున్నారు. రాజతరంగిణిలో కల్హణుడు చెప్పిన వాటి కంటె యిందులో కథలు అత్యుత్తమంగా మలచబడి వుండవచ్చు. ఆ సంగతి, రాజతరంగిణిని దగ్గర పెట్టుకుని వీటిని చదివిన వారికే తెలియాలి.

ఇందులో 'చైత్రపూర్ణిమ' మొదలైన పది కథలున్నాయి. మొదటి కథ పేరే పుస్తకానికి పెట్ట బడింది. కథలు వ్యావహారిక భాషలో వున్నా సంస్కృత పదాలు ఎక్కువ పాలులో వాడడం వల్ల సామాన్యులు సులభంగా అర్థం చేసుకోవడం కష్టం. కథను ప్రారంభిస్తే పూర్తిగా చదవడానికి విసుగు కూడా కలుగుతుంది కొన్ని సందర్భాలలో. జనసామాన్యానికి సులభ పద్ధతిలో తెలుగు కథా వాఙ్మయాన్ని సంచి పెట్టదలచిన ఎమెస్కో వారి ప్రచురణ సరళంగానూ, రసవంతంగానూ ఉండడం అవసరం.

—ఆంగీరస

మృత్యుంజయులు

(నవల) రచన: బొల్లిముంత శివరామకృష్ణ. ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్. విజయవాడ—2. పుటలు 172, వెల రు 3—00.

సమకాలీన తెలుగు సాహిత్యాకాశంలో సాంఘిక నవలా నక్షత్రాలుద్భవించడం ఎంత హర్షదాయకమో, రాజకీయ సమస్యా చిత్రణ నక్షత్రాలుద్భవించడం కూడా అంత ముదావహం. అయితే రాజకీయమైన పరిస్థితులను ప్రతిబింబించే రచనను కళాత్మకంగా సాగించడానికి రచయితలో (Objectivity) పుష్కలంగా వుండాలి. సమస్యను అన్ని కోణాలనుంచి దర్శించే విశాల హృదయం వుండాలి. శ్రీ బొల్లిముంత శివరామకృష్ణలో ఆవేశం వుంది, కానీ ఒక దృక్పథానికి, ఒక జీవన తత్వానికీ ఆయన కట్టుబడి వుండడంవల్ల, రచనలో రావలసినంత విశ్వసనీయత రాలేక పోయింది. తెలంగాణా ప్రజలు నిజాం నిరంకుశ ప్రభుత్వాన్నీ, దోపిడివిధానాన్నీ ఎట్లా ఎదిరించిందీ ఈ ఈ నవల స్పష్టంగానే తెలియ పరుస్తుంది. కాని ఈ తరగతికి చెందిన వట్టికోట ఆళ్వారుస్వామి, మహీధర రామమోహనరావు గారల రచనలతో పోలిస్తే, ఈ నవల పేలవంగా కన్పిస్తుంది. ఇది ఇందుకు రచయిత తెలంగాణా వాసి కాకపోవడం, పాత్రోచితమైన ఆ ప్రాంతీయభాషను, నుడికారాన్ని, యాసను ఆకళించుకొనక పోవడం కారణాలుగా కన్పిస్తున్నాయి. సాధారణమైన రైతుబిడ్డ "సంఘం"లో సభ్యుడై, దేశముఖ్ లను, జాగీర్దారులనూ, వతన్‌దారులనూ ఎదిరించ ప్రయత్నించడం ఇందులో చిత్రితమైంది. దేశ్‌ముఖ్ జీవనలీల, అప్పన్న అమానుష కృత్యాలు, పటేల్ పాపిరెడ్డి తందానతాన, మహబూబ్ అవకాశవాదం, సార్జెంట్ అధికార దుర్వినియోగం ఎంత చక్కగా, భీభత్స, జుగుప్సాకరంగా చిత్రింపబడ్డాయో, రాములమ్మ, రాజాల కథలు అంత కరుణ రసాత్మకంగా వివరింపబడ్డాయి. పాపిరెడ్డి జీవితంలో వచ్చిన మార్పుకు ఇంకా కొంత వివరణం వుండి వుంటే బావుండేది. కిషన్‌చందర్, గోర్కీల రచనా పద్ధతిని బొల్లిముంత అనుసరించి వుంటే, నవల ఇంకొంచెం గంభీరంగా కన్పించేది. మనుషులందరూ పూర్తిగా మంచివారుగాని, చెడ్డవారుకానీ, కారన్న సత్యాన్ని కానలేక, పడికట్టురాళ్ళతో కేవలం తెలుపుగానో లేక కేవలం నలుపుగానో వారిని చిత్రించడం వలన, నవలలో 'కళాత్మకమైన విఫలత' కన్పిస్తుంది. ఏమైనప్పటికీ తెలుగులో ఇటువంటి నవలలు మరిన్ని వెలువడాలి. పునర్ముద్రణంలోనైనా శివరామకృష్ణ గారు నవలలో పరిపూర్ణత సాధిస్తే సాహితీపరులు ఎంతో సంతోషిస్తారు. లేకుంటే ఇరవై సంవత్సరాల క్రిందటికీ, ఇప్పటికీ, భేదం లేకుండా పుస్తకప్రచురణం సాగితే, రచయితకూ, ప్రకాశకులకూ లబ్ధి, ఆనందమూ కలుగవచ్చునేమో తప్ప, తెలుగు పాఠకులకు మాత్రం అసంతృప్తి తప్పదు.

— శ్రీరామచంద్రమూర్తి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



ఆంధ్ర: జోతి + సీడెడ్: నవభారత్ + నైజాం: దివ్యదత్త



చక్కని చుక్కలా
వయ్యారాలు
ఒలుకుతూ ఉండగా